Pubilshed from Kakinada

PRGI NO : APTEL/25/A1470

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com


మనిషి మనుగడలో అతిముఖ్యమైనది
శాంతి సుఖం సంతోషం ఆర్థికాభివృద్ధిఎదుగుదల,
ఇలాంటివి సాధించుకోవటానికి ఎదురయ్యే సమస్యలకు
గృహవాస్తు. జాతకదోషాలు,
అనేక రకాల సందేహాల నివృత్తి కోసం
చక్కటి పరిష్కారం కోసం సంప్రదించగలరు.

వాస్తు - జ్యోతిష పండితులు
మహామంత్రోపాసకులు
శ్రీ లలితాంబికా పీఠం వ్యవస్థాపకులు
బ్రహ్మశ్రీ మాడుగుల శివప్రసాద్ గురూజీ
79970 39039

కాకినాడ KAKINADA | సంపుటి : 02 Vol.No : 02 | సంచిక : 221 Issue No : 221 | గురువారం Thursday | జూలై 2, 2026 2 JULY 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana

## తెలుగువారిని అందలం ఎక్కించటమే

## కూటమి లక్ష్యం



- రాష్ట్రంలో ప్రజాభీష్టం ప్రకారమే కూటమి ప్రజా ప్రభుత్వ పాలన
- పొదుపులో మన డ్వాక్రా మహిళలు దేశానికే ఆదర్శం
- నేరస్థులకు వంతపాడే రాజకీయ పార్టీలు మనకెందుకు
- సైకో సహకారంతోనే గొడ్డలి పార్టీ నేతల మాటలు, చేతలు
- మావిగన్ అన్న వ్యక్తులు రాజధానికి రౌడీల్లా దండయాత్రలు
- నెల్లూరు జిల్లా పున్నపువారిపల్లెలో పేదల సేవలో కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

2 లో

ప్రజాభూమి ప్రతినిధి,గూడూరు : రాష్ట్రాభివృద్ధితో పాటు తెలుగువారిని అందలం ఎక్కించటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన అందిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజాభీష్టం మేరకే సుపరిపాలన అందిస్తున్నామని వివరించారు. ప్రజల జీవితాల్లో శాశ్వతంగా వెలుగులు నింపే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. నెల్లూరు జిల్లా గూడూరు నియోజకవర్గం పున్నపువారిపాలెంలో బుధవారం పేదల సేవలో కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ప్రజా వేదిక సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...."ప్రజలు చూపిస్తున్న అభిమానంతో పడుతున్న కష్టాన్ని మర్చిపోతున్నాం. గత పాలకులు నెల్లూరు జిల్లాను అశాస్త్రీయంగా విభజించారు. గూడూరును తిరిగి నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చి నెరవేర్చాం. సైదాపురం, కలవాయి మండలాలను కూడా నెల్లూరు జిల్లాలో కలిపాం. ప్రజల అభీష్టం ప్రకారమే పరిపాలన జరగాలి. పెత్తందారీ వ్యవస్థకు చోటు లేదు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా అశాస్త్రీయంగా జరిగినల్లాల విభజనను సవరించాం. ప్రజల జీవితాల్లో శాశ్వతంగా వెలుగు నింపాలనే లక్ష్యంతోనే పనిచేస్తున్నాం. సామాజిక బాధ్యతగానే ప్రతీ నెలా 1వ



## జులై 20 నుండి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ..!

న్యూఢిల్లీ : పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20 నుండి ప్రారంభం కానున్నాయి. మూడు వారాల పాటు సమావేశాలు కొనసాగను న్నాయని సంబంధిత వర్గాలు బుధవారం ప్రకటించాయి. అయితే పార్లమెంటరీ వ్యవహారాల కమిటీ తుది నిర్ణయం ప్రకటించాల్సి వుందని వెల్లడించాయి.

సాధారణంగా వర్షాకాల, శీతాకాల సమావేశాలు నాలుగువారాల పాటు సాగుతాయి. సుమారు 20 రోజుల పాటు సమావేశాలు జరుగుతాయి.అయితే కొన్ని సందర్భాల్లో తక్కువ వ్యవధిలో సమావేశాలు జరిగిన సందర్భాలు కూడా గతంలో ఉన్నాయి. పశ్చిమబెంగాల్, కేరళం, తమిళనాడు, అస్సాం, పుదుచ్చేరిల్లో ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి.

- మిగతా 2లో..

## 'సర్' పేరుతో పెద్ద కుట్ర జరుగుతోంది

### వైసీపీ అధినేత జగన్ సంచలన ఆరోపణలు

- స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం పేదవాడి ఓటు హక్కును కాలరాస్తున్నారన్న జగన్
- ఓటు లేకపోతే పేదలు సంక్షేమ పథకాలకు ఎలా అర్హులవుతారని ప్రశ్న
- ఓటర్ల జాబితాలో అక్రమంగా జోక్యం చేసుకుంటున్నారని మండిపాటు

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి :

"ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరుతో రాష్ట్రంలో పెద్ద కుట్ర జరుగుతోంది. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం పేదవాడి ఓటు హక్కునే కాలరాస్తున్నారు" అంటూ వైసీపీ అధినేత జగన్ కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాడేపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఓటర్ల ఎన్యుమరేషన్ ప్రక్రియలో భారీ అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఓటర్లకు కనీసం ఫారాలు ఇవ్వకుండానే, ఇచ్చినట్లు రికార్డుల్లో నమోదు చేస్తూ వేలాది మంది పేర్లను జాబితా నుండి తొలగించేందుకు ప్లాన్ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.



"చంద్రబాబుకు అసలు మానవత్వం ఉందా? ఓటు లేకపోతే పేదలు సంక్షేమ పథకాలకు ఎలా అర్హులవుతారు?" అని ప్రశ్నించారు. టీడీపీ శ్రేణులు ఒక ప్రత్యేక యాప్‌ను ఉపయోగించి ఓటర్ల జాబితాలో అక్రమంగా జోక్యం చేసుకుంటున్నాయని జగన్ ధ్వజమెత్తారు.

2 పేజీలో..



## విరాళాల దొంగలకు శిక్ష పడాలంటే.. ప్రభుత్వం మారాలి

- ఆమ్‌ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్

న్యూఢిల్లీ : అయోధ్య రామాలయ విరాళాల దొంగలకు శిక్షపడాలంటే బిజెపి ప్రభుత్వం మారాలి అని ఆమ్‌ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'విరాళాల దొంగలకు శిక్ష పడాలని కోరుకునేవారు ప్రభుత్వంలో మార్పు తీసుకురావాలి. దొంగలకు శిక్ష పడాలంటే ముందు ప్రభుత్వం మారాలి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం, అక్కడి రాష్ట్ర ప్రభుత్వం దొంగలకు శిక్షపడనివ్వవు. అలాంటప్పుడు వారికి శిక్ష పడాలని కోరుకునే శ్రీరాముని భక్తులందరూ ప్రభుత్వాన్ని మార్చాలి.

2 పేజీలో..



## శీతల ఖండంలో నిప్పుల వర్షం..

- వడగాల్పులకు 10 రోజుల్లో 1300 మంది బలి

యూరప్ : వాతావరణ మార్పుల ప్రభావంతో .... యూరప్ ఈసారి ఎన్నడూ లేనంత తీవ్రమైన ఎండలను ఎదుర్కొంటోంది. పలు దేశాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌ను దాటిపోవడంతో ప్రజలు ఉక్కపోత, వడగాలులు, వడదెబ్బలతో తీవ్ర అవస్థలు పడుతున్నారు.

- మిగతా 2లో..



## ప్రకృతితో కూడిన అభివృద్ధే శాశ్వతం

- కాంక్రీట్ జంగిల్ మధ్య 'గ్రీన్ లంగ్స్'గా నగర వనాలు
- రూ. 36 కోట్ల వ్యయంతో 18 నగర వనాల అభివృద్ధి
- అటవీ సంపద, సాంప్రదాయాల కలబోతగా నిర్మాణం
- వినోదం, ఆరోగ్యం ఒకే చోట ఉండేలా ప్రత్యేక సౌకర్యాలు
- రాష్ట్ర వ్యాప్తంగా 18 నగర వనాలను వర్చువల్ గా ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : 'ఏ దేశమైతే ప్రకృతితో కలిసి ఎదుగుతుందో, ఆ దేశం ఎప్పటికీ నిలిచి ఉంటుంది. ప్రకృతితో పాటు సాధించే అభివృద్ధే శాశ్వతంగా ఉంటుంది' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. మన వారసత్వం అనేది కేవలం మనం నిర్మించిన కట్టడాలు కాకూడదని, మనం కాపాడిన ప్రకృతి అయి ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో కొత్తగా అభివృద్ధి చేసిన 18 నగర వనాలు, ఎకో పార్కులు, కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం ప్రాజెక్టులను బుధవారం మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ గా ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు.వర్చువల్ గా ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఆనం రాంనారాయణరెడ్డి అనగాని సత్యప్రసాద్

2 పేజీలో..



## సీఎం విజయ్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు రూ.35 కోట్ల కుట్ర..

చెన్నై: తమిళనాడు రాజకీయాల్లో ఒక్కసారిగా పెను సంచలనం రేగింది. ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం'ప్రభుత్వాన్ని కూల్చేందుకు జరిగిన భారీ కుట్ర వెలుగులోకి వచ్చింది. టీవీకే పార్టీకి చెందిన ఉత్తంగరై ఎమ్మెల్యే డాక్టర్ ఎన్. ఇళయరాజాను రూ.35 కోట్ల భారీ లంచంతో ప్రలోభపెట్టి, క్రాస్ ఓటింగ్‌కు పాల్పడేలా చేయడానికి ఒక ముఠా ప్రయత్నించింది.

- మిగతా 2లో..

## ప్రధాని మోడీజీ స్ఫూర్తితో స్వర్ణాంధ్ర

### 2047 దిశగా చంద్రబాబు అడుగులు



- ఇన్నోవేషన్, మ్యానుఫ్యాక్చరింగ్, టెక్నాలజీ గమ్యస్థానంగా ఏపీ!
- లక్షలాది మంది భారతీయ యువతకు స్ఫూర్తి రాష్ట్రపతి ముర్ము జీవితం
- సౌకర్యవంతమైన మార్గాన్ని ఎంచుకునే వారికి విజయం దక్కదు
- ఉద్యోగార్థులుగా కాదు... ఉద్యోగాల సృష్టికర్తలుగా యువత ఎదగాలి
- అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీ తొలి కాన్వకేషన్ లో మంత్రి లోకేష్

ప్రజాభూమి ప్రతినిధి,అనంతపురం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీజీ దూరదృష్టి గల నాయకత్వంలో భారతదేశ జాతీయ విద్యా విధానం, డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, వికసిత్ భారత్ 2047 దార్శనికత ద్వారా విజ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థను నిర్మిస్తున్నారు. ఈ స్ఫూర్తితో మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'స్వర్ణాంధ్ర - 2047' దిశగా అడుగులు వేస్తున్నారు. తద్వారా విద్య, ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలను సృష్టించగల, భవిష్యత్తుకు సంసిద్ధమైన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దుతున్నారని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

అనంతపురంలోని ఏపీ సెంట్రల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవానికి రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపతి ముర్ము, గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ఈరోజు యువ పట్టభద్రులతో నిండిన ఈ సభను చూస్తున్నప్పుడు... నాకు కేవలం పట్టాలు స్వీకరిస్తున్న విద్యార్థులు మాత్రమే కనిపించడం లేదు. భవిష్యత్తును తీర్చిదిద్దడానికి సిద్ధంగా ఉన్న ఒక తరం కనిపిస్తోంది. ప్రతి తరానికీ ఒక ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. భవిష్యత్తును నిర్మించే అవకాశం ఈ తరానికి లభించింది. ఇది మీ సమయం, ఇది మీకు లభించిన గొప్ప అవకాశం. మీ నేపథ్యం మీ భవిష్యత్తును నిర్ణయించేలా ఎప్పుడూ అనుమతించకండి.

2 పేజీలో..

## ఎపి ఎప్‌సెట్ ఫలితాలు విడుదల

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : ఎపి ఎప్‌సెట్ ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. లక్షలాది మంది విద్యార్థులు ఉత్కంఠగా ఎదురుచూస్తోన్న ఈ ఫలితాలను ఎపి విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేష్ 'ఎక్స్' వేదికగా విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంజినీరింగ్ విభాగంలో 2,76,572మంది దరఖాస్తు చేసుకోగా.. 2,58,545 మంది హాజరయ్యారు. వీరిలో 1,82,317మంది (70.52%) క్వాలిఫై అయినట్లు మంత్రి లోకేష్ వెల్లడించారు. అలాగే, అగ్రికల్చర్ అండ్ ఫార్మా విభాగంలో 79,231మంది దరఖాస్తు చేసుకోగా.. 70,929మంది హాజరయ్యారు. వీరిలో 63,546 మంది (89.59%) క్వాలిఫై అయినట్లు ఆయన పేర్కొన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు మంత్రి లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు.



## పూటకో మాట.. ప్రజలను గందరగోళపరచడమే జగన్ పని

### మంత్రి గొట్టిపాటి రవికుమార్

2 లో..

- జగన్ మావిగన్ నినాదంపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ కౌంటర్
- రాష్ట్రంపై కక్ష సాధింపు కోసమే జగన్ మావిగన్ పాట అందుకున్నారని విమర్శ
- మూడు రాజధానుల పిచ్చి సిద్ధాంతంతోనే వైసీపీకి 11 సీట్లు వచ్చాయని ఎద్దేవా
- మావిగన్ నినాదంతో సింగిల్ డిజిట్‌కు పరిమితం కావడం ఖాయమని జోస్యం
- రాజధాని విషయంలో జగన్ పూటకో మాట మాట్లాడుతున్నారని ఆరోపణ



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తాజాగా అందుకున్న 'మావిగన్' నినాదంపై రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

# పూటకో మాట.. ప్రజలను గందరగోళపరచడమే జగన్ పని

రాష్ట్రం మీద, ప్రజల మీద ద్వేషం పెంచుకున్నందువల్లే జగన్ పూటకో మాట మాట్లాడుతున్నారని, ఆయన కొత్త నినాదం రాష్ట్రంపై కక్ష సాధింపులో భాగమేనని ఆరోపించారు. రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా అడ్డుకోవాలనే క్రిమినల్ అజెండాతో జగన్ పనిచేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. ఈ సందర్భంగా గొట్టిపాటి మాట్లాడుతూ.. "గతంలో మూడు రాజధానులనే పిచ్చి సిద్ధాంతాన్ని ప్రజలపై రుద్దాలని చూశారు. దాని ఫలితంగానే వైసీపీ 11 సీట్లకు పరిమితమైంది. ఇప్పుడు ఈ మావిగన్ సిద్ధాంతంతో ఆ పార్టీ సింగిల్ డిజిట్‌కు పడిపోవడం ఖాయం" అని జోస్యం చెప్పారు. రాష్ట్రం అంటే సవాళ్లు విసరడం కాదని, అభివృద్ధి చేయడం అని జగన్ తెలుసుకోవాలని హితవు పలికారు. ఇటీవల మీడియా మూడు రాజధానుల విషయంపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేక జగన్ అక్కడి నుంచి పారిపోయారని ఆయన ఎద్దేవా చేశారు.
రాజధాని విషయంలో జగన్ గతంలో చేసిన వ్యాఖ్యలను గొట్టిపాటి గుర్తుచేస్తూ సూటి ప్రశ్నలు సంధించారు. "నాడు అసెంబ్లీ వేదికగా రాజధాని 30 వేల ఎకరాలకు తగ్గకుండా చూడాలని చెప్పింది మీరు కాదా? అమరావతిలో ఇల్లు కట్టుకుని ఇక్కడే ఉంటానని హామీ ఇచ్చింది నిజం కాదా? తీరా ముఖ్యమంత్రి అయ్యాక ఆ మాటలన్నీ మరిచి మూడు రాజధానుల పాట అందుకున్నది మీరు కాదా?" అని నిలదీశారు. విశ్వనగరంగా ఉన్న హైదరాబాద్ లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తోందని, అమరావతి కూడా అదే స్థాయిలో అభివృద్ధి చెందకూడదన్నదే జగన్ దుర్బుద్ధి అని గొట్టిపాటి ఆరోపించారు. పూటకో మాట మాట్లాడుతూ ప్రజలను గందరగోళానికి గురిచేయడం ఆయన దుర్మార్గపు ఆలోచనల్లో భాగమని అన్నారు. రాష్ట్ర ప్రగతిని అడ్డుకునే ఏ ప్రయత్నాన్ని అయినా సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

## శీతల ఖండంలో నిప్పుల వర్షం..

గత పది రోజుల్లోనే ఎండల కారణంగా 1,300 మందికిపైగా మరణించినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) అంచనా వేసింది. తీవ్ర ఉష్ణోగ్రతల కారణంగా యూరప్‌లోని అనేక ప్రాంతాల్లో సాధారణ జనజీవనం స్తంభించింది. అత్యవసర అవసరాలు మినహా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. వడదెబ్బకు గురైన బాధితులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నప్పటికీ, పెరుగుతున్న కేసుల కారణంగా ఆస్పత్రులపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. జర్మనీలో గత ఆదివారం 41.7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదుకాగా, ఫ్రాన్స్‌లో 43.3 డిగ్రీలు, బ్రిటన్‌లో 38.8 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు చేరాయి. 1950 తర్వాత ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవడం ఇదే తొలిసారని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. సాధారణంగా వేసవికాలంలో 20 నుంచి 27 డిగ్రీల మధ్య ఉండే ఉష్ణోగ్రతలు ఈసారి 40 డిగ్రీలకు పైగా చేరుకోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పగటిపూట మాత్రమే కాకుండా రాత్రి వేళల్లోనూ వేడి తగ్గడం లేదు. అనేక ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 20 డిగ్రీల సెల్సియస్‌కు పైనే నమోదవుతుండటంతో ప్రజలకు విశ్రాంతి లేకుండా పోతోంది. ప్రపంచ సగటు కంటే యూరప్‌లో ఉష్ణోగ్రతలు మరింత వేగంగా పెరుగుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గత పది రోజుల్లో మరణించిన వారిలో చిన్నారులు, యువత, మహిళలు, వృద్ధులు కూడా ఉన్నారు. ఫ్రాన్స్, జర్మనీ తదితర దేశాల్లో ఆస్పత్రులు వడదెబ్బ బాధితులతో కిక్కిరిసిపోతున్నాయి. కొన్నిచోట్ల వైద్య సదుపాయాలు సరిపోకపోవడంతో చికిత్స అందించడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. 2022 నుంచి యూరప్‌లో తీవ్రమైన ఎండల ప్రభావం క్రమంగా పెరుగుతోంది. గత ఐదేళ్లలోనే సుమారు 60 వేల మంది ఎండల కారణంగా ప్రాణాలు కోల్పోయినట్లు అంచనాలు వెల్లడిస్తున్నాయి. శీతల వాతావరణానికి అనుగుణంగా నిర్మించిన ఇళ్లు, భవనాలు వేడిని ఎక్కువసేపు నిల్వ ఉంచుతుండటంతో, ఇంట్లో ఉన్నవారు కూడా అధిక ఉష్ణోగ్రతల ప్రభావానికి గురవుతున్నారని నిపుణులు చెబుతున్నారు. వాతావరణ మార్పుల తీవ్రతకు తాజా ఉదాహరణగా యూరప్‌లో నెలకొన్న ఈ పరిస్థితులను నిపుణులు అభివర్ణిస్తున్నారు. భూతాపం పెరుగుతున్న కొద్దీ ఇటువంటి తీవ్ర ఉష్ణోగ్రతలు, వడగాలులు, ఆరోగ్య అత్యవసర పరిస్థితులు భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

# ప్రధాని మోడీజీ స్ఫూర్తితో స్వర్ణాంధ్ర -2047 దిశగా చంద్రబాబు అడుగులు

మీ కలలు, మీ కఠోర శ్రమ, మీ వ్యక్తిత్వం... ఇవే మీరు ఎవరన్నదానిని నిర్వచించేలా చూసుకోండి.
**ముర్ము జీవితం... స్ఫూర్తిదాయకం :** ఈరోజు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తో కలిసి ఇక్కడ కూర్చునే భాగ్యం మనకు దక్కింది. ఆమె జీవితం కేవలం తరగతి గదిలో నేర్వలేని ఒక పాఠం. ఆమె ఒక చిన్న గిరిజన గ్రామంలో జన్మించారు. చాలా మందిలాగే కుంగదీసే వ్యక్తిగత విషాదాలను ఆమె ఎదుర్కొన్నారు. అయినా ఆమె ఎన్నడూ విశ్వాసం కోల్పోలేదు... సేవ చేయడం ఆపలేదు... ముందుకు సాగడం ఆపలేదు. ఒక ఉపాధ్యాయురాలిగా... ఒక శాసనసభ్యురాలిగా... ఒక గవర్నర్‌గా... ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి రాష్ట్రపతిగా మన ముందున్నారు.
ఆమె ప్రయాణం ప్రతి యువ విద్యార్థికి ఒక సత్యాన్ని చెబుతుంది... మీ ప్రారంభం మీ గమ్యాన్ని నిర్ణయించదు. మీ ధైర్యమే నిర్ణయిస్తుంది. భారత రాష్ట్రపతి ఒక చిన్న గిరిజన గ్రామం నుండి రాష్ట్రపతి భవన్‌కు ఎదగగలిగితే... మీ విద్య మీకు ఏమి సాధించడంలో సహాయపడుతుందో ఊహించండి. మేడమ్ జీవితం లక్షలాది మంది భారతీయ యువతకు స్ఫూర్తినిస్తూనే ఉంటుంది.
**తొలి బ్యాచ్ ఎప్పటికీ గుర్తుండిపోతుంది :** ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీ మొదటి స్నాతకోత్సవానికి హాజరవ్వడం నాకు లభించిన గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ప్రతి స్నాతకోత్సవం ప్రత్యేకమైనదే... కానీ మొదటి స్నాతకోత్సవం ఎప్పటికీ చారిత్రాత్మకమైనది. ప్రతి సంవత్సరం డిగ్రీలు ప్రదానం చేస్తారు... కానీ చరిత్ర ఒక్కసారే లిఖించబడుతుంది. రాబోయే సంవత్సరాలలో ఈ విశ్వవిద్యాలయం నుండి వేలాది మంది విద్యార్థులు పట్టభద్రులవుతారు. కానీ కేవలం ఒకే ఒక్క బ్యాచ్ మాత్రమే ఎప్పటికీ గుర్తుండిపోతుంది... అదే మొదటి బ్యాచ్. ఆ గౌరవం... ఆ వారసత్వం... మీకే చెందుతుంది. ప్రతి పట్టభద్రుడికి, ప్రతి స్వర్ణ పతక విజేతకు నా హృదయపూర్వక అభినందనలు. ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీ కేవలం ఒక విద్యా ప్రాంగణం మాత్రమే కాదు, అదొక హామీ. నేపథ్యంతో సంబంధం లేకుండా ప్రతి యువ మేధస్సుకు కలలు కనే, నేర్చుకునే, విజయం సాధించే అవకాశం దక్కాలన్న హామీ అది. నేడు... ఇక్కడ కూర్చున్న ప్రతి పట్టభద్రుడి రూపంలో ఆ హామీ కళ్ల ముందు సాక్షాత్కరిస్తోంది.
**మ్యానుఫ్యాక్చరింగ్, టెక్నాలజీ గమ్యస్థానంగా ఏపి :** ప్రపంచం మునుపెన్నడూ లేనంత వేగంగా మారుతోంది. కొత్త టెక్నాలజీ రూపాంతరం చెందుతూనే ఉంటుంది. కానీ పోటీతత్వ ప్రయోజనం కేవలం సాంకేతికత మాత్రమే కాదు.
అది ఎల్లప్పుడూ జిజ్ఞాస, సృజనాత్మకత, ధైర్యం, నిరంతరం నేర్చుకోవాలనే తపనతో కూడుకుని ఉంటుంది. నిరంతరం నేర్చుకుంటూ, పరిస్థితులకు అనుగుణంగా మారుతూ, మార్పునకు నాయకత్వం వహించే ధైర్యవంతులదే భవిష్యత్తు. ఎందుకంటే భవిష్యత్తు టెక్నాలజీని ప్రతిఘటించేవారిది కాదు, దానిని నేర్చుకుని, పరిస్థితులకు అనుగుణంగా మారి, నూతన ఆవిష్కరణలు చేసేవారిదే. అందుకే ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం సిద్ధమవుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి చైతన్యవంతమైన నాయకత్వంలో, ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్, మ్యానుఫ్యాక్చరింగ్, టెక్నాలజీ రంగాలకు గమ్యస్థానంగా మారుతోంది. యువ భారతీయులకు ఇది ఎంతో ఉత్సాహభరితమైన సమయం ఇది. సాంకేతికత, తయారీ, పరిశోధన, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమ వంటి రంగాల్లో కొత్త అవకాశాలు ఆవిర్భవిస్తున్నాయి.
**అవకాశాలు సృష్టించే వారు కావాలి :** నేటి ప్రపంచానికి అవకాశాల కోసం ఎదురుచూసే వారు అవసరం లేదు. అవకాశాలను సృష్టించే వారు కావాలి. కేవలం ఉద్యోగార్థులుగా ఉండాలని ఆశించవద్దు. ఉద్యోగ సృష్టికర్తలుగా మారండి. సంస్థలను నిర్మించండి. ఆవిష్కరణలను నిర్మించండి. పరిష్కారాలను రూపొందించండి. ఇతరుల్లో ఆశను నింపండి. ఎప్పుడూ సౌకర్యవంతమైన మార్గాన్ని ఎంచుకునే వారికి విజయం దక్కదు. కఠినమైన మార్గాన్ని ఎంచుకునే ధైర్యం ఉన్నవారికే విజయం లభిస్తుంది. తక్కువ మంది ప్రయాణించే మార్గమే తరచుగా అద్భుతమైన విజయానికి దారితీస్తుంది. కొత్త విషయాలను అన్వేషించే ఆసక్తి పెంపొందించుకోండి. విఫలమైనా తట్టుకునే ధైర్యం, మళ్లీ పుంజుకునేంత దృఢ సంకల్పం కలిగి ఉండండి. గుర్తుంచుకోండి... పట్టభద్రుల వేడుకతో విద్య ముగిసిపోదు. అది జీవితకాల అభ్యాసానికి నాంది పలుకుతుంది.
**యూనివర్సిటీ గర్వపడే స్థాయికి ఎదగండి :** ఈ రోజు మీరు ఈ ప్రాంగణం నుండి వెళుతున్నప్పుడు మీ విజ్ఞానాన్ని ఆత్మవిశ్వాసంతో, మీ విలువలను వినయంతో, మీ కలలను ధైర్యంతో ముందుకు తీసుకువెళ్ళండి. జీవితంలో ఎక్కువ మంది ప్రయాణించని మార్గాన్ని ఎంచుకోవడానికి ఎప్పుడూ భయపడకండి. ఎందుకంటే గొప్ప విజయాలు సమూహాలను అనుసరించడం వల్ల రావు. దానికి నాయకత్వం వహించే ధైర్యంతోనే వస్తాయి. మీ కుటుంబం గర్వపడేలా చేసే వృత్తిని ఎంచుకోండి. మీ విశ్వవిద్యాలయానికి గర్వకారణమయ్యే వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోండి. భారతదేశం గర్వపడేలా ఒక గొప్ప వారసత్వాన్ని సృష్టించండి. ఎందుకంటే, పట్టభద్రులయ్యే మొదటి బ్యాచ్ కేవలం డిగ్రీలను మాత్రమే పొందదు. అది మీ తర్వాత వచ్చే ప్రతి తరానికీ స్ఫూర్తినిస్తుంది. మీ అందరికీ అభినందనలు. కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టండి... కేవలం జీవనోపాధి కోసం మాత్రమే కాదు... అవకాశాలను సృష్టించడానికి... సమస్యలను పరిష్కరించడానికి... ఈ ప్రపంచాన్ని మీరు చూసిన దానికంటే మెరుగైనదిగా తీర్చిదిద్దడానికి కార్యోన్ముఖులు కావాలని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, ఏపీ సెంట్రల్ యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ శంకర్ ఆచార్య, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి తదితరులు హాజరయ్యారు.

# ప్రకృతితో కూడిన అభివృద్ధే శాశ్వతం

మొదటి పేజీ తరువాయి

సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "నగరాలు, పట్టణాలు శరవేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత తరుణంలో ఈ నగర వనాలు పట్టణాలకు గ్రీన్ లంగ్స్ లాగా పని చేస్తూ.. పర్యావరణ సమతుల్యతను కాపాడతాయి. కేంద్ర ప్రభుత్వ 'నగర వన యోజన' నిధులతో పాటు స్థానిక నిధులను సమకూర్చుకుంటూ రూ. 36 కోట్ల భారీ వ్యయంతో ఈ ప్రాజెక్టును సిద్ధం చేశాం. ఒక్కో నగర వనాన్ని సుమారు 50 హెక్టార్ల విస్తీర్ణంలో, రూ. 2 కోట్ల వ్యయంతో నిర్మించాం. కొడూరు, కైలాసగిరి, మదనపల్లెలలో ప్రత్యేకంగా ఎర్రచందనం పరిరక్షణ పార్కులను ఏర్పాటు చేశాం. మన ప్రాచీన సంస్కృతి, సంప్రదాయ జ్ఞానాన్ని చాటి చెప్పేలా, జీవవైవిధ్య పరిరక్షణే ధ్యేయంగా నక్షత్ర వనాలు, రాశి వనాలను అభివృద్ధి చేశాం. ఈ పార్కులు కేవలం పచ్చదనాన్ని ఇవ్వడమే కాకుండా, ప్రజల శారీరక, మానసిక ఉల్లాసానికి కేంద్రాలుగా నిలవనున్నాయి. ఇందులో పక్షుల ఆవాసాలు, బోటింగ్, కయాకింగ్ (చిన్న పడవలు నడపడం), ట్రెకింగ్ పాయింట్లు, యోగా కేంద్రాలు, ఓపెన్ జిమ్‌లు వంటి ఎన్నో ప్రత్యేక ఆకర్షణలను అందుబాటులోకి తీసుకొచ్చాం.
**పచ్చదనాన్ని కాపాడుకుందాం :** కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న ఆధునిక నగరాలలో, అలసిన మనుషులకు ఈ నగర వనాలు ప్రకృతిలోని ప్రశాంతతను పరిచయం చేస్తాయి. ఇవి కేవలం నేటి అవసరాల కోసమే కాదు, రాబోయే తరాల కోసం మనం అందిస్తున్న పచ్చని వారసత్వం. ప్రతి ఒక్కరూ వీటిని కాపాడుకుంటూ, మరింత పచ్చని, పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగస్వాములు కావాలి' అని పిలుపు నిచ్చారు.
దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ "నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఉన్న నగర వనాన్ని స్వయంగా వెళ్లి పరిశీలించాను. పచ్చదనం, ప్రశాంతతతో పాటు ఏర్పాటు చేసిన అత్యాధునిక వసతులు కుటుంబంతో కలిసి సమయం గడపడానికి ఎంతో అద్భుతంగా ఉన్నాయి. నగర వనానికి సమీపంలోనే ఉన్న గుట్టను, దానిపై వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానాన్ని ఈ పార్కుతో అనుసంధానం చేస్తే బాగుంటుంది. పార్కును, గుట్టను కలిపి ట్రెకింగ్ పాయింట్ గా అభివృద్ధి చేస్తే, అది నగరవాసులకు ఒక సరికొత్త ఆధ్యాత్మిక, సాహస పర్యాటక అనుభూతిని అందిస్తుంద"న్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి, గౌతు శిరీష, డా. బి.వి.జయనాగేశ్వర రెడ్డి, డా.పార్థసారథి, మహమ్మద్ షాజహాన్ బాషా, అటవీ పర్యావరణశాఖల ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, పీసీసీఎఫ్ పి.వి.చలపతిరావు, అటవీశాఖ సలహాదారు మల్లిఖార్జునరావు, సీసీఎఫ్ వైల్డ్ లైఫ్ ఎన్. నాగేశ్వరరావు, ఐ.టి. అడ్వైజర్ పి. నాగేశ్వరరావు, డి.సి.ఎఫ్. ఎ.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## 'సర్' పేరుతో పెద్ద కుట్ర జరుగుతోంది



తమకు అనుకూలమైన వారి ఓట్లను చేర్చుతూ, వ్యతిరేకంగా ఉన్న పేదల ఓట్లను తొలగిస్తున్నారని విమర్శించారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థను, ఎన్నికల విశ్వసనీయతను పూర్తిగా దెబ్బతీసే చర్యని పేర్కొన్నారు. మంత్రి నారాయణ, ఒక మున్సిపల్ కమిషనర్ మధ్య జరిగినట్లు చెబుతున్న ఓ ఫోన్ సంభాషణ ఆడియోను జగన్ ఈ సందర్భంగా మీడియాకు వినిపించారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో అధికార యంత్రాంగంపై అధికార పార్టీ రాజకీయ ఒత్తిళ్లు ఏ స్థాయిలో ఉన్నాయో ఈ లీక్ అయిన ఆడియోనే నిదర్శనమని అన్నారు.

## విరాళాల దొంగలకు శిక్ష పడాలంటే.. ప్రభుత్వం మారాలి

బార్ అసోసియేషన్ వారిని బహిష్కరించినప్పుడు నాకు సంతోషం కలిగింది. వీరు రాముడిని దేవుడిగా భావించరు. లేకపోతే వారు దొంగతనం చేసేవారు కాదు. శ్రీరాముడు వారికి సమస్తం ప్రసాదించాడు. 21 రాష్ట్రాల్లోనూ, కేంద్రంలోనూ ప్రభుత్వాలను ఏర్పాటు చేయడంలో ఆయన వారికి సహాయపడ్డాడు. వారు కనీసం వెళ్లి దేవునికి కృతజ్ఞతలు చెప్పాలి' అని ఆయన అన్నారు. కాగా, వారు అధికారం కోసం, డబ్బుకోసం మాత్రమే సనాత ధర్మాన్ని ఉపయోగించుకున్నారు అని కేజ్రీవాల్ ఆరోపించారు. రామ మందిర ప్రతిష్ఠ జరిగి రెండున్నర సంవత్సరాలయింది. అంటే మొత్తం 891 రోజులు గడిచాయి. ఈ రెండున్నర సంవత్సరాలలో, హోం మంత్రి అమిత్ షా ఒక్కసారి కూడా రామ మందిరాన్ని సందర్శించలేదు. శ్రీరాముడి పేరును అత్యధికంగా దుర్వినియోగం చేసిన వ్యక్తి రామ మందిరానికి వెళ్లలేదు. నేను ఇంటర్నెట్‌లో పరిశీలించాను. చాట్‌జీపీటీని అడిగాను. జర్నలిస్టులతో మాట్లాడాను. అమిత్ షా టైమ్‌లైన్‌ను కూడా చూశాను. ఆయన తన ప్రసంగాలు, ఇంటర్వ్యూలలో 42 సార్లకు పైగా రామమందిరం గురించి ప్రస్తావించారు. అలాగే దాని పేరుతో ఓట్లు కూడా అడిగారు. ఈ సందర్భంగా అమిత్ షాను కొన్ని ప్రశ్నలు అడగాలనుకుంటున్నాను. మీకు (అమిత్‌షా) రామమందిరాన్ని సందర్శించాలని అనిపించడం లేదా? శ్రీరాముని ఆశీస్సులు మీకు అవసరం లేదా? రాముడిని మీరు దేవుడిగా భావించడం లేదా? అని కేజ్రీవాల్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా అమిత్ షా తప్పక రామమందిరాన్ని సందర్శించాలని కేజ్రీవాల్ కోరారు.

## సీఎం విజయ్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు రూ.35 కోట్ల కుట్ర..

**దీనిపై ఎమ్మెల్యే ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన చెన్నై పోలీసులు ఈ కుట్రతో సంబంధం ఉన్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. తమిళనాడు అసెంబ్లీ స్పీకర్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ప్రవేశపెట్టే అవిశ్వాస తీర్మానంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయాలని (క్రాస్ ఓటింగ్), ఇందుకు ప్రతిఫలంగా రూ.35 కోట్లు ఇస్తామని ఎమ్మెల్యే ఇళయరాజాకు ఆఫర్ వచ్చింది. ఒక పొలిటికల్ సర్వే సంస్థ ప్రతినిధిగా పరిచయం చేసుకున్న వ్యక్తి ఈ డీల్ మాట్లాడారు. మొత్తం 15 మంది టీవీకే ఎమ్మెల్యేలను రాజీనామా చేయించి విజయ్ ప్రభుత్వాన్ని కూల్చడమే వీరి ప్రధాన లక్ష్యమని పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ రూ.35 కోట్ల లంచం ఆఫర్ వెనుక డీఎంకే అగ్రనేత, మాజీ మంత్రి వి. సెంథిల్ బాలాజీ, ఆయన సోదరుడు అశోక్ కుమార్ ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వారి కనుసన్నల్లోనే ఈ ఆపరేషన్ జరిగినట్లు నిఘా వర్గాల ప్రాథమిక దర్యాప్తులో ఆధారాలు లభ్యమయ్యాయి. ఆఫర్‌ను తిరస్కరిస్తే ఎమ్మెల్యేను, ఆయన కుటుంబాన్ని చంపేస్తామని నిందితులు బెదిరించారు. బెదిరింపులు రావడంతో ఎమ్మెల్యే ఇళయరాజా వెంటనే చెన్నై పోలీస్ కమిషనర్‌ను కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ముగ్గురు నిందితులను (తిరునావుక్కరసు, నరేష్, త్యాగరాజన్) అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న తరుణంలో ఈ 'హార్స్ ట్రేడింగ్'(ఎమ్మెల్యేల కొనుగోలు) వ్యవహారం బయటపడటంతో తమిళనాడులో రాజకీయ వాతావరణం తీవ్ర ఉద్రిక్తంగా మారింది.**

## జులై 20 నుండి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ..!

పశ్చిమబెంగాల్, అస్సాం పుదుచ్చేరిల్లో బిజెపి అధికారం చేపట్టగా, కేరళంలో యుడిఎఫ్, తమిళనాడులో టివికె అధికారంలోకి వచ్చాయి. అదే సమయంలో టిఎంసి, శివసేన (యుబిటి)ల్లో అంతర్గత తిరుగుబాటు వ్యవహారాలు కూడా చర్చకు రానున్నాయి. తమను ప్రత్యేక వర్గంగా గుర్తించాలని కోరుతూ 20 మంది టిఎంసి, ఆరుగురు శివసేన (యుబిటి) ఎంపిలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. రాజ్యసభకు కొత్తగా ఎన్నికై, తిరిగి ఎన్నికైన ఎంపిలు ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే.

# తెలుగువారిని అందలం ఎక్కించటమే కూటమి లక్ష్యం

తేదీన కనీస అవసరాలు తీర్చుకోలేని ఆపన్నులకు పెన్షన్ అందిస్తున్నాం. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు సహా 28 కేటగిరీల లబ్ధిదారులకు పెన్షన్లు అందిస్తూ వారిని ఆదుకుంటున్నాం. పేదల జీవన ప్రమాణాలను పెంచాలనే లక్ష్యంతో పీ4 కార్యక్రమాన్ని కూడా అమలు చేస్తున్నాం. ఇప్పటి వరకూ రూ.68,598 కోట్ల మేర పెన్షన్ల కింద కూటమి ప్రభుత్వం పంపిణీ చేసింది. ప్రతీ నెలా 62.20 లక్షల మందికి రూ.2,712 కోట్లు పెన్షన్లకు చెల్లిస్తున్నాం.' అని సీఎం అన్నారు.
**పొదుపు ఉద్యమానికి డ్వాక్రా మహిళలే దిక్సూచి :** గడిచిన రెండేళ్ల ప్రయాణంలో రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయటంతో పాటు వ్యవస్థలను గాడిలో పెట్టామని, సంక్షోభాలు, సమస్యలను దాటుకుని ప్రజలకు మేలు చేసేలా అనునిత్యం పనిచేస్తున్నామని అన్నారు. 'గత పాలకులు ఐదేళ్ల పాటు విధ్వంసం చేశారు... రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. రెండేళ్ల లోనే అన్ని పనులూ చేసేశామని మేం చెప్పటం లేదు. కానీ శుభారంభం చేశాం. గత అవినీతి పాలనను మార్చి రాష్ట్రంలో మళ్లీ సుపరిపాలన తీసుకువచ్చాం. మనమిత్ర వాట్సప్ గవర్నెన్సు ద్వారా ఆన్‌లైన్‌లో సేవలను అందిస్తూ ప్రజల చేతిలోకి పౌర సేవలను తీసుకువచ్చాం. కేంద్ర ప్రభుత్వ సహకారంతో సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు అందించగలుగుతున్నాం. తల్లికి వందనం, స్త్రీశక్తి, దివ్యాంగ శక్తి, మత్స్యకారుల సేవలో, ఆటో డ్రైవర్ల సేవలో లాంటి వివిధ పథకాలను అమలు చేశాం. పేదల జీవన ప్రమాణాలు పెంచి వారికి అండగా నిలవాలనేది కూటమి ప్రజా ప్రభుత్వ లక్ష్యం. సంపన్నులైన 10 శాతం మంది అట్టడుగు స్థాయిలో ఉన్న 20 శాతం మంది పేదలను ఆదుకునేలా పీ4 కార్యక్రమం చేపట్టాం. ఆర్థిక అసమానతలు తొలగించి మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు నా జీవితాన్ని అంకితం చేశాను. లక్ష మందికి పైగా మార్గదర్శులు, 10 లక్షలకు మందికి పైగా బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని అన్ని విధాలా సహకారం అందిస్తున్నారు. మహిళలను పారిశ్రామిక, వ్యాపార వేత్తలుగా తయారు చేసేందుకు వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమం చేపట్టాం. పొదుపు ఉద్యమంలో మన డ్వాక్రా మహిళలు దేశానికే ఆదర్శంగా నిలిచారు. అందుకే బ్యాంకులు కూడా డ్వాక్రా మహిళలకు పెద్ద ఎత్తున రుణాలు అందించేందుకు ముందుకు వస్తున్నాయి" అని ముఖ్యమంత్రి అన్నారు.
**రాష్ట్రంలోనే అగ్రగామిగా నెల్లూరు జిల్లా :** 'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలూ సమానంగా అభివృద్ధి చెందాలన్నదే మా ఆకాంక్ష. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రంగా మూడు రీజియన్లుగా చేసి అభివృద్ధి ప్రణాళికలు అమలు చేస్తున్నాం. అభివృద్ధిలో సంపద సృష్టిలో నెల్లూరు జిల్లా దేశంలోనే అగ్రగామి జిల్లాగా మారుతుంది. రామాయపట్నం పోర్టు, కృష్ణపట్నం పోర్టు, దుగరాజపట్నంలో షిప్ బిల్డింగ్ సెంటర్ వస్తున్నాయి. రామాయపట్నం వద్ద బీపీసీఎల్ లక్ష కోట్లతో రిఫైనరీ పెడుతోంది. ఇఫ్కో కిసాన్ సెజ్ లో కూడా పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయి. ఇప్పటికే గూడూరు ప్రాంతంలో 27 మెగా పరిశ్రమలు వచ్చాయి. మెగా ఫర్నిచర్ పార్కు కూడా ఏర్పాటు కాబోతోంది. మన రాష్ట్రంలోనే ఉన్న శ్రీసిటీ దేశ పారిశ్రామిక ప్రాంతాలకు ఆదర్శం. గత పాలకుల వల్ల రాష్ట్రం నుంచి పెట్టుబడులు పారిపోయాయి. ఇప్పుడు కూటమిపై నమ్మకంతో పెట్టుబడి దారులు తిరిగి వస్తున్నారు. జాతీయ రహదారి కారిడార్లు, 4 లేన్ రైల్వే ట్రాక్ కూడా మన ప్రాంతం నుంచి వెళ్లేలా ప్రాజెక్టులు వస్తున్నాయి. అన్ని పోర్టులకూ రైల్వే లైన్లను అనుసంధానించి ఈ ప్రాంతాన్ని లాజిస్టిక్స్ కేంద్రంగా తయారు చేస్తాం' అని సీఎం చంద్రబాబు అన్నారు.
**నీటి భద్రతపై నిరంతరం శ్రద్ధ :** 'సాగునీటికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. 36 ప్రాజెక్టులు ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేసేలా కేలండర్ విడుదల చేశాం. ఇప్పటికే సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.24 వేల కోట్లు ఖర్చు చేశాం. ఈ ప్రాంతానికి అత్యంత కీలకమైన వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి నీళ్లు ఇస్తాం. ఇంకా రూ.4 వేల కోట్ల పనులు పెండింగ్ ఉండగానే గత పాలకుడు ప్రాజెక్టును ప్రారంభించి జాతికి అంకితం చేశారు. డ్రామాల రాయుడికి నాటకాలు ఆడటమే పని. రూ.900 కోట్లు పునరావాసానికి నిధులు విడుదల చేస్తున్నాం. ఇప్పటికే నిర్వాసితులకు రూ.300 కోట్లు చెల్లింపులు చేశాం. త్వరలోనే మిగతా మొత్తాన్ని కూడా చెల్లిస్తాం. రూ.2,500 కోట్లతో వెలిగొండ మొదటి దశను పూర్తి చేసి ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, కడప తదితర జిల్లాలకు నీళ్లిస్తాం. ఎల్ నినో ప్రభావం ప్రపంచ దేశాలపై తీవ్రంగా ఉంది. వర్షాలు బాగా తగ్గాయి. గత ఏడాది పడిన వర్షాలకు గోదావరి, కృష్ణానదులు పొంగి పొర్లాయి. ఆ సమయంలోనే రిజర్వాయర్లను నింపాం. ఈ ఏడాది ఇప్పటికీ నదుల్లో ప్రవాహాలు రాలేదు. అయినా ప్రాజెక్టుల్లో 65 శాతం మేర నిల్వలు ఉన్నాయి. అందుకే భూమినే జలాశయంగా మార్చుకునేలా జల ధార లాంటి కార్యక్రమాలు చేపట్టాం. నదుల అనుసంధానం చేసేలా ప్రణాళికలు కూడా చేపట్టాలని ఆలోచన చేస్తున్నాం. గోదావరి-కావేరి నదుల అనుసంధానం చేస్తే దిగువ రాష్ట్రాలకూ నీరు ఇచ్చే పరిస్థితి ఉంటుంది' అని సీఎం అన్నారు.
**తీవ్రవాదుల తరహాలో ప్రజల్ని భయపెడుతున్నారు :** 'పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో పెట్రోలు, డీజిల్ ధరలు కూడా పెరిగాయి. ఈ సమయంలోనే ఇథనాల్ వినియోగించుకుని ఇంధన పొదుపు చేయాల్సి ఉంది. ఇథనాల్ తయారీ కోసం మొక్కజొన్న లాంటి పంటలు అవసరం అవుతాయి. రైతులు ఈ ప్రత్యామ్నాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పరిశ్రమల్ని ఆహ్వానించడానికి సమయం పడుతుంది. కానీ తరిమి కొట్టడానికి ఒక్క క్షణం చాలు. గత పాలకులు పరిశ్రమల్ని రాష్ట్రం నుంచి తరిమి కొట్టారు. కర్ణాటకకు వెళ్లిపోవాల్సిన హీరో మోటార్స్ సంస్థను రాష్ట్రానికి తీసుకువచ్చి ఇక్కడ మోటార్ సైకిళ్లు ఉత్పత్తి చేసేలా కృషి చేశాం. కడపలో రాయలసీమ స్టీల్ ప్లాంట్‌కు కూడా 3వ తేదీన శంకుస్థాపన చేయబోతున్నాం. 2028 నాటికి ఆ రాయలసీమలో స్టీల్ పరిశ్రమ ఉత్పత్తి కూడా ప్రారంభిస్తుంది. నా ప్రయత్నం అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అందించటమే. గొడ్డలి పార్టీ తీవ్రవాదుల తరహాలో అందరినీ భయాందోళనలకు గురి చేస్తోంది. రోజుకో ఫేక్ న్యూస్, రోజుకో విన్యాసంతో గొడ్డలి పార్టీ కుల, మత, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తోంది. గొడ్డలి పార్టీ రాష్ట్రాన్ని గంజాయికి అడ్డాగా మార్చింది. మేం అధికారంలోకి వచ్చాక ఈగల్ టాస్క్ ఫోర్సు ద్వారా నియంత్రించాం. గత పాలకులు ప్రజల్ని బంధించి, భయపెట్టి మరీ సమావేశాలు పెట్టారు. కూటమి అధికారంలోకి వచ్చాకే ప్రజలకు స్వేచ్ఛ వచ్చింది. రాష్ట్ర ప్రజలందరికీ అవసరమైన రాజధాని అమరావతి గొడ్డలి పార్టీకి అవసరం లేదు. అందుకే ఇంకా రాజధానిపై కుట్రలను కొనసాగిస్తూనే ఉన్నారు. ఇప్పుడు వేగంగా పనులు జరుగుతుంటే సహించలేకపోతున్నారు. గత పాలకుడు తీసుకున్న అస్తవ్యస్త నిర్ణయాలతో రాష్ట్రానికి రాజధానే లేకుండా పోయింది. మూడు రాజధానుల పేరిట గందరగోళ పరిచారు. ఎవరైనా పొరుగు రాష్ట్రాలకు వెళ్తే ఏపీకి మూడు రాజధానులా అని హేళనకు గురయ్యారు. పార్లమెంటులో శాశ్వత రాజధాని చట్టం చేస్తుంటే మావిగన్ అంటూ కొత్త ఆటలు మొదలు పెట్టారు. అమరావతి పరిరక్షణ కోసం అంటూ రౌడీలతో ఇప్పుడు దండయాత్ర చేస్తున్నారు. నిలకడలేని వ్యక్తులు రాజకీయ పార్టీ పెట్టి ప్రజల్ని ఇబ్బందులు పెడుతున్నారు.
**హోంమంత్రిపై అవమానకర వ్యాఖ్యలు :** 'విజయవాడలో యువకుడి అదృశ్యం ఘటన నా దృష్టికి వస్తూనే సీఐను సస్పెండ్ చేశాం, చర్యలకు ఆదేశించాం. కానీ వైసీపీ నాయకులు కులాల మధ్య వివాదాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుటుంబ సభ్యులపై సామాజిక మాధ్యమాల్లో అసభ్య పోస్టులతో విష ప్రచారం చేస్తున్నారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్ లతో ఆ పార్టీ నేతలు రెచ్చి పోతున్నారు. హోం మంత్రి అనిత మేకప్ పై ఆ పార్టీ నేతలు అసహ్యంగా, అవమానకరంగా మాట్లాడారు. మహిళా కమిషన్ ఈ అంశంపై గట్టిగా ప్రశ్నించినా ఆ పార్టీ నేతలు తమ వ్యాఖ్యల్ని సమర్థించుకుంటున్నారు. జగన్ సహకారం లేకపోతే ఆయన వెంట ఉన్న నేతలు విచ్చలవిడిగా మాట్లాడే పరిస్థితి ఉండదు. మా పార్టీలో ఈ తరహా మాట్లాడిన వారిని పార్టీ నుంచి బయటకు పంపించాం. మేం యజ్ఞంలా అభివృద్ధి చేస్తుంటే వైసీపీ నేతలు రాక్షసుల్లా దానికి ఆటంకం కలిగిస్తున్నారు. నేరాలు చేసే పార్టీ, నేరస్తులను కాపాడే పార్టీ, నేరస్తులతో రాజకీయాలు చేసే పార్టీని ఇప్పుడే చూస్తున్నాం. అర్హత లేని వారిని అందలం ఎక్కిస్తే రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు సమస్యలు వస్తాయి. ఇలాంటి వ్యక్తులను జైల్లో పెట్టాలంటే ఒక్క నిముషం పని కానీ మేం ప్రతీ కార రాజకీయాలు చేయటం లేదు. మా దృష్టి అంతా రాష్ట్రం అభివృద్ధి కావాలని, తెలుగు వారిని అందలం ఎక్కించాలనే. రాష్ట్రంలో రౌడీయిజం చేయాలన్నదే వైసీపీ నేతల ఆలోచన. గొడ్డలి పార్టీ నెవర్ అగైన్ అనే సంకల్పం ప్రజలు చేయాలని కోరుతున్నాను. ఎన్డీఏ అగైన్ అండ్ అగైన్ అన్నదే మన నినాదం కావాలి. అప్పుడే అభివృద్ధి సాధ్యం అవుతుంది. నేరస్తులకు వంతపాడటం, నేరాలు చేయటం రాజకీయ పార్టీలకు తగదు. ఇలాంటి పార్టీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నాను' అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు.
**క్రా మహిళలకు అభినందన :** అనంతరం ప్రజా వేదిక సమీపంలో వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్యమంత్రి సందర్శించారు. సెర్ప్ ఆధ్వర్యంలో స్వయం సహాయ సంఘాల మహిళలు ప్రదర్శించిన అధునాతన కుట్టు మిషన్లను సీఎం తిలకించారు. ఆధునిక కుట్టు మిషన్ తో సీఎం చంద్రబాబు చిత్ర పటాన్ని అప్పటికప్పుడే తయారు చేసిన మహిళలు దానిని ముఖ్యమంత్రికి అందించారు. అరటి నారతో తయారు చేసిన వివిధ ఉత్పత్తులను చూసిన సీఎం డ్వాక్రా సంఘాల మహిళలను అభినందించారు. ప్రకృతి సేద్యం ద్వారా పండిస్తున్న ఉద్యాన పంటల ఉత్పత్తులు, మత్స్యకార బోట్లకు బిగించే ట్రాన్స్ పాండర్లను సీఎం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పి.నారాయణ, ఎన్ఎండీ ఫరూఖ్, ఆనం రామనారాయణ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే సునీల్ కుమార్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు హాజరయ్యారు.

# రాజధాని మార్పు నినాదం కాదు,
# ఐదున్నర కోట్ల ఆంధ్రుల భవిష్యత్తు!

**మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి 'మావిగన్' వ్యాఖ్యలపై రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తీవ్ర ఆగ్రహం**




**అధికారం పోయినా అహంకారం పోలేదు.. మారాల్సింది రాజధాని కాదు,**

**మీ మొండి వైఖరి**

**మంత్రి కందుల దుర్గేష్ ఫైర్**

అమరావతి ప్రజా భూమి ప్రతినిధి

రాజధాని మార్పు మరియు 2029 ఎన్నికలపై మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాజధాని అనేది పాలకుల ఇష్టాయిష్టాల ప్రకారం మార్చే పేరు లేదా రాజకీయ క్రీడ కాదని అది ఐదున్నర కోట్ల మంది ఆంధ్రుల ఆత్మగౌరవం, భవిష్యత్తు అని మంత్రి స్పష్టం చేశారు. బుధవారం ఒక ప్రకటనలో ఆయన మాజీ సీఎం జగన్ వైఖరిని ఎండగ ట్టారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.."నాడు అసెంబ్లీలో అమరావతికి జై కొట్టి, సీఎం అయ్యాక మూడు ముక్కలాడి, ఇప్పుడు పబ్లిక్‌లోకి వచ్చి 'మావిగన్' అంటూ కొత్త ప్రాంతాన్ని తెరపైకి తెస్తున్నారు. అసలు మీ మాట మీద మీకు నమ్మకం ఉందా మాజీ సీఎం జగన్? రాజధాని అంటే మీ ఇంట్లో మార్చే క్యాలెండర్ కాదు ఇష్టం వచ్చినప్పుడు ఊరు, పేరు మార్చడానికి! రాజధాని అనేది ఒక రాష్ట్రానికి గుండెకాయ లాంటిది. అది స్థిరంగా ఉంటేనే పెట్టుబడులు, యువతకు ఉద్యోగాలు వస్తాయి. పదే పదే రాజధానిని మార్చడం అంటే పునాదులు తవ్విన ఇంటిని కూల్చేసి, ప్రతి ఐదేళ్లకూ కొత్త చోట పునాది వేయడం లాంటి తుగ్లక్ చర్య. దీనివల్ల రాష్ట్ర ప్రగతి పక్షవాతానికి గురవుతుంది." అన్నారు.

"ఇన్నాళ్లు న్యాయ స్థానాలు తిరస్కరించినా, మొన్నటి ఎన్నికల్లో ప్రజలు అమరావతి వైపు స్పష్టమైన తీర్పు ఇచ్చినా ఇంకా అదే పాత పాట పాడుతుండటం ప్రజా స్వామ్యాన్ని అవమానించడమే. ఐదేళ్లూ అధికా రంలో ఉండి ఒక్క రాజధానిని కూడా కట్టలేకపోయిన మీరు, ఇప్పుడు 'మావిగన్' అంటూ కొత్త నాటకానికి తెరలేపడం హాస్యాస్పదం. పరిపాలన చేతకాక, అభివృద్ధి శూన్యమై.. విపక్షంలోకి వచ్చాక కూడా పదే పదే 'రాజధాని' మంత్రాన్ని జపించడం ప్రజలను తప్పుదోవ పట్టించడమే. మీ తుగ్లక్ నిర్ణయాల వల్ల వెనక్కి వెళ్లిన ఇన్వెస్టర్లను ఇప్పుడు కూటమి ప్రభుత్వం మళ్లీ రప్పిస్తోంది." అని వివరించారు. "ప్రజలు ఐదేళ్లపాటు విపక్షంలో కూర్చో మని తీర్పు ఇస్తే, బాధ్యతగల ప్రతిపక్షంగా ఉండటం మానేసి అప్పుడే 2029 ఎన్నికల యావలో బతుకుతున్నారు. ముందు ప్రజల్లో పోయిన నమ్మకాన్ని సంపాదించుకోండి, ఆ తర్వాత ఎన్నికల మాట చూద్దాం. కేంద్ర సహకారంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజారంజక పాలన అందిస్తుంటే, అప్పుడే రాజకీయాలు చేయడం మీ అజ్ఞానానికి నిదర్శ నం. అధికారం పోయినా మీ అహంకారం పోలే దు అనడానికి ఈ తాజా డిమాండ్లే సాక్ష్యం. మీరు ఏ అజెండాతో ముందుకెళ్లినా మీ జెండా పీకేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ఇకనైనా మీ మొండి వైఖరి మార్చుకుని, ప్రజల కు మంచి చేయడంపై దృష్టి పెట్టండి" అని మంత్రి కందుల దుర్గేష్ హితవు పలికారు.

# గ్రామాభివృద్ధి, విద్యా ప్రోత్సాహం అభినందనీయం

## ఒడిశా రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు

**పామర్రు మండలం, కనుమూరు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవం చేసిన గవర్నర్**

**కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు, శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, బోడె ప్రసాద్**

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

గ్రామాభివృద్ధి, విద్యా ప్రోత్సాహం, సామాజిక సేవలను సమన్వయం చేస్తూ కనుమూరు గ్రామంలో చేప ట్టిన కార్యక్రమాలు ఆదర్శప్రాయమని ఒడిశా రాష్ట్ర గవర్నర్ డా. కంభంపాటి హరిబాబు పేర్కొ న్నారు. బుధవారం ఆయన పామర్రు మండలం కనుమూరు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. గ్రామ ప్రవేశ ముఖద్వారాన్ని ప్రారంభించడం, స్వర్గపురి (శ్మశానవాటిక) అభివృద్ధి పనులకు భూమిపూజ చేయడం, పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేయడం వంటి కార్య క్రమాల్లో పాల్గొన్నారు. అదేవిధంగా గ్రామంలో పలువురు లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందించారు.కార్యక్రమంలో రాష్ట్ర గనులు భూగ ర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, జిల్లా ఎస్పీ వి విద్యా సాగర్ నాయుడు, పామర్రు, పెనమలూరు నియోజకవర్గాల శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, బోడె ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో గవర్నర్ మాట్లాడుతూ గ్రామ ప్రవేశ ముఖ ద్వారాన్ని ప్రారంభించడం, స్వర్గపురి (శ్మశానవాటిక) అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వ హించడం ప్రజలకు ఎంతో ఉపయోగపడే కార్య క్ర మాలని గవర్నర్ పేర్కొ న్నారు. గ్రామ అభివృ ద్ధికి చేపడుతున్న ఇటు వంటి కార్యక్రమాలు ఇతర గ్రామాలకు సైతం ఆదర్శంగా నిలు స్తాయని అన్నారు.నేడు గ్రామాల్లో విద్య, రహదా రులు, మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలు విస్తృతంగా అందుబాటులోకి రావడం సంతోషకరమని పేర్కొన్న గవర్నర్, గ్రామాభివృద్ధికి సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రామం పట్ల అనుబం ధాన్ని కొనసాగిస్తూ అభివృద్ధికి కృషి చేస్తున్న దాతలు, గ్రామ పెద్దలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.పదో



తరగతి పరీక్షల్లో 21 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై, వారందరికీ ఒక్కొక్క రికి రూ.10 వేల చొప్పున ప్రోత్సాహక నగదు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ ప్రోత్సాహకం ఆర్థిక సహాయం కంటే విద్యార్థుల్లో మరింత ఉన్నత లక్ష్యాలు ఏర్పడేలా ప్రేరణ కల్పించేందుకు దోహదపడుతుందని తెలిపారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై విద్యార్థులకు పాఠశా ల స్థాయి నుంచే అవగా హన కల్పించడం శుభపరిణామమని పేర్కొన్న గవ ర్నర్, ప్రపంచం నిర్దేశించుకున్న అభివృద్ధి లక్ష్యా ల సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు. తమ అభిరుచి, సామ ర్థ్యాలకు అనుగుణంగా బయాలజీ, ఆర్ట్స్, కామ ర్స్, ఎకనామిక్స్, కంప్యూటర్స్ వంటి రంగాలను ఎంపిక చేసుకుని సమాజానికి ఉపయోగపడే విధంగా రాణించాలని సూచించారు.గ్రామం నుంచి ఉన్నత స్థానాలకు చేరుకున్న అధికారులు, శాస్త్రవేత్తలు, వైద్యులు, విద్యావేత్తలు, విదేశాల్లో రాణిస్తున్న యువతను ఆదర్శంగా తీసుకుని తాము కూడా అలాంటి విజయాలను సాధించా లనే సంకల్పంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

**గ్రామాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట.. మౌలిక వసతుల కల్పనకు కట్టుబడి ఉన్నాం: మంత్రి కొల్లు రవీంద్ర**

గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కోల్ ఇండియా సంస్థ సహకారంతో సుమారు రూ.1.53 కోట్ల వ్యయంతో ఆధునిక సౌకర్యాలతో శ్మశానవాటిక అభివృద్ధి పనులు చేపట్టడం, అలాగే రూ.10 లక్షల వ్యయంతో గ్రామ ప్రవేశ ముఖద్వారం (ఆర్చ్) నిర్మించడం అభినందనీయమన్నారు.ఈ అభివృద్ధి కార్యక్రమాల కోసం కృషి చేసిన మాజీ రాజ్యసభ సభ్యుడు యలమంచిలి శివాజీని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. గ్రామాభివృద్ధి కోసం ఆయన చేస్తున్న సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు.డాక్టర్ కంభంపాటి హరిబాబు ప్రజా జీవితంలో కష్టపడి వివిధ బాధ్యతలు నిర్వర్తిస్తూ, పార్లమెంట్ సభ్యుడిగా, మిజోరం గవర్నర్‌గా, ప్రస్తుతం ఒడిశా గవర్నర్‌గా విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.

**చిన్న లక్ష్యాలు కాదు.. గొప్ప లక్ష్యాలతో ముందుకు సాగాలి: జిల్లా కలెక్టర్ డీకే బాలాజి**

విద్యార్థులు చిన్న లక్ష్యాలతో సరిపెట్టుకోకుండా ఉన్నత ఆశయాలు నిర్దేశించుకుని వాటి సాధన కోసం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి విద్యార్థులకు ఉద్బోధించారు.ప్రస్తుతం విద్యార్థుల ముందున్న అవకాశాలు అపారమని, వాటిని సద్వినియోగం చేసుకునేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని సౌకర్యాలు, ప్రోత్సాహకాలు కల్పిస్తోందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను వినియోగించుకుని ఉన్నత విద్యతో పాటు జీవితంలో గొప్ప విజయాలను లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. వి ద్యార్థులు కేవలం డాక్టర్, ఇంజినీర్, ఉపాధ్యాయుడు వంటి ఉద్యోగాలను మాత్రమే లక్ష్యంగా పెట్టుకోకుండా, భవిష్యత్తులో పెద్ద సంస్థల ను స్థాపించే స్థాయికి ఎదగాలనే సంకల్పంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా మారడమే కాకుండా సాఫ్ట్‌వేర్ సంస్థను స్థాపించే స్థాయికి, వైద్యుడిగా ఎదగడమే కాకుండా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల శ్రేణిని ఏర్పాటు చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించాలన్నారు.అదేవిధంగా గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్న దాతలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. స్మశాన వాటిక అభివృద్ధికి దాదాపు రూ.1.53 కోట్ల నిధులు కోల్ ఇండియా నుండి జిల్లాకు రావడం ఎంతో శుభపరిణామం అని అభినందించారు.

**పామర్రు ప్రగతి పథంలో దూసుకెళ్తోంది: ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా**

పామర్రు నియోజకవర్గం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని, గ్రామాల సమగ్ర అభివృద్ధితో పాటు విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం, దాతలు కలిసి కృషి చేస్తున్నారని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. కనుమూరులో రూ.1.53 కోట్ల వ్యయంతో స్వర్గపురి శ్మశానవాటిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. అలాగే రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన ముఖద్వా రాన్ని ప్రారంభించడంతో పాటు, మరో రూ.50 లక్షలతో నిర్మించిన పడమూరు గ్రామ రహదా రిని ప్రజలకు అంకితం చేశామని తెలిపారు. దాదాపు 70 ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన ఆ రహదారికి ఇప్పుడు రూపుదిద్దడం ఆనందంగా ఉంద న్నారు. పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే, 21 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ఆర్థిక ప్రోత్సాహకం అందించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో ఇదే పాఠశాల నుంచి చదివిన విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకుని తమ గ్రామానికి, పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాం క్షించారు. కార్యక్రమంలో ఉయ్యూరు ఆర్డీఓ ఎస్ కరుణ కుమారి, పంచాయతీరాజ్ ఎస్ఈ రమణారావు, ఎండోమెంట్ సహాయ కమిషనర్ లలిత, దాత ఎలమంచిలి వాసుదేవరావు, విద్యార్థులు, గ్రామస్తులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం

**64వ డివిజన్ కండ్రికలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టి ఎన్ టి యు సి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్**



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

విజయవాడ ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని టి ఎన్ టి యు సి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్ అన్నారు. ప్రభుత్వ విప్, సెంట్రల్ శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు ఆదేశాలతో, పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) సూచనల మేరకు 64 వ డివిజన్ కండ్రిక లో జూలై నెలసామాజిక పింఛన్ల పింఛన్ల ను సచివాలయ సిబ్బందితో కలిసి పరుచూరి ప్రసాద్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరుచూరి ప్రసాద్ మాట్లాడుతూ.... ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వృద్ధులు, వికలాంగులు, వితంతు పింఛన్ల నగదును పెంచి ఇస్తున్న ప్రభుత్వం టిడిపి ప్రభుత్వం అన్నారు. అర్హులందరికీ పింఛన్లు అందేలా, ఆర్థిక భరోసా లభించేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.



గత వైసిపి ప్రభుత్వం పింఛన్ల నగదు పెంచుతామని హామీ ఇచ్చి, ప్రజల ఓట్లతో గెలిచి సరైన రీతిలో పింఛన్ల నగదు పెంచలేదన్నారు. అర్హులైన వారి పింఛన్లు కూడా నాటి జగన్ ప్రభుత్వం తొలగించిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛను నగదు 4000 రూపాయలకు పెంచి మాట నిలబెట్టుకుందని ఈ సందర్భంగా పరుచూరి ప్రసాద్ గుర్తు చేశారు. అంతేకాకుండా ప్రతి నెల ఒకటవ తేదీనే పింఛన్లను ఇంటి వద్దకు వెళ్లి లబ్ధిదారులకు అందిస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సచివాలయం వీఆర్వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.



# మచిలీపట్నం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉద్యోగుల పదోన్నతులు

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో పలువురు ఉద్యోగులకు పదోన్నతుల (ప్రమోషన్ల) ఉత్తర్వులు అందజేశారు. జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఉప్పాల హారిక, ముఖ్య కార్యనిర్వహణ అధికారి డాక్టర్ జే. అరుణ చేతుల మీదుగా ఈ ఆర్డర్లను పంపిణీ చేశారు.పదోన్నతులు పొందింది వీరే..అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లుగా (AO): ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లకు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లుగా పదోన్నతి లభించింది.

సీనియర్ అసిస్టెంట్లుగా: ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ కల్పించారు.ఈ కార్యక్రమంలో ఉపముఖ్య కార్యనిర్వాహణాధికారి ఆనంద్ కుమార్ తో పాటు జిల్లా పరిషత్ కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పదోన్నతులు పొందిన ఉద్యోగులకు తోటి సిబ్బంది అభినందనలు తెలియజేశారు.



# ప్రతి ఇంటికి సంక్షేమం... ప్రతి కుటుంబానికి భరోసా

## కూటమి ప్రభుత్వ లక్ష్యం

ప్రజాభూమి పెడన

బంటుమిల్లి మండలం నాగేశ్వరావుపేట గ్రామంలో కూటమి నాయకులు మరియు సచివాలయ సిబ్బందితో కలిసి పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ఇంటింటికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, ప్రతి నెల ఒకటో తేదీన అవ్వాతాతలకు పెన్షన్ అందించడం కూటమి ప్రభుత్వానికి ప్రజల పట్ల ఉన్న బాధ్యతకు నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ దిశగా ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు.రాజకీయాలకు అతీతంగా పెడన నియోజకవర్గంని ప్రతి ఇంటికి చేరుకుని ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, అభివృద్ధి మరియు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ హామీ ఇచ్చారు.

# ప్రెసిడెన్షియల్ ఆర్డర్–2025 అమలుపై ఉపాధ్యాయ సంఘాలతో డీఈఓ సమన్వయ సమావేశం



మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

పాఠశాల విద్యాశాఖలో 'ప్రెసిడెన్షియల్ ఆర్డర్–2025' అమలుకు సంబంధించి జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) కార్యాలయంలో బుధవారం గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలు, సర్వీస్ అసోసియేషన్ల ప్రతినిధులతో ఒక కీలక సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన ఉత్తర్వుల అమలు, ఉపాధ్యాయుల కేటాయింపులపై సుదీర్ఘంగా చర్చించారు.సమావేశంలో ప్రధానంగా చర్చకు వచ్చిన ముఖ్యాంశాలు:ఆర్డర్-2025పై సమగ్ర వివరణ: ప్రెసిడెన్షియల్ ఆర్డర్–2025 విధివిధానాలు, విద్యాశాఖలో దీని ద్వారా రాబోయే మార్పులపై ఉపాధ్యాయ ప్రతినిధులకు అధికారులు సమగ్రంగా వివరించారు.కేడర్ స్ట్రెంత్ - పోస్టుల పంపిణీ: నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా పాఠశాలల్లో కేడర్ స్ట్రెంత్ (పరిమితి) మరియు వివిధ కేటగిరీల పోస్టుల పంపిణీ విధానం ఏ విధంగా ఉండబోతుందనే అంశంపై విస్తృతంగా చర్చించారు.



స్థానిక కేడర్ల కేటాయింపు: ఉపాధ్యాయులను, ఉద్యోగులను వివిధ స్థానిక కేడర్లకు కేటాయించే ప్రక్రియను, అందులో పాటించే నియమ నిబంధనలను అధికా రులు ఉపాధ్యాయ సంఘాలకు స్పష్టంగా వివరించారు.

అభిప్రాయాలు - సందేహాల నివృత్తి: ఈ నూతన ఆర్డర్ అమలులోకి వచ్చే లోపు ఉపాధ్యాయులకు ఎదురయ్యే సమస్యలపై గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పలు సూచనలు చేశారు. వారి సందేహాలను అధికారులు నోట్ చేసుకుంటూ, తగిన వివరణలు ఇచ్చారు.ఈ నూతన ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ద్వారా ఉపాధ్యాయులకు ఎలాంటి అన్యాయం జరగకుండా, పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేసేందుకు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు తమ పూర్తి సహకారాన్ని అందించాలని అధికారులు కోరారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల ముఖ్య నేతలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# అవనిగడ్డలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

**పాల్గొన్న మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరంకి గురుమూర్తి**



ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

అవనిగడ్డ నియోజకవర్గ కేంద్రంలోని సీతయా లంకలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇన్చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, స్థానిక ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ పాల్గొని వృద్ధులకు పెన్షన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఇన్చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడిన ముఖ్యాంశాలు:భారీ నిధుల విడుదల: రాష్ట్రంలో జూలై నెల ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కోసం ప్రభుత్వం రూ. 2,711.79 కోట్లు విడుదల చేసింది. బుధవారం ఉదయం నుంచే రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది.లబ్ధిదారుల వివరాలు: జూలై నెలకు గాను రాష్ట్ర వ్యాప్తంగా 62,19,648 మందికి పెన్షన్లు అందుతున్నాయి. ఇందులో కొత్తగా మంజూరైన 7,792 మంది వితంతు లబ్ధిదారులు కూడా ఉన్నారు. కొత్త వితంతు పింఛన్ల కోసం ప్రభుత్వం రూ. 3.12 కోట్లు విడుదల చేసింది.

సంక్షేమానికి పెద్దపీట: కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పెన్షన్ల కోసం రూ. 68,598.44 కోట్లు ఖర్చు చేశాం. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, గడిచిన రెండేళ్ల కాలంలో రూ.66 వేల కోట్లకు పైగా పింఛన్ల కోసమే కేటాయించాం. నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రతి నెలా 1వ తేదీనే పెన్షన్ల పంపిణీ జరుగుతోంది.క్షేత్రస్థాయిలో ముఖ్యమంత్రి: ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం పున్నపువారిపాళెం గ్రామంలో స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లు పంపిణీ చేస్తున్నారు.పెన్షన్ల చరిత్ర: ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సంక్షేమానికి పునాది వేసింది అన్న ఎన్టీఆర్. 1983లో ఆయనే ఈ పెన్షన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత 2014-19 మధ్య కాలంలో పెన్షన్‌ను రూ.2 వేలకు పెంచిన ఘనత చంద్రబాబుది. నేడు కూటమి ప్రభుత్వం సామాజిక పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచి అందిస్తోంది.గత ప్రభుత్వంపై విమర్శలు: అధికారంలోకి వస్తే పెన్షన్‌ను రూ.2 వేల నుంచి రూ.3 వేలు చేస్తానని చెప్పి జగన్ రెడ్డి యూ టర్న్ తీసుకున్నారు.దేశానికే ఆదర్శం: ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న పెన్షన్ పంపిణీ విధానం దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్లు పెంచి, పేదలు సమాజంలో మరింత గౌరవంగా జీవించేలా చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే.

ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి 4

గురువారం 2 జూలై 2026

## ఉద్యోగ విరమణ చేసిన అంగన్వాడీ టీచర్ నూర్జహాన్‌కు ఘన సన్మానం




ప్రజాభూమి ప్రతినిధి-బుట్టాయగూడెం

అంగన్వాడి ఉపాధ్యాయురాలుగా ఉద్యోగ విరమణ చేసిన ఎండి నూర్జహాన్ ను అంగన్వాడీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. బుట్టాయగూడెం -2 అంగన్వాడీ కేంద్రంలో గత 40 ఏళ్లుగా నూర్జహాన్ చిన్నారులకు అంగన్వాడీ ఉపాధ్యాయురాలుగా సేవలందించి, గత నెల 31వ తేదీన ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా నూర్జహాన్ ను స్థానిక అంగన్వాడి -1 కేంద్రంలో బుధవారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ అధికారిణి యు వి. పద్మావతి విధుల నిర్వహణలో నూర్జహాన్ చూపిన అంకిత భావాన్ని ప్రశంసించారు. నూర్జహాన్ పనితీరు పలువురికి ఆదర్శవంతంగా నిలుస్తుందని చెప్పారు. అనంతరం నూర్జహాన్ ను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. పలు అంగన్వాడి సిబ్బంది నూర్జహాన్ కు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ కె.ఝాన్సీ, యు డి సి కృష్ణవేణి, పలువురు అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ శాఖ పిఆర్ఓగా మళ్లీ కేశవరావుకి అవకాశం ఇచ్చిన ఉన్నతాధికారులు

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా



ఏలూరు జిల్లాలో వివిధ హోదాల్లో పనిచేసిన పోలీస్ అధికారులు మంగళవారం పదవీ విరమణ చేశారు. అందులో భాగంగా జిల్లాలో గత 14 సంవత్సరాలుగా పిఆర్ఓగా విధులు నిర్వహిస్తు ఎమన్న కేశవరావు ఒకరు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మళ్ళీ పిఆర్ఓగా రిటైర్డ్ సబ్ ఇన్స్పెక్టర్ కేశవరావుకే ఉన్నతాధికారులు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా పి ఆర్ ఓ కేశవరావు మాట్లాడుతూ గతంలో పనిచేసిన సేవలను గుర్తించిన అధికారులు నన్ను ఈ పదవిలో కొనసాగించడం చాలా ఆనందదాయకంగా ఉందని అన్నారు. తనకు లభించిన ఈ అవకాశం పూర్తి నియమ నిబంధన అనుగుణంగా విధులు నిర్వహిస్తారని ఈ సందర్భంగా చెప్పారు. తన సేవలు గుర్తించి మళ్లీ అవకాశం కల్పించిన ప్రతి ఒక్క అధికారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## సి ఆర్ రెడ్డి కాలేజ్ ఇంచార్జ్ ప్రిన్సిపల్ పదవీ విరమణ.



ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా

సర్ సి.ఆర్.ఆర్. కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, ఏలూరులో ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్‌గా విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన డా. హిమబిందు కర్రి సన్మాన సభ బుధవారం కళాశాల సెమినార్ హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మ శ్రీ ముఖ్య అతిథిగా హాజరై డా. హిమబిందు కర్రిని ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తి సమాజ నిర్మాణానికి మూలస్తంభమని, ముఖ్యంగా ఉపాధ్యాయులను తీర్చిదిద్దే విద్యా సంస్థలో సేవలందించడం గొప్ప బాధ్యత అని పేర్కొన్నారు. ఆ బాధ్యతను డా. హిమబిందు కర్రి ఎంతో నిబద్ధతతో, క్రమశిక్షణతో నిర్వర్తించి కళాశాల అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. విద్యార్థుల్లో విలువలతో కూడిన విద్యను పెంపొందించడంతో పాటు, అధ్యాపక బృందాన్ని సమన్వయం చేస్తూ సంస్థ ప్రతిష్ఠను పెంచడంలో ఆమె సేవలు చిరస్మరణీయమని అన్నారు. పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమేనని, సేవాభావానికి అంతం కాదని పేర్కొంటూ, ఆమె తన అనుభవాన్ని సమాజానికి, విద్యా రంగానికి భవిష్యత్తులో కూడా అందిస్తారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య సభ్యులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు, విద్యావేత్తలు, పలువురు ప్రముఖులు పాల్గొని డా. హిమబిందు కర్రి కి శుభాకాంక్షలు తెలియజేశారు.

## హలో రైతన్న - ఛలో ఏలూరు ఆటోల ప్రచారం యాత్ర ప్రారంభం.

-జులై 3న రైతుల బహిరంగ సభను జయప్రదం చేయండి.




ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.

ఈనెల 3,4,5 తేదీల్లో ఏలూరులో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభలు సందర్భంగా జులై 3న జరుగుతున్న హలో రైతన్న -చలో ఏలూరు కార్యక్రమం విజయవంతం కోసం ఆటోల ప్రచార యాత్రను బుధవారం ప్రారంభించారు. ఏలూరు పవర్ పేట లోని ఉద్దరాజు రాజు రామం భవనం నుండి ప్రారంభమైన యాత్రను సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్. లింగరాజు, సీనియర్ నాయకులు కంది విశ్వనాథం రైతు సంఘం జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 3న ఏలూరులో జరుగుతున్న హలో రైతన్న - చలో ఏలూరు కార్యక్రమం సందర్భంగా మధ్యాహ్నం 2 గంటలకు జూట్ మిల్లు సెంటర్ నుండి రైతు మహా ప్రదర్శన అనంతరం 3 గంటలకు జిల్లా కలెక్టరేట్ వద్ద ఉన్న ఇండోర్ స్టేడియం గ్రౌండ్ లో బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు. అన్ని పంటల రైతులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. అఖిల భారత రైతు సంఘం నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. అన్ని పంటల రైతులకు కనీస ధరలు రాక నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేసి మద్దతు ధరలు పెంచాలని డిమాండ్ చేశారు. పొగాకు, ఆక్వా, ఆయిల్ పామ్, కోకో, వరి, కూరగాయలు, పాడి,పౌల్ట్రీ తదితరు అన్ని పంటల రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి ఎన్ వి డి ప్రసాద్, పంపన రవికుమార్, ఎస్.సాయి కృష్ణ, కోటేశ్వరరావు పలువురు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

### అంతరించిపోతున్న విశ్వబ్రాహ్మణ

# సాంప్రదాయ వృత్తులను ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేయాలి

ఏలూరు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం కన్వీనర్ అప్పలభక్తుల శివకేశవరావు (శివశ్రీ).

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.

అంతరించిపోతున్న విశ్వబ్రాహ్మణుల సాంప్రదాయ పంచవృత్తులను ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేసి, వాటిని భావితరాలకు వారసత్వంగా అందించేందుకు సమిష్టి కృషి అవసరమని ఏలూరు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం కన్వీనర్ అప్పలభక్తుల శివకేశవరావు (శివశ్రీ) పేర్కొన్నారు. ఏలూరు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ నిర్మాణంలో భాగంగా కైకలూరు నియోజకవర్గ స్థాయి సమావేశం కైకలూరులో నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కన్వీనర్లు అప్పలభక్తుల శివకేశవరావు (శివశ్రీ), పెసరగంటి త్రిమూర్తులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పెసరగంటి త్రిమూర్తులు మాట్లాడుతూ, జిల్లాల పునర్విభజ




న నేపథ్యంలో ఏలూరు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘాన్ని పునర్నిర్మించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. మండలాలు, నియోజకవర్గాల వారీగా పర్యటనలు పూర్తయిన అనంతరం జిల్లా కమిటీ ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఏకైక విశ్వబ్రాహ్మణ సంఘం ఏర్పాటు లక్ష్యంగా ఎన్నికల ప్రక్రియకు సన్నాహాలు జరుగుతున్నాయని వివరించారు. అప్పలభక్తుల శివకేశవరావు (శివశ్రీ) మాట్లాడుతూ, విశ్వబ్రాహ్మణుల పంచవృత్తుల్లో ప్రస్తుతం కార్పెంటరీ, స్వర్ణకార వృత్తులు మినహా మిగిలిన సాంప్రదాయ వృత్తులు కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పారిశ్రామిక పథకాలను సద్వినియోగం చేసుకుంటూ వృత్తిదారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. సాంప్రదాయ వృత్తులు అంతరించకుండా వాటిని సంరక్షించి భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు. నియోజకవర్గ అధ్యక్షులు సోమాచార్యులు మాట్లాడుతూ, జిల్లా సంఘ నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ లక్కోజు సురేష్ కోశాధికారి దివిలి బ్రహ్మం,తో పాటు పలువురు సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్స్ డే సందర్భంగా సమాజానికి విశిష్ట సేవలందిస్తున్న పలువురు వైద్యులను సంఘం తరపున ఘనంగా సత్కరించారు.

## నిర్ణీత తేదీకే పెన్షన్లు అందజేస్తాం : ఎమ్మెల్యే బడేటి చంటి

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు

ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. స్థానిక మరడాని రంగారావు కాలనీలో జరిగిన కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పెన్షన్ నగదు అందజేశారు. వృద్ధులు, మంచానికే పరిమి



తమైన వారికి పరామర్శించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ అర్హులందరికీ ప్రతి నెలా నిర్ణీత తేదీకే సామాజిక పెన్షన్లు అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఏలూరు నియోజకవర్గంలో అమృత్ 2.0 పథకం ద్వారా త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా వచ్చే ఏడాదిలో ప్రత్యేక చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రెడ్డి అప్పలనాయుడు, దాసరి ఆంజనేయులు, మామిళ్లపల్లి పార్థసారధి, పెద్దిబోయిన శివప్రసాద్, కర్రి శ్రీనివాస్ తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ శాఖ ప్రైవేటీకరణను విరమించుకోవాలి: దస్తావేజుల లేఖర్లు

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద బుధవారం దస్తావేజుల లేఖర్ల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు పెనుమాక వెంకట సుబ్బారావు నేతృత్వంలో దస్తావేజుల లేఖర్లు ధర్నా నిర్వహించారు. రిజిస్ట్రేషన్ శాఖను పీపీపీ విధానంలో ప్రైవేటీకరించాలనే ప్రభుత్వ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వెంకట సుబ్బారావు మాట్లాడుతూ, ఇళ్లు, ఇళ్ల స్థలాలు,భూముల రిజిస్ట్రేషన్లపై ఆధారపడి రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది దస్తావేజుల లేఖర్లు, వారి కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. పీపీపీ విధానంలో రిజిస్ట్రేషన్ సేవలను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే వేలాది కుటుంబాలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దస్తావేజుల లేఖర్ల జీవనోపాధికి భంగం కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం తీసుకోవద్దని, రిజిస్ట్రేషన్ శాఖను ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

## దెందులూరులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు అందజేసిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

ప్రజాభూమి ప్రతినిధి-దెందులూరు

నియోజకవర్గంలో బుధవారం తెల్లవారుజాము నుంచే ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. పెదవేగి మండలం దుగ్గిరాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్వయంగా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని 34,880 మంది పింఛన్ లబ్ధిదారులకు మొత్తం రూ.15.65



కోట్ల పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగా మంజూరైన 54 స్పౌజ్ కేటగిరీ పింఛన్లను కూడా ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. భర్త మరణించిన తర్వాత తదుపరి నెల నుంచే భార్యకు స్పౌజ్ పింఛన్ అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు. నూతనంగా పింఛన్లు పొందిన లబ్ధిదారులు ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్తిపాడులో ఘనంగా సామాజిక ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్లు అందజేసిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా

ప్రజాభూమి ప్రతినిధి-ప్రత్తిపాడు

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ప్రత్తిపాడు మండలం, ప్రత్తిపాడు గ్రామం కొండమీద 16వ వార్డులో బుధవారం నిర్వహించిన సామాజిక ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో గౌరవ శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ రాజా పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యంగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు ప్రతి నెలా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందేలా చర్యలు తీసుకుంటోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, గ్రామ స్థాయి నుంచి ప్రజలకు అవసరమైన సేవలు పారదర్శకంగా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. పెన్షన్ అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే




వరుపుల సత్యప్రభ రాజాకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు, అధికారులు, వార్డు ప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్రైస్తవ దళితుల ఎస్సీ రిజర్వేషన్లు తొలగించడం అన్యాయం

- మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్
- పోలవరం నియోజకవర్గ మాల మహానాడు కార్యవర్గం ఎన్నిక

ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి

జీలుగుమిల్లి మండల కేంద్రంలో అంబేద్కర్ యూత్ అధ్యక్షుడు దారా మనోజ్ కుమార్ అధ్యక్షతన మాల మహానాడు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రైస్తవ మతం స్వీకరించిన దళితులకు ఎస్సీ రిజర్వేషన్లు తొలగించాలనే ప్రభుత్వ నిర్ణయాలు సమంజసం కాదన్నారు. మతం మారినంత



మాత్రాన రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్ హక్కును కోల్పోవడం సరికాదని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఎస్సీ మాలలకు అన్యాయం జరిగే విధంగా నిర్ణయాలు తీసుకోవడం దురదృష్టకరమని విమర్శించారు. సమావేశంలో మాల మహానాడు పోలవరం నియోజకవర్గ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా తలారి సతీష్, జీలుగుమిల్లి మండల అధ్యక్షుడిగా గుడెల్లి రవి, జీలుగుమిల్లి యూత్ అధ్యక్షుడిగా దారా మనోజ్ కుమార్ ఎన్నికయ్యారు. దళితులపై జరుగుతున్న దాడులను నాయకులు తీవ్రంగా ఖండించారు. అటువంటి ఘటనలకు పాల్పడిన వారిపై ప్రభుత్వం చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుండె నాగేశ్ బాబు, రాష్ట్ర లీగల్ అడ్వైజర్ తోర్లపాటి శ్రీనివాస్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మర్రి శామ్యూల్, జిల్లా కార్యదర్శి గారపాటి నానాజీ, డివిజనల్ అధ్యక్షులు పొడపాటి రమేష్, ప్రసన్న కుమార్, సింగవరపు మనోజ్ కుమార్, కుమ్మరపల్లి ప్రకాష్, గుడెల్లి లక్ష్మీనారాయణతో పాటు మండల మాల సంఘం నాయకులు, యువజన సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

పాలకొల్లు పట్టణ పరిధిలో గల జి.వి.ఎస్.వి. ఆర్.ఎం. మున్సిపల్ మోడల్ ప్రాథమిక పాఠశాలలో జాతీయ వైద్యుల దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లావణ్య హాస్పిటల్‌కు చెందిన వైద్యులు డా. జగ్రోతు స్వరూప్ ని ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవాని ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డా. జాగ్రోతు శ్రీ స్వరూప్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం జూలై 1న దేశవ్యాప్తంగా జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహిస్తారని తెలిపారు. భారతరత్న డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ భారతదేశ ప్రఖ్యాత వైద్యుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, విద్యావేత్త, పశ్చిమ బెంగాల్ రెండవ ముఖ్యమంత్రి



అని వివరించారు. ఆయన 1882 జూలై 1న జన్మించి, 1962 జూలై 1న పరమపదించారని, ఆయన వైద్య రంగానికి, ప్రజాసేవకు అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 1961లో భారతరత్న పురస్కారాన్ని ప్రదానం చేసిందని తెలిపారు. ఆయన సేవలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం జూలై 1న జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. వైద్య వృత్తి అత్యంత పవిత్రమైన సేవా వృత్తి అని, వైద్యులు తమ జ్ఞానం, అనుభవంతో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తారని చెప్పారు. ప్రతి ఒక్కరూ వైద్యుల సేవలను గౌరవించాలని, ఆరోగ్యమే మహాభాగ్యమనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, భోజనం చేసే ముందు, మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత తప్పనిసరిగా సబ్బుతో చేతులు కడుక్కోవాలని, పోషకాహారం తీసుకోవాలని, రోజూ వ్యాయామం చేయాలని, సమయానికి నిద్రపోవాలని, తగినంత నీరు తాగాలని, అనారోగ్యంగా ఉన్నప్పుడు స్వయంగా మందులు వాడకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఆరోగ్యకరమైన అలవాట్లు చిన్న వయస్సులోనే అలవరచుకుంటే భవిష్యత్తులో మంచి ఆరోగ్యంతో పాటు మంచి పౌరులుగా ఎదుగుతారని విద్యార్థులకు వివరించారు. ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీ ప్రసాద్ మాట్లాడుతూ, వైద్యులు సమాజానికి అందిస్తున్న సేవలు అమూల్యమైనవని, వారి సేవలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. విద్యార్థులు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకొని పరిశుభ్రమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధుసూదన్ రెడ్డి, మమత ,నందిని పాల్గొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వైద్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ జాతీయ వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ- సర్ ప్రక్రియకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పని చేయాలి



## జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

ప్రజాభూమి ప్రతినిధి – కాకినాడ

జిల్లాలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియకు అధిక ప్రాధాన్యత ఇచ్చి అధికారులు పని చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రియ, వివిధ నియోజకవర్గాల ఈ ఆర్వోలతో కలిసి జిల్లాలోని అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ.. ఈసీఐ ఆదేశాల ప్రకారం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ అత్యంత కీలకమైనదన్నారు. జిల్లాలో గత జూన్ 15 నుంచి ప్రారంభమైన ఇంటింటా ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ ప్రక్రియను జూలై 03 నాటికి వంద శాతం పూర్తి చేయాలని, అందుబాటులో లేని వారికి నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేశారు. పంపిణీ చేసిన పత్రాల సేకరణ, నాట్ ట్రేస్ అవుట్, డెత్, షిఫ్టెడ్, డూప్లికేట్, మైగ్రేషన్ ఓట్ల వివరాలు రేపటి నుంచి ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు నివేదిక సిద్ధం చేసి ఈఆర్వోకు సమర్పించాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం జిల్లాలో 30.81 శాతంగా ఉన్న డిజిటలైజేషన్ ప్రక్రియను జూలై 10 నాటికి పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. త్వరలోనే ఈసీఐ నుంచి ఉన్నత అధికారులు, రోల్ అబ్జర్వర్, రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ ఐఏఎస్ అధికారులు క్షేత్ర స్థాయి తనిఖీలకు వచ్చేందుకు అవకాశం ఉన్నందున బీఎల్వో అత్యంత పారదర్శకంగా, తప్పులు లేకుండా సర్ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలన్నారు. జూలై 10 తర్వాత జిల్లాలోని 1,640 పోలింగ్ కేంద్రాల పరిధిలో బీఎల్ఓలు తప్పనిసరిగా బీఎల్ఏలతో సమావేశాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఎన్నికల విధుల్లో ఎవరూ నిర్లక్ష్యం వహించకూడదని, అజాగ్రత్తగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఈ సందర్భంగా హెచ్చరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డా.టి.తిప్పేనాయక్, కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, వివిధ నియోజకవర్గాల ఈఆర్వోలు, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ ఎం. జగన్నాథం ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావు, ఆనంద్ కుటుంబాలకు పరమార్శ

### రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి



ప్రజాభూమి ప్రతినిధి – నూజివీడు

నూజివీడు మండలం పడమర ధిగవల్లి గ్రామంలో ఇటీవల స్వర్గస్తులైన మాజీ గ్రామ సర్పంచు వెంకటేశ్వరరావు, మరియు విద్యార్థి ఆనంద్ ఇరువురి వివరాలు తెలుసుకొని, వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పేరు పేరున అందరినీ పలకరించి ఘన నివాళులు అర్పించిన రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు కొలుసు పార్థసాహరధి.గతంలో వెంకటేశ్వరరావు గ్రామానికి చేసిన సేవలు గుర్తుచేసుకొని స్మరించుకున్న కుటుంబసభ్యులు. నాయకులు. ఇరువురు కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అండ దండగా ఉంటుందనిఅన్నారు.ప్రభుత్వం తరపున వచ్చే వివిధ పథకాలు ఇతర సహాయం అందేలా నా వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. వెంకటేశ్వరరావు చేసిన గ్రామ అభివృద్ధిని గుర్తుచేసుకొని ఘన నివాళులు అర్పించిన మంత్రివర్యులు వెంట వార్డు నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వైద్యుల సేవలు సమాజానికి అమూల్యం

### డాక్టర్స్ డే సందర్భంగా ఘన సన్మానం

ప్రజాభూమి ప్రతినిధి – ఆగిరిపల్లి


డాక్టర్స్ డే సందర్భంగా బుధవారం ఆగిరిపల్లి, ఈదర, సద్గురు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు చంద్రమౌళీశ్వరరావు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్యులు రాత్రింబవళ్లు నిస్వార్థంగా సేవలందిస్తున్నారని, వారి సేవలు సమాజానికి అమూల్యమైనవని, ప్రతి ఒక్కరూ వైద్య వృత్తిని గౌరవించాలని అన్నారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులు రాజు, చంద్రమౌళీశ్వరరావు, శ్యామ్, రవికుమార్, బాబురావు ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్ టీనా, డాక్టర్ మహతిలను దుశ్శాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఇదే విధంగా ఈదర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ నరేంద్ర కృష్ణ, డాక్టర్ జ్ఞాన సందీప్‌లకు, సగ్గూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ మంజులదేవి, డాక్టర్ సంధ్యాప్రియలకు మధ్యస్థాయి ఆరోగ్య సేవల అధికారిణిలు, ఆసుపత్రి సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి కేక్ కట్ చేసి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.

# దేశంలోనే అత్యధిక పింఛన్లు అందిస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్

### నియోజకవర్గంలో 41,500 మందికి 18.23 కోట్ల పంపిణీ : కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ప్రజాభూమి ప్రతినిధి – కొత్తపేట

పింఛన్ల పంపిణీలో దేశంలోనే ఆదర్శ విధానం అమల్లో ఉన్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. బుధవారం వాడపాలెంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్వయంగా ఇంటింటికి వెళ్లి పింఛన్లను అందజేశారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో దేశంలోనే అత్యధిక పింఛన్ మొత్తం అందిస్తున్న రాష్ట్రం కూడా ఆంధ్రప్రదేశ్ అన్నారు. నియోజకవర్గంలో నేటి నుంచి



కొత్తగా స్పౌజ్ కేటగిరీలో 73 పింఛన్లు అందించడం జరుగుతుందన్నారు. ఎన్డీఏ కూటమి పాలన వచ్చాక 60 వేల కోట్ల రూపాయలు పింఛన్ల పంపిణీ కోసం ఇప్పటి వరకు ఖర్చు చేయడం జరిగిందన్నారు. ఒకటో తేదీన సెలవు ఉంటే 31వ తేదీనే పింఛన్లు అందిస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. కొత్తవారికి, అర్హులకు రాబోయే రోజుల్లో నూతనంగా పింఛన్లు అందిస్తామన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో వెయ్యి రూపాయలు పింఛన్ పెంచడానికి ఐదేళ్ల కాలం తీసుకున్నారని, అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.3వేల పింఛన్ ను రూ.4వేలకు, అలాగే వికలాంగులకు రూ.6వేలు, బెడ్ రెస్ట్ పేషెంట్లకు రూ.15వేలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కుతుందన్నారు. అర్హులందరికీ నూతన పింఛన్లు అందించడానికి త్వరలోనే కార్యాచరణ మొదలవుతుందన్నారు.

# కూటమి ప్రభుత్వ హయాంలో పేదలకు భరోసా

### పింఛన్ల పంపిణీలో పాల్గొన్న టీడీపీ నేత బొల్లా పుల్లయ్య



ప్రజాభూమి ప్రతినిధి – ఏటపాక

మండల పరిధిలో గన్నవరం గ్రామంలో బుధవారం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు బొల్లా పుల్లయ్య పింఛన్ లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సామాజిక భద్రత పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. గ్రామంలోని వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు స్వయంగా పింఛన్ అందజేసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బొల్లా పుల్లయ్య మాట్లాడుతూ ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా టీడీపీ ఎప్పటికప్పుడు కృషి చేస్తుందని చెప్పారు. గ్రామ ప్రజల సంక్షేమమే తమ పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. లబ్ధిదారులు పింఛన్లు అందుకున్న సందర్భంగా సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

# పులిరాముడుగూడెం పాఠశాల రేషనైజేషన్ పై ఫలించని చర్చలు

### గ్రామస్థులతో చర్చించిన జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ శ్రావణ్ కుమార్ రెడ్డి



ప్రజాభూమి – బుట్టాయగూడెం

గత 22 రోజులుగా మండలంలోని పులిరాముడుగూడెం గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల స్థాయిని తగ్గించకుండా 10వ తరగతి వరకు యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ పాఠశాల ప్రధాన గేటు వద్ద గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆందోళన నిర్వహిస్తున్నారు. గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు పాఠశాల స్థాయిని తగ్గించకుండా కొనసాగించాలని, ఆదివాసి కొండ రెడ్డి గిరిజనుల పాఠశాలల్లో రేష్నలైజేషన్ అమలు చేస్తే విద్య అందదని వారంతా డ్రాప్ అవుట్ గా మారిపోతారని ఆందోళన చెందుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై 20 రోజులు కావస్తున్నప్పటికీ తమ పిల్లల్ని పాఠశాలలకు గాని ఆశ్రమ హాస్టల్ కి గాని పంపించకుండా ఆందోళన చేస్తున్నారు. ఈ క్రమంలో పులిరామన్నగూడెం ఆశ్రమ ఉన్నత పాఠశాలను బుధవారం ఏలూరు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్, ట్రైనింగ్ కలెక్టర్ శ్రావణ్ కుమార్ రెడ్డి సందర్శించి పులిరామన్నగూడెం గ్రామ అభివృద్ధి కమిటీతోను, లంకపాకల గ్రామ పాఠశాల గురించి అలివేరు మాజీ సర్పంచ్ కారం లక్ష్మి, గడ్డపల్లి గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ సోంద్రు శారద ముసలారెడ్డితో, పి ఆర్ గూడెం మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఉద్దండం ఏసుబాబులతో విడివిడిగా చర్చలు జరిపారు. మూడు నుంచి ఏడవ తరగతి వరకు మాత్రమే ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, ఎనిమిది, తొమ్మిది, పది తరగతులకు పులి రామన్నగూడెం, రెడ్డి కోపల్లి, లంకపాకల, ఇటుకలకోట, తదితర పాఠశాలల్లో అనుమతి లేదని కేవలం ఏడవ తరగతి వరకు మాత్రమే పర్మిషన్ ఉన్నదని స్పష్టం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించకుండా, ఒప్పుకోవాలని కోరారు. కానీ పై గ్రామాలకు చెందిన గిరిజనులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ట్రైనింగ్ కలెక్టర్ శ్రావణ్ కుమార్ ప్రతిపాదనను తిరస్కరించారు. విద్యా హక్కు చట్టం ప్రకారం మా ఊరిలో మాకు పదవ తరగతి వరకు పాఠశాలలు ఉండాలని, షెడ్యూల్డ్ ప్రాంతంలో రేష్నలైజేషన్ విధానాన్ని అమలు చేయకూడదని పట్టు పట్టారు. ఈ చర్యతో కొండ రెడ్డి గిరిజనుల్లో డ్రాప్ అవుట్ పెరిగిపోతాయని, ఇప్పటికే పై గ్రామాలలో గ్రామానికి ఐదు నుంచి పదిమంది డ్రాప్ అవుట్స్ ఉన్నారని, వారితోపాటు ఈ విద్యా సంవత్సరంలో మరికొంతమంది విద్యార్థులు డ్రాప్ అవుట్‌గా మారిపోతారని తెలిపారు. పులిరామన్న గూడెం పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ఎక్కడో మారుమూలన పోలవరం మండలం కొంకాల గ్రామంలో చేర్పించాలని ఐటీడీఏ అధికారులు ప్రతిపాదించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే అంతవరకు తమ పిల్లల్ని పాఠశాలలకు కానీ హాస్టల్స్ కానీ పంపించమని కరాకండిగా చెప్పారు. గత 22 రోజుల నుండి మేము చేస్తున్న ఆందోళనను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని మా న్యాయమైన సమస్య పరిష్కరించేంతవరకు ఆందోళన విరమించేది లేదని తెగేసి చెప్పారు.

# జెన్సిస్ సంస్థపై పెట్టుబడి మోసం కేసు నమోదు!

- సర్పవరం స్టేషన్‌కు క్యూ కడుతున్న జెన్సిస్ బాధితులు
- మోసపోయిన బాధితులు ఆధారాలు తో ఫిర్యాదు చేయండి సి.ఐ రవిప్రకాష్



ప్రజాభూమి ప్రతినిధి – కాకినాడ రూరల్

కాకినాడలో కొన్నేళ్ళుగా లావాదేవీలు నిర్వహిస్తున్న ఆల్మైటీ జెన్సిస్ క్యాపిటల్ మేనేజ్మెంట్ ప్రయివేటు కంపెనీ పై సర్పవరం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఈ సంస్థపై క్రైమ్ నెం. 221/2026గా పెట్టుబడి మోసం కేసు నమోదు చేయబడింది. ఫిర్యాదుదారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు, కాకినాడలోని ఈ సంస్థ డైరెక్టర్లు స్టాక్ మార్కెట్ పేరుతో అధిక లాభాలు వస్తాయని నమ్మించి పెట్టుబడులు సేకరించి, ప్రారంభంలో కొంతకాలం నెలవారీ రాబడులు చెల్లించి, అనంతరం చెల్లింపులు నిలిపివేసి పెట్టుబడిదారులను మోసం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం, సుమారు 3,060 మంది పెట్టుబడిదారుల నుండి రూ.47 కోట్లకు పైగా సేకరించి, రూ.38 కోట్ల మేర మోసానికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొనబడింది. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అధిక లాభాల ఆశ చూపే పెట్టుబడి పథకాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్పవరం పోలీసులు సూచించారు. బుధవారం సర్పవరం పోలీసు స్టేషన్ కు విచ్చేసిన బాధితులకు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవిప్రకాష్ నేరుగా మాట్లాడారు. తగిన ఆధారాలు తో బాధితులు పిర్యాదు చేయాలని సూచించారు. బాధితులకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# అగ్రికల్చర్ ఫార్మసీలో రాష్ట్ర స్థాయిలో నాలుగో ర్యాంక్ సాధించిన కర్రి సత్యనారాయణ



ప్రజాభూమి – కాకినాడ రూరల్

కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కర్రి వెంకట్రాజు తనయుడు కర్రి సత్యనారాయణ అగ్రికల్చర్ ఫార్మసీ కోర్సులో రాష్ట్ర స్థాయిలో నాలుగో ర్యాంక్ సాధించి గ్రామానికి, కుటుంబానికి గర్వకారణంగా నిలిచారు. సత్యనారాయణ సాధించిన ఈ విశిష్ట విజయంపై గ్రామస్థులు, స్నేహితులు, పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కష్టపడి చదివి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన సత్యనారాయణను పలువురు అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కర్రి వెంకట్రాజు కుటుంబ సభ్యులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, తమ కుమారుడి విజయానికి సహకరించిన ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు.

# పింఛన్లు పంపిణీ చేసిన గొల్లు దుర్గాదేవి

ప్రజాభూమి ప్రతినిధి – నూజివీడు

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు ప్రవేశపెట్టిన సామాజిక పెన్షన్లను మానవత్వంతో మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొనసాగిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఉదయం నుండి నూజివీడు పట్టణం 32 వ వార్డు లో రజక పేట, కొప్పుల వేలంపేట, గణేష్ నగర్ మరియు వార్డు చివర అన్నవరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి భరోసా పెన్షన్లను మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గొల్లు దుర్గాదేవి, పార్టీ వార్డు మెంబర్ లేలా గోపాలరావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది డేటా ఆపరేటర్ శాంతిరాజ్, బి ఎల్ ఓ మురళి, సానిటరీ సెక్రెటరీ ధనుంజయ పాల్గొని విజయవంతం చేశారు



# 'మావిగన్' పేరుతో ప్రజలను మభ్యపెట్టొద్దు

### జగన్‌పై జనసేన నేతల ఘాటు విమర్శలు



ప్రజాభూమి – ఏలూరు

జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో జనసేన నాయకులు రెడ్డి అప్పలనాయుడు,మేకా ఈశ్వరయ్య మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్ . జగన్ మోహన్ రెడ్డి పై తీవ్ర విమర్శలు చేశారు. ఇటీవల నిర్వహించిన మీడియా సమావేశంలో జగన్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, అమరావతే రాష్ట్ర రాజధానిగా కేంద్ర ప్రభుత్వం, చట్టం ద్వారా నిర్ణయించిన నేపథ్యంలో మళ్లీ "మావిగన్" పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో మూడు రాజధానుల ప్రతిపాదనతో రాష్ట్రంలో అయోమయం సృష్టించారని, ప్రస్తుతం అమరావతి ప్రాంతంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతుండటాన్ని ఓర్వలేక ప్రజల్లో గందరగోళం సృష్టించేలా వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు.వైసీపీ పాలనలో దళితులపై జరిగిన ఘటనలను ప్రజలు మరచిపోలేదని, వాటికి ఆ పార్టీనే బాధ్యత వహించాలని విమర్శించారు.ప్రజల మధ్య కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టే రాజకీయాలకు జగన్ అలవాటు పడ్డారని, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం చట్టబద్ధంగా పాలన కొనసాగిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తుంటే, వాటిని అడ్డుకునేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు.రాష్ట్ర ప్రజలు చైతన్యవంతులని, ఎవరు రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నారో వారికి బాగా తెలుసని పేర్కొన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు 2029 ఎన్నికల్లో కూడా ప్రజలు కూటమి ప్రభుత్వానికే మద్దతు ఇస్తారని, వైసీపీకి గట్టి గుణపాఠం చెప్పనున్నారని జనసేన నాయకులు స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కార్యదర్శి ఓబిలి శెట్టి శ్రావణ్ కుమార్ గుప్తా, నగర అధ్యక్షుడు వీరంకి పండు, నాయకులు రెడ్డి గౌరీశంకర్, బోండా రామునాయుడు, మీడియా ఇన్‌చార్జ్ జనసేన రవి పాల్గొన్నారు.

# సమాచార శాఖ సహాయ సంచాలకులు ఆర్.వి.ఎస్. రామచంద్రరావుకు ఘన పదవీ విరమణ సన్మానం



### రామచంద్రరావు-భారతి దంపతులకు ఘన సత్కారం

ప్రజాభూమి ప్రతినిధి – రాజమహేంద్రవరం

సుమారు నాలుగు దశాబ్దాల పాటు సమాచార ఒ పౌర సంబంధాల శాఖలో వివిధ హోదాల్లో సేవలందిస్తూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో విశిష్ట సేవలు అందించిన సహాయ సంచాలకులు ఆర్.వి.ఎస్. రామచంద్రరావు సేవలు ప్రశంసనీయమని సమాచార ఒ పౌర సంబంధాల శాఖ జోన్–2 ప్రాంతీయ సంయుక్త సంచాలకులు పి. తిమ్మప్ప అన్నారు. బుధవారం స్థానిక ఆనం కళా కేంద్రం ప్రాంగణంలోని సర్వారాయ హాల్లో సమాచార శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ఆర్.వి.ఎస్. రామచంద్రరావు పదవీ విరమణ సందర్భంగా ఘన సన్మాన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ అదనపు సంచాలకులు ఎల్. స్వర్ణలత, జోన్–2 ప్రాంతీయ సంయుక్త సంచాలకులు పి. తిమ్మప్ప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పి. తిమ్మప్ప మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడంలో సమాచార శాఖ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఉద్యోగ జీవితంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ తనకు అప్పగించిన బాధ్యతలను రామచంద్రరావు సమర్థవంతంగా నిర్వహించి శాఖకు మంచి పేరు తీసుకువచ్చారని కొనియాడారు. రిటైర్డ్ అదనపు సంచాలకులు ఎల్. స్వర్ణలత మాట్లాడుతూ మీడియా ప్రతినిధులతో ఎల్లప్పుడూ సమన్వయం పాటిస్తూ శాఖ ప్రతిష్ఠను పెంపొందించే విధంగా రామచంద్రరావు విధులు నిర్వహించారని అన్నారు. ఏ బాధ్యత అప్పగించినా అంకితభావంతో పూర్తి చేసి సహచరులకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. పాత్రికేయులు, వక్తలు మాట్లాడుతూ రామచంద్రరావు ఎల్లప్పుడూ మీడియా ప్రతినిధులతో ఆత్మీయ సంబంధాలు కొనసాగిస్తూ, వార్తల సేకరణ, ప్రభుత్వ సమాచారాన్ని సకాలంలో అందించడంలో విశేష సహకారం అందించారని కొనియాడారు. అందరికీ అందుబాటులో ఉంటూ, వినయపూర్వకంగా వ్యవహరించే వ్యక్తిగా ఆయన గుర్తింపు పొందారని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవిస్తూ సమాజానికి తన సేవలను కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆర్వీస్ రామచంద్రరావు మాట్లాడుతూ సమాచార శాఖలో నాలుగు దశాబ్దాల సేవా ప్రయాణం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని, సహచరుల సహకారం, ఉన్నతాధికారుల ప్రోత్సాహం వల్లే బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించగలిగానని తెలిపారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో భాగస్వామ్యం కావడం తనకు గర్వకారణమని, పదవీ విరమణ అనంతరం కూడా శాఖకు, సమాజానికి అవసరమైన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉంటానని పేర్కొన్నారు. తనకు ఘన సన్మానం చేసిన శాఖాధికారులు, సిబ్బంది, పాత్రికేయ మిత్రులు, కుటుంబ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి రాజమహేంద్రవరం సమాచార శాఖ సహాయ సంచాలకులు ఎం.



లక్ష్మణాచార్యులు అధ్యక్షత వహించారు. జిల్లా సమాచార ఒ పౌర సంబంధాల అధికారి కె. లక్ష్మీనారాయణ, రిటైర్డ్ జిల్లా ఎస్పీ నక్క సూర్యచంద్రరావు, సమాచార శాఖ రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ ఎం. ఫ్రాన్సిస్, పాత్రికేయులు కృష్ణకుమార్, శైలేంద్ర, భూషణ్‌బాబు, ఎం. శ్రీరామ్మూర్తి, పార్థసారథి, పీటీఐ రాజా, రాష్ట్ర అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు ఉదయభాస్కర్, ఎం.ఆర్.కె. అధినేత మాణిక్యాలరావు, రాష్ట్ర కళాకారుల సంఘం ప్రతినిధి బుద్దాల రామారావు, రఘు, రాజు, బాబులు, యండమూరి శ్రీనివాస్, ఎం.పీ. సత్యనారాయణతో పాటు రామచంద్రరావు కుటుంబ సభ్యులు పాల్గొని ఆయన సేవలను కొనియాడారు. అనంతరం ఆర్.వి.ఎస్. రామచంద్రరావు--భారతి దంపతులను రిటైర్డ్ అదనపు సంచాలకులు ఎల్. స్వర్ణలత, జోన్–2 ప్రాంతీయ సంయుక్త సంచాలకులు పి. తిమ్మప్ప దుస్సాలువాలు, స్మారకచిహ్నాలతో ఘనంగా సత్కరించారు.

## వి బి జి రామ్ జి చట్టాన్ని రద్దు చేయండి

### అరగటి వేముల గ్రామ సచివాలయం వద్ద నిరసన

### ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ .సూరి



ప్రజాభూమి, పుట్లూరు.

2005 జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి విబిజి రాంజీ పేరుతో వచ్చిన చట్టాన్ని రద్దు చేయాలని బుధవారం పుట్లూరు మండలం అరకటి వేముల గ్రామ సచివాలయం కార్యదర్శి కి అర్జీ ఇచ్చి నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. సూరి మాట్లాడుతూ ఈరోజు వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ కార్మికులకు ఒక చీకటి దినంగా భావిస్తున్నామన్నారు ఎందుకంటే 2005 జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేదలకు వెనుకబడిన జిల్లాలకు ఒక వరం లాగా ఉన్నదని ఈ చట్టం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వలసలు తగ్గి కాస్తో కూస్తో అభివృద్ధి జరిగిందన్నారు ఇలాంటి చట్టాన్ని నీరు కార్చడానికి కేంద్రప్రభుత్వం భవిష్యత్తులో పేదలే ఈ చట్టం నాకు వద్దు అనే పరిస్థితికి తీసుకువచ్చేందుకు విబిజీ రాంజీ ఉపయోగపడుతుందన్నారు. ఈ కొత్త చట్టం ద్వారా రెండు పూటలా ఫేస్ యాప్ తీసుకువచ్చి కనీస సౌకర్యాలు, పనిముట్లు ఎత్తివేసిందన్నారు ఇప్పటికే చేసిన పనులకు రెండు నెలల నుండి వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం 40% నిధులు భరించాల్సి వస్తుందన్నారు సంవత్సరంలో 60 రోజులపాటు పనులు కల్పించకూడదని చట్టంలోనే ఉందన్నారు దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో తిరిగి వలసలు ప్రారంభమవుతాయని ఉపాధి హామీ కూలీలు వ్యవసాయ కార్మికులు పని అడిగే హక్కును కోల్పోతారని భవిష్యత్తులో ఈ చట్టమే మాకు వద్దు అనే పరిస్థితులకు తీసుకు వస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా విబి జి రాంజీ చట్టాన్ని రద్దు చేసి పాత పద్ధతి లోనే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొన సాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పెద్దయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి వెంకట చౌదరి, కెవిపిఎస్ మండల కార్యదర్శి నాగభూషణం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పెద్దయ్య, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యప్రదాతలు డాక్టర్లే

### -పాంచజన్య ఘనంగా వైద్యుల దినోత్సవం

ప్రజాభూమి, హిందూపురం టౌన్

సమాజానికి ఆరోగ్యవంతులైన పౌరులను ఇవ్వడంలో వైద్యులు ప్రథమ స్థానంలో ఉంటారని పాంచజన్య పాఠశాల అధ్యక్షులు శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం పాఠశాలలో శ్రీనివాసులు, కరస్పాండెంట్ నందకుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ, మనదేశంలో జూలై 1వ తేదీన జాతీయ వైద్యుల దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. భారతరత్న మన దేశ ప్రముఖ వైద్యులు, స్వాతంత్ర సమరయోధులు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ బిదాన్ చంద్ర రాయ్ జయంతిని పురస్కరించుకుని ఆయన స్ఫూర్తిగా డాక్టర్స్ డే నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. వైద్య వృత్తి చాలా పవిత్రమైనదని, దేవుడు జన్మనిస్తే ప్రమాదవశాత్తు మృత్యువుకు దగ్గరైన వారికి కూడా తమ మేధాశక్తితో పునర్జన్మను ఇచ్చే వారే వైద్యులన్నారు. భారత ప్రభుత్వం కూడా వైద్య సదుపాయాలపై కోట్ల రూపాయలను ఖర్చు చేసి పేదవారికి ఉచితంగా ఖరీదైన వైద్య సేవలను అందిస్తోందని తెలిపారు. డాక్టర్లుగా డబ్బుకు ప్రాముఖ్యత ఇవ్వకుండా ముందుగా వైద్య సేవలను అందజేయాలని తెలియజేశారు. కాగా విద్యార్థులు డాక్టర్లు వేషధారణలో వైద్య సేవలపై అవగాహన కల్పిస్తూ ఇచ్చిన నాట్య ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్.ఎం. గాయిత్రి, ఏఓ భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, ఏహెచ్ఎంలు శశికళ, సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## ప్రజలకు అండగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు



ప్రజాభూమి, హిందూపురం టౌన్


ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పేద ప్రజలకు అండగా నిలుస్తున్నాయని తెలుగు యువత నాయకులు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని చౌడేశ్వరి కాలనీలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్ అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పథకం కింద ప్రతినెల 1వ తేదీనే పెన్షన్లు అందజేస్తూ ఆయా కుటుంబాల్లో ఆనందాన్ని నింపుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత పట్టణ అధ్యక్షులు తలుపుల భార్గవ్, 2వ వార్డు తెలుగు యువత అధ్యక్షులు సాయి సందీప్, ఉపాధ్యక్షులు నవీన్ కుమార్, కార్యదర్శి శివ, కార్యనిర్వహణ కార్యదర్శి బాబాజాన్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణ ప్రదాతలు వైద్యులు

### -ప్రభుత్వాసుపత్రిలో న్యాయవిజ్ఞాన సదస్సు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

ప్రాణప్రదాతలు వైద్యులని వక్తలు పేర్కొన్నారు. బుధవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జిల్లా స్థాయి ప్రభుత్వాసుపత్రిలో మండల న్యాయ సేవ అధికారి సంస్థ ఆధ్వర్యంలో వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బీసీ రాయ్ జ్ఞాపకార్థం ప్రతి ఏటా జూలై 1వ తేదీన వైద్యుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. భారత ప్రభుత్వం 1991 నుండి అధికారికంగా ఈ దినోత్సవాన్ని జరుగుతున్నట్లు చెప్పారు. న్యాయవాదులు మాట్లాడుతూ, వృత్తిలో వైద్యులు క్షణం తీరిక లేకుండా ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. వైద్యుల సేవలకు కృతజ్ఞతలు తెలపాల్సిన బాధ్యత అందరిపైన ఉంటుందని చెప్పారు. ప్రధానంగా కరోనా సమయంలో వైద్యులు ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి ఎంతోమంది ప్రజలను కాపాడారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రాజగోపాల్, ఆర్ఎంఓలు డాక్టర్ చరణ్, డాక్టర్ ప్రసాద్, న్యాయవాది కదిరి కుమార్, లోక్ అదాలత్ సిబ్బంది రాజా, పారా లీగల్ వాలంటీర్లు మాళప్ప, చంద్రకాంత్, సురేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.




# నూతన ఆలోచనలను అన్వేషించే, నూతన జ్ఞానాన్ని సంపాదించే ధైర్యాన్ని పెంపొందించుకోండి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము..





ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గారు ఈ రోజు (జూలై 1, 2026) ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురములో జరిగిన ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవానికి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖ మంత్రి నారా లోకేశ్, రాష్ట్ర ఆర్థిక, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, కేంద్రీయ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ డా.శంకరఆచార్య, ఉపకులపతి ఆచార్య ఎస్.ఎ.కోరి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవం కేవలం ఒక వేడుక దినం మాత్రమే కాదని, ఈ యువ సంస్థ ప్రస్థానంలో ఇది ఒక కీలకమైన మైలురాయి అని అన్నారు. భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే సంస్థగా మారడానికి ఈ విశ్వవిద్యాలయం ఒక దీర్ఘకాలిక దార్శనికతను అభివృద్ధి చేసుకుందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల పట్ల, ముఖ్యంగా నాణ్యమైన విద్యకు సంబంధించిన లక్ష్యాల పట్ల దీనికున్న నిబద్ధత, సమ్మిళిత మరియు సమానత్వ అభివృద్ధి పట్ల బాధ్యతా స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని ఆమె అన్నారు. ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం ఒక శ్రేష్ఠతా కేంద్రంగా ఆవిర్భవించి, 2047 నాటికి వికసిత్ భారత్ దార్శనికత సాకారానికి గణనీయంగా దోహదపడుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. పట్టభద్రులైన విద్యార్థులను ఉద్దేశించి రాష్ట్రపతి మాట్లాడుతూ, ఈ స్నాతకోత్సవం వారి సంవత్సరాల అంకితభావం, పట్టుదల మరియు కఠోర శ్రమకు పరాకాష్ట అని అన్నారు. వారు కలలతో విశ్వవిద్యాలయంలో ప్రవేశించారు, ఈ రోజు వారు జ్ఞానం, ఆత్మవిశ్వాసం మరియు వారికి కొత్త అవకాశాల తలుపులు తెరిచే డిగ్రీతో బయటకు వెళ్తున్నారు. విద్యార్థుల విజయం వారి సొంత కఠోర శ్రమ ఫలితమే అయినప్పటికీ, అది వారి తల్లిదండ్రుల త్యాగాలు, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం మరియు సమాజ మద్దతుతో కూడా రూపుదిద్దుకుందని రాష్ట్రపతి అన్నారు. అందువల్ల, సమాజానికి తిరిగి సేవ చేయాల్సిన బాధ్యత వారిపై ఉంది. వారు ఉపాధి కల్పించే పారిశ్రామికవేత్తలుగా, ఆవిష్కరణలను నడిపించే శాస్త్రవేత్తలుగా, ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులుగా, లేదా సమాజ సేవ చేసే దాతలుగా మారినా, వారి విద్య అణగారిన వర్గాలకు బలంగా మారాలి. సాంకేతిక పురోగతులు ప్రతి రంగాన్ని మారుస్తున్నాయని రాష్ట్రపతి అన్నారు. ఇంత వేగంగా మారుతున్న ప్రపంచంలో, డిగ్రీ సంపాదించడంతో చదువు ముగిసిపోకూడదు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలకు నిరంతరం అనుగుణంగా మారే తపన విద్యార్థులకు గొప్ప బలాలలో ఒకటిగా ఉంటుంది. కొత్త ఆలోచనలను అన్వేషించడానికి, కొత్త జ్ఞానాన్ని సంపాదించడానికి ధైర్యాన్ని పెంపొందించుకోవాలని ఆమె వారికి సూచించారు. నేర్చుకోవాలనే తపన, పట్టుదల, నూతన ఆవిష్కరణలు చేసే మన యువత మన అమూల్యమైన జాతీయ సంపద అని రాష్ట్రపతి అన్నారు. తమ జ్ఞానాన్ని సృజనాత్మకత, పట్టుదల, బాధ్యతా భావంతో మేళవించడం ద్వారా, మన యువత సవాళ్లను అవకాశాలుగా మార్చుకుని, మరింత సమ్మిళిత, సుసంపన్నమైన భారతదేశ నిర్మాణానికి దోహదపడగలరు. నైతిక విలువలను అలవర్చుకోవడం విద్యార్థులకు ఎంతో సహాయపడుతుందని రాష్ట్రపతి చెప్పారు. నిజాయితీ, కరుణ, సానుభూతి, ప్రకృతి పట్ల గౌరవం అనేవి కేవలం ఉన్నతమైన నైతిక ఆదర్శాలు మాత్రమే కాదని, అవి సంపూర్ణ అభివృద్ధికి పునాదులని ఆమె అన్నారు. ఈ గుణాలు వారి జీవితాన్ని సుసంపన్నం చేసుకోవడానికి, సమాజానికి, దేశానికి అర్థవంతంగా తోడ్పడటానికి వీలు కల్పిస్తాయి. మన యువత యొక్క శక్తి, ప్రతిభ, నిబద్ధత ద్వారా మాత్రమే వికసిత భారత్ దార్శనికతను సాకారం చేసుకోగలమని రాష్ట్రపతి అన్నారు. వారు ఏ మార్గాన్ని ఎంచుకున్నా, అంకిత భావంతో, నిజాయితీతో శ్రేష్ఠతను సాధించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గోల్డ్ మెడల్ సాధించిన కేంద్రీయ విశ్వవిద్యాలయం విద్యార్థులకు గోల్డ్ మెడల్ లను భారత రాష్ట్రపతి బహుకరించారు. అంతకుముందు భారత రాష్ట్రపతిని, రాష్ట్ర గవర్నర్ ని, మంత్రి నారా లోకేశ్ ని, మంత్రి పయ్యావుల కేశవ్ ని ఉపకులపతి ఆచార్య ఎస్.ఎ. కోరి శాలువా కప్పి జ్ఞాపికలను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ రాయదుర్గం శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి, సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, కళ్యాణ్ దుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ జగదీష్, ఎస్టీ కమిషన్ సభ్యులు వెంకటప్ప, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్ కుమార్, తాడిపత్రి ఏఎస్పి రోహిత్ కుమార్ చౌదరి, ఆయా శాఖల జిల్లా అధికారులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక శిక్షణా తరగతులు జయప్రదం చేయండి

### -కరపత్రాలను విడుదల చేసిన పిడిఎస్ యూ



ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి విద్యా,వైజ్ఞానిక శిక్షణా తరగతులు ఈ నెల 10,11 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా పలాసలోని జరుగుతాయని పిడిఎస్ యూ జిల్లా అధ్యక్షులు బాబావలి తెలిపారు. ఈ మేరకు బుధవారం కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు శ్రీకాకుళం జిల్లా పలాస పట్టణంలోని టీకేఆర్ కల్యాణ మండపంలో జరుగుతాయన్నారు. రెండు రోజుల శిక్షణా తరగతుల్లో జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు, దేశంలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్య, విద్యా రంగంలో చోటుచేసుకుంటున్న మార్పులు, విద్యార్థి ఉద్యమాల భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ నెరవేరలేదని ఆయన విమర్శించారు. విద్య, వైద్యం, రైల్వే, రక్షణ వంటి ప్రభుత్వ రంగాలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోందని ఆరోపించారు. ఇదే విధానాలను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కూడా అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో సుమారు రూ.10,700 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఫిబ్రవరిలో రూ.1,200 కోట్లు విడుదల చేస్తామని ప్రకటించి కేవలం రూ.600 కోట్లు మాత్రమే విడుదల చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుందని విమర్శించారు. రేషనలైజేషన్ పేరుతో ప్రభుత్వ పాఠశాలలను కుదించే చర్యలను వెంటనే నిలిపివేయాలని, ఉపాధ్యాయులకు విద్యాబోధనేతర పనులు అప్పగించరాదని కోరారు. యూనివర్సిటీల అభివృద్ధికి తగిన నిధులు కేటాయించి, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు నాగేంద్ర, నందీష్, దిలీప్ కుమార్, తంజిల్, ధనుష్, బసవరాజు, అజయ్, విశ్వనాథ్, జనార్ధన్, మంజునాథ్, గోవర్ధన్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా పోరుమామిళ్ల వైద్యులకు ఘన సత్కారం



ప్రజాభూమి పోరుమామిళ్ల :

మదర్ థెరెసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో "గోల్డెన్ స్టెతస్కోప్ అవార్డు -- 2026" ప్రదానం. జూలై 1: జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా పోరుమామిళ్ల మండలంలో వైద్య సేవలు అందిస్తున్న ప్రముఖ వైద్యులను మదర్ థెరెసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోల్డెన్ స్టెతస్కోప్ అవార్డు- 2026" తో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలకు మొమెంటోలు, ప్రశంసా పత్రాలు (సర్టిఫికెట్లు) మరియు జ్ఞాపికలను అందజేశారు. ఫౌండేషన్ ట్రెజరర్ చిత్తా ప్రజ్వల రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బద్వేల్ శాసనసభ్యులు డాక్టర్ దాసరి సుధా మాట్లాడుతూ, తాను మరియు తన భర్త ఇద్దరూ వైద్యులమే కావడంతో డాక్టర్ల కష్టసుఖాలు బాగా తెలుసని అన్నారు. వైద్య వృత్తి కేవలం ఉపాధి కోసం చేసే ఉద్యోగం కాదని, సేవాభావం కలిగిన వారే నిజమైన వైద్యులుగా నిలుస్తారని పేర్కొన్నారు. సమాజానికి విశేష సేవలు అందిస్తున్న వైద్యులను గుర్తించి గౌరవించడం అభినందనీయమని, ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన మదర్ థెరెసా ఫౌండేషన్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అతిథులుగా పాల్గొన్న పోరుమామిళ్ల మండల జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ మరియు మండల వైస్ ఎంపీపీ సి.ఎం. భాషా మాట్లాడుతూ, పూర్వం నుంచి మారుమూల గ్రామాల్లోనూ వైద్యులు సేవలు అందిస్తూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించారని, వారి సేవలను పోరుమామిళ్ల ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని తెలిపారు.అవార్డు గ్రహీతల తరఫున మాట్లాడిన సీనియర్ వైద్యులు డాక్టర్ రాజేశ్వరమ్మ, డాక్టర్ కె. షెనాయ్, డాక్టర్ ఎస్. కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ, 27 సంవత్సరాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మదర్ థెరెసా ఫౌండేషన్ వంటి స్వచ్ఛంద సంస్థ నుంచి గోల్డెన్ స్టెతస్కోప్ అవార్డు -- 2026 అందుకోవడం తమ జీవితంలో ఒక మధురమైన ఘట్టమని అన్నారు. ఈ గౌరవాన్ని అందించిన ఫౌండేషన్ చైర్మన్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి మరియు కో-చైర్మన్ చిత్తా గిరి ప్రణీత్ రెడ్డిలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పోరుమామిళ్లకు చెందిన ప్రముఖులు తులసి సురేష్, చెన్ను రాజశేఖర్, చాపాటి నారాయణరెడ్డి, దూల రఘునాథరెడ్డి, కె.పి. సుబ్బారెడ్డి, ఇండ్ల చెన్నారెడ్డి, బోయ సంఘం అధ్యక్షులు మనం ఆంజనేయులు, ఓఎల్ఎఫ్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అదూరి ఆరోగ్య రాణి, విశ్రాంత ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, రాజారెడ్డితో పాటు పలువురు ప్రముఖులు, వైద్యులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వైభవంగా ముగిసిన భవాని మస్తాన్ స్వామి పీర్ల పండగ మహోత్సవం-భక్తులకు అన్నదానం



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో వెలసిన శ్రీశ్రీశ్రీ భవాని మస్తాన్ స్వామి పీర్ల పండగ వేడుకలు కులమతాలకు అతీతంగా బుధవారం అత్యంత వైభవంగా ముగిశాయి. ఈ పీర్ల పండుగ మహోత్సవంలో ముజావర్లు స్వామికి మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామికి చక్కరతో సదింపు లు కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజలు కుల మతాలకు తావు లేకుండా పీర్ల పండగ మహోత్సవంలో పాల్గొన్నారు. మస్తాన్ స్వామి పీర్లతో బ్యాండ్ డప్పుల వాయిద్యాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. బుధవారం భక్తులకు అన్నదానకార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామోత్స వం అనంతరం పీర్లను బ్యాండ్ వాయిద్యాల తో జల్దికి తీసుకుపోయారు.

## అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పరిమిత సీట్ల భర్తీకి అవకాశం

### అర్హులైన విద్యార్థులు వెంటనే సంప్రదించాలి

### - ప్రిన్సిపల్ నరసింహులు



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల , కళాశాల లో పరిమిత సంఖ్యలో సీట్లు అందుబాటులో ఉన్నట్లు ప్రిన్సిపల్ సి. నరసింహులు తెలిపారు. ఖాళీగా ఉన్న సీట్లను అర్హులైన విద్యార్థులతో భర్తీ చేయనున్నట్లు ఆయన తెలిపారు .ఐదవ తరగతి లో ఎస్సీ విద్యార్థులకు 28, ఎస్టీ విద్యార్థులకు 2 సీట్లు, ఆరవ తరగతిలో ఎస్సీ విద్యార్థులకు 10 సీట్లు, తొమ్మిదవ తరగతిలో ఎస్సీ విద్యార్థులకు 5, ఎస్టీ విద్యార్థులకు 2 సీట్లు, పదవ తరగతిలో ఎస్సీ విద్యార్థులకు 6, ఎస్టీ విద్యార్థులకు 3 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.కళాశాల మొదటి సంవత్సరం లో గణిత శాస్త్ర విభాగంలో ఎస్సీ విద్యార్థులకు కొన్ని సీట్లు, ఎస్టీ విద్యార్థులకు 2 సీట్లు, జీవశాస్త్ర విభాగంలో ఎస్సీ విద్యార్థులకు, బీసీ విద్యార్థులకు సీట్లు అందుబాటులో ఉన్నట్లు ఆయన తెలిపారు. సీట్లు కోరుకునే విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి పాఠశాల ప్రిన్సిపల్‌ను సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 9704550134 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

## సరైన ప్రణాళికతోనే విజయ శిఖరాలకు....

### -లక్ష్యసాధన కోసం యువత కష్టపడాలి

### -కెరీర్ గైడెన్స్ సదస్సులో డిప్యూటీ కలెక్టర్ కె. స్వాతి




ప్రజాభూమి, హిందూపురం టౌన్

విద్యార్థి యువత తమ జీవిత లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకొని, వాటిని సాధించేందుకు సరైన ప్రణాళికతో నిరంతరం శ్రమిస్తే విజయాన్ని సులభంగా అందుకోవచ్చని రంపచోడవరం డిప్యూటీ కలెక్టర్ కె. స్వాతి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎన్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్ సెల్, ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో పోటీ పరీక్షలు, ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. ప్రగతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, ప్రధాన వక్తగా హాజరైన డిప్యూటీ కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో తాత్కాలిక ఆనందాలకు, వ్యసనాలకు, సమయ వృథాకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. పోటీ పరీక్షలకు క్రమశిక్షణతో, సమయపాలనతో సిద్ధమైతే తప్పకుండా ఆశించిన ఉద్యోగాన్ని సాధించవచ్చన్నారు. వైఫల్యాలను చూసి నిరుత్సాహపడకుండా, వాటిని విజయానికి మెట్లుగా భావించి ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. ప్రగతి మాట్లాడుతూ, జీవితంలో ఎదురయ్యే ప్రతి సవాలును సానుకూల దృక్పథంతో స్వీకరిస్తేనే వ్యక్తిత్వ వికాసంతో పాటు వృత్తి జీవితంలోనూ ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. ప్రతి విద్యార్థి తనకు నచ్చిన రంగంలో స్థిరపడి సమాజ అభివృద్ధికి తన వంతు సేవలందించేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో విద్యార్థులు కెరీర్ గైడెన్స్, పోటీ పరీక్షల ప్రణాళిక, ఉద్యోగ అవకాశాలకు సంబంధించిన పలు సందేహాలను డిప్యూటీ కలెక్టర్ కె. స్వాతి నివృత్తి చేశారు. కార్యక్రమం ముగింపులో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు డిప్యూటీ కలెక్టర్ స్వాతిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐపీఎస్సీ కోఆర్డినేటర్ డా. శ్రీలక్ష్మి, అధ్యాపకులు డా. సరస్వతి, డా. రవి నాయక్, పార్వతి, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు, విద్యార్థినులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజాభూమి
వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 
గురువారం 02 జూలై 2026

# సమయపాలన గాలికొదిలేసిన తహశీల్దార్ కార్యాలయం..?

## మండల ప్రజల ఆగ్రహం - ప్రజలకు చుక్కలు చూపుతున్న తొండూరు రెవెన్యూ కార్యాలయం

ప్రజా భూమి తొండూరు, జూలై 1: ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాల్సిన తహశీల్దార్ కార్యాలయం ప్రస్తుతం మండల ప్రజలకు ఇబ్బందుల కేంద్రంగా మారిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా విద్యార్థుల ప్రవేశాల సీజన్‌లో ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు అత్యవసరంగా అవసరమైన సమయంలో తహశీల్దార్ అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల ఆరోపణల ప్రకారం, తహశీల్దార్ వారంలో కొద్ది రోజులే కార్యాలయానికి వస్తున్నారని, మిగిలిన రోజుల్లో ప్రజలు కార్యాలయం చుట్టూ తిరిగినా పనులు జరగడం లేదని చెబుతున్నారు. అధికారులు లేరనే సమాధానంతో నిరాశగా వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొన్నట్లు వారు వాపోతున్నారు. ప్రస్తుతం ఇంటర్, డిగ్రీ,



ప్రొఫెషనల్ కోర్సుల ప్రవేశాలు, స్కాలర్‌షిప్ దరఖాస్తులు, వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం అవసరమైన ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రోజూ కార్యాలయానికి వస్తున్నారు. అయితే ఒక సంతకం కోసం రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, దీనివల్ల ప్రవేశాల ప్రక్రియ ఆలస్యమవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇక రైతుల పరిస్థితి కూడా భిన్నంగా లేదని స్థానికులు చెబుతున్నారు. పట్టాదారు పాస్‌బుక్కులు, భూ రికార్డులు, వారసత్వ మార్పులు, రెవెన్యూ ధ్రువీకరణలు తదితర పనుల కోసం వచ్చిన రైతులు పలుమార్లు కార్యాలయం చుట్టూ తిరిగి నిరాశతో వెనుదిరుగుతున్నారని పేర్కొంటున్నారు. కార్యాలయ సమయపాలనపై కూడా ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిర్ణీత సమయానికి అధికారులు అందుబాటులో లేకపోవడం వల్ల గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని, రోజువారీ కూలీలు తమ పనులు వదిలి వచ్చినా ప్రయోజనం లేకుండా తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని చెబుతున్నారు. ప్రజలకు సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రభుత్వ కార్యాలయాల్లో ఇలాంటి పరిస్థితులు కొనసాగడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తహశీల్దార్ గైర్హాజరు అధికారిక విధుల కోసమా, అనుమతితో కూడిన సెలవుల వల్లనా, లేక ఇతర కారణాలా అనే విషయంపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. ప్రజలకు సమయానికి సేవలు అందేలా జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తహశీల్దార్ కార్యాలయ పనితీరుపై సమగ్ర విచారణ జరిపి, రెవెన్యూ సేవలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు నిరీక్షణకు కేంద్రాలుగా మారితే ప్రజా పాలన లక్ష్యం ఎలా నెరవేరుతుందనే ప్రశ్నలు ఇప్పుడు తొండూరు మండలంలో వినిపిస్తున్నాయి.

# మావిగన్‌తో వైసీపీ బంగాళాఖాతంలో కలవడం ఖాయం

## - టిడిపి సీనియర్ నాయకుడు కొమరా వెంకట నరసయ్య ధ్వజం.. జగన్ ప్రకటనపై విమర్శలు



ప్రజాభూమి, ఒంటిమిట్ట: మావిగన్ (మచిలీపట్నం--విజయవాడ--గుంటూరు) విధానంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి వెళ్తే ఆ పార్టీ భవిష్యత్తు బంగాళాఖాతంలో కలవడం ఖాయమని రాజంపేట నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకుడు, మాజీ డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య అన్నారు. బుధవారం ఒంటిమిట్టలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2029 ఎన్నికల్లో మూడు రాజధానుల అంశాన్ని మేనిఫెస్టోగా తీసుకెళ్తామని జగన్ ప్రకటించడం ఆయన అనుభవ రాహిత్యానికి నిదర్శనమన్నారు. అమరావతి కేంద్రంగా రాజధాని పనులు వేగంగా సాగుతున్నాయని, అభివృద్ధిని అడ్డుకునేందుకు వైసీపీ తప్పుడు ప్రచారాలు చేస్తోందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వస్తున్నాయని, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని తెలిపారు. ప్రజలు జగన్ విధానాలను తిరస్కరిస్తున్నారని, ఇకనైనా వైసీపీ తన వైఖరిని మార్చుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో మండల టిడిపి సీనియర్ నాయకులు మామిళ్ల ఈశ్వరయ్య, మాజీ మండల అధ్యక్షుడు పామూరు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమ పథకాల అమలు

## - పింఛన్లు పంపిణీ
## - టిడిపి మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక పట్టణంలోని గాజులపేట, రెడ్డయ్య కాలనీ, ప్రియా తోటలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా పసుపులేటి వీరభద్ర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రతి నెల ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రూ.3 వేలుగా ఉన్న పింఛన్‌ను రూ.4 వేలకు పెంచి అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని తెలిపారు. ప్రతి లబ్ధిదారుడికి అందుతున్న పింఛన్ చంద్రన్న సంక్షేమానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తుందని తెలిపారు.

# 20 సూత్రాలతో జీవన ప్రమాణాలు మెరుగు

## - తులసిరెడ్డిని ఘనంగా సత్కరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు




ప్రజాభూమి, వేంపల్లె

దారిద్య నిర్మూలన, సామాన్య మానవుని జీవన ప్రమాణాల పెంపు అనే ద్విముఖ లక్ష్యాలతో 1975 జులై 1న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమాన్ని ప్రారంభించారని, చాలా మేరకు దారిద్యం నిర్మూలించబడి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడ్డాయని ఏపిసిసి మీడియా ఛైర్మన్ డా.తులసిరెడ్డి అన్నారు. బుధవారం 20వ సూత్రాల ఆర్థిక కార్యక్రమ దినోత్సవం సందర్భంగా డా.తులసిరెడ్డి ని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. 20 సూత్రాల ఛైర్మన్ గా తులసిరెడ్డి ఉన్నపుడు వరుసగా మూడేళ్ల పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జాతీయ స్థాయి ప్రథమ స్థానంలో నిలిచింది. 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం దేశానికి, రాష్ట్రానికి ఎంతో అవసరమని, దీనిని సమర్థవంతంగా అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగం రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, పులివెందుల అసెంబ్లీ ఇంచార్జీ దృవకుమార్ రెడ్డి, సీనియర్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, బద్రీనాథ్, నాని తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యక్రమాల అణిచివేతకు ప్రజలు సహకరించాలి

## ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పటికి అందుబాటులో ఉంటా -పులివెందుల అర్బన్ సీఐ శ్రీరామ్



ప్రజాభూమి,పులివెందుల

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తానని, అసాంఘిక కార్యక్రమాల అణిచివేతలో ప్రజలు తమ వంతు సహకారాలు అందించాలని, సమస్యల పరిష్కారానికి ప్రజల ఎప్పటికీ అందుబా టులో ఉంటా, పులివెందుల అర్బన్ సిఐ శ్రీరామ్ అన్నారు. బుధవారం పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్ లో వివిధ సమస్యల పై ఆయనను ప్రజలు కలిసి వారి సమస్యలను ఆయనకు విన్నవించారు. ఈ సందర్భంగా ప్రజలకు భరోసా కల్పిస్తూ న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు ముందు ఉండడం జరుగుతుందన్నారు.ఈ సంద ర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రజల హక్కుల పరిరక్ష ణ పోలీసుల బాధ్యత అని ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఆయన అన్నారు. అదేవిధంగా అసాంఘిక కార్యక్రమాలను అణిచివేయడానికి బాధ్యత గల పౌరులు ప్రజలు పోలీసులకు సకరించాలన్నారు. ఏవైనా అవాంఛ నీయ సంఘటనలు జరుగుతూ ఉంటే వెంటనే సమాచారాన్ని పోలీసులు అందజేయాలన్నారు. అలా అందజేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

# పురపాలక సమస్యలపై తూగుట్ల మధు ప్రత్యేక దృష్టి

## సీయోను పురంలో కరెంటు సమస్యకు 24 గంటల్లో పరిష్కారం చేసిన మధు



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పట్టణంలోని స్థానిక సీయోను పురం ఫైర్ స్టేషన్ ఎదురుగా ఉన్న కాలనీలో దాదాపు గత 50 సంవత్సరాలుగా ఎక్కడో దూరంగా ఉన్న విద్యుత్ స్తంభాల ద్వారా విద్యుత్ సర్వీస్ తీసుకొని గాలివాన వచ్చినప్పుడల్లా విద్యుత్తు వైర్లు తెగిపోవడంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సుమారు 50 కుటుంబాల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. కాలనీవాసులు తమ సమస్యను టీడీపీ నేత, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల మధుసూదన్ రెడ్డి దృష్టికి తీసుక వెళ్లడంతో ఆయన వెంటనే విద్యుత్ అధికారులతో మాట్లాడి మెయిన్‌విద్యుత్ లైన్ వేయించి, స్వయంగా దగ్గరుండి పనులను పూర్తి చేయించి విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ, గత 50 ఏళ్లుగా తమ ప్రాంతంలో రోడ్లు, మంచినీటి సరఫరా, విద్యుత్ వంటి కనీస మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు. ఎన్నో ప్రభుత్వాలు మారినా, పలువురు నాయకు లు హామీలు ఇచ్చినా తమ సమస్యను ఎవరూ పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను మధుసూదన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన కేవలం 24 గంటల్లోనే విద్యుత్ సౌకర్యం కల్పించా రని, ఇందుకు కాలనీ ప్రజల తరఫున ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా మని పేర్కొన్నారు.

# వైద్యులను గౌరవించడం సమాజ బాధ్యత

## - ఏపిసిసి మీడియా ఛైర్మన్ డా.తులసిరెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె

సమాజానికి వైద్యులు అందిస్తున్న అమూల్యమైన సేవలను గుర్తించి గౌరవించడం సమాజ బాధ్యత అని ఏపిసిసి మీడియా ఛైర్మన్ డా.తులసిరెడ్డి అన్నారు. బుధవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా స్థానిక వైద్యుడు డా.ఎస్ఎఫ్ బాషా ని శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం తులసిరెడ్డి మాట్లాడుతూ గత 48 ఏళ్లుగా డా.ఎస్ఎఫ్ బాషా ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆ సూక్తిని నిజం చేసేవారే వైద్యులని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రఖ్యాత వైద్యుడు, భారతరత్న డా.బిసి రాయ్ జయంతి, వర్ధంతి రోజున జాతీయ వైద్యుల దినోత్సవంగా భారత ప్రభుత్వం ప్రకటించిందన్నారు. పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలతో పాటు పది వైద్య కళాశాలల్లో కోర్సులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తులసిరెడ్డి సతీమణి అలివేలమ్మ, కిసాన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, పులివెందుల నియోజకవర్గ సమన్వయకర్త దృవకుమార్ రెడ్డి, సీనియర్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, బద్రీనాథ్, నాని తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీకి నిలువెత్తు రూపం - ఎల్ఐసి ఏజెంట్ కల్లూరు రామాంజనేయరెడ్డి


## బాధితునికి బంగారు,వెండి,నగదు బ్యాగ్ అప్పగింత



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పట్టణానికి చెందిన ఎల్ఐసి ఏజెంట్ కల్లూరు రామాంజనేయరెడ్డి నిజాయితీకి నిలువెత్తు రూపం,పోగొట్టుకున్న బంగారు, నగదు బ్యాగును బాధితునికి అప్పజెప్పి దాతృత్వం చాటుకున్నాడు. పులివెందులకు చెందిన రామాంజనేయరెడ్డి తన సొంత పని నిమిత్తం కదిరికి వెళుతూ ఉండగా మార్గమధ్యంలో రోడ్డు మీద బ్యాగు పడిపోయి ఉండడం గమనించి ఆ బ్యాగును తెరచి చూడగా అందులో సుమారు 6 తులాల బంగారము, అరకిలో వెండి,రూ 30,000/- రూపాయల డబ్బు ఉండడంతో ఈ విషయం గమనించిన రామాంజ నేయ రెడ్డి నిజాయితీతో సోషల్ మీడియా ద్వారా తనకు బ్యాగు దొరికిందని అందులో విలువైన వస్తువులు ఉన్నాయని తెలియజేశారు. దీంతో నల్లమాడ మండలం పులగంపల్లె గ్రామానికి చెందిన షేక్ హైదరవల్లి రామాంజనేయ రెడ్డి ని కలిసి బ్యాగులో ఉన్న బంగారు వెండి నగదు గురించి తెలియజేశారు.రామాంజనేయ రెడ్డి వారి కుటుంబ సభ్యులు బాధితులకు బ్యాగు లో ఉన్నటువంటి బంగారు, వెండి,డబ్బులను అందజేశారు. ఈ సందర్భంగా హైదరవల్లి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ సమాజంలో ఎంతోమంది స్వార్థంతో కూడిన వ్యక్తులు ఉంటారని, రామాంజనేయరెడ్డి నిస్వార్థంతో లక్షలు విలువ చేసే బ్యాగును తమకు అందజేసి తమ దృష్టిలో దేవుడయ్యారన్నారు. అనంతరం రామాంజనేయరెడ్డికి దుశాల పూలమాలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. నిజాయితీ,దాతృత్వం గల రామాంజనే య రెడ్డి నేటి సమాజానికి స్ఫూర్తి దాత అని పలువురు కొనియాడారు.

# ఎస్ఐఆర్ సర్వేను నిర్ణీత గడువులోపు పూర్తి చేసేందుకు సహకరించాలి



ప్రజాభూమి,పులివెందుల

ఎస్ఐఆర్ సర్వేను నిర్ణీత గడువులోపు పూర్తి చేసేందుకు అంగన్వాడి కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలని తహశీల్దార్ నజీర్ అహమ్మద్, మున్సిపల్ కమిషనర్ ముని కుమార్ లు అంగన్వాడి కార్యకర్తలను కోరారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు వైయస్సార్ కడప జిల్లా వారి ఆదేశముల మేరకు తాసిల్దార్ నజీర్ అహమ్మద్,మున్సిపల్ కమిషనర్ ముని కుమార్‌లు ఎస్ఐఆర్ సర్వే కార్యక్రమంలో బి.ఎల్.ఓ లకు సపోర్టింగ్ స్టాఫ్ గా అంగన్వాడీ కార్యకర్తలను నియమిస్తూ వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఐఆర్ సర్వే 100 శాతం పూర్తి చేయాలంటే గతంలో బిఎల్వోలుగా పనిచేసిన అంగన్వాడీ కార్యకర్తలు సహకరించాలని వారన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు బిఎల్వోలు నిర్ణీత సమయంలో ఎస్ఐఆర్ సర్వేను బాధ్యతగా పూర్తి చేయాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ వెంకట్ రెడ్డి, ఆర్ఐ షేక్షావల్లి, రెవెన్యూ అధికారులు మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూ నివారణపై అవగాహన కార్యక్రమం



ప్రజాభూమి, సిద్దవటం: సిద్దవటం మండలం పొన్నవోలు కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కడపయపల్లె గ్రామంలో వైద్యురాలు పి. రంగలక్ష్మి ఆధ్వర్యంలో డెంగ్యూ వ్యతిరేక వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. డెంగ్యూ దోమలు మంచినీటిలో అభివృద్ధి చెందుతాయని, పగటిపూట మాత్రమే కుడతాయని తెలిపారు. జ్వరం, తీవ్రమైన తలనొప్పి, ఒళ్లునొప్పులు, కళ్ల వెనుక నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు మౌలాలి, శారదాదేవి, హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, ఆరోగ్య కార్యకర్త ఉమామహేశ్వరి, ఆశా కార్యకర్త ఆరోగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధవటంలో జోరుగా ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగింది. మండల పరిధిలోని 18 గ్రామ పంచాయతీల్లో లబ్ధిదారులకు పింఛన్లు అందజేసే కార్యక్రమాన్ని టీడీపీ, జనసేన కూటమి నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు సమన్వయంతో నిర్వహించారు. గ్రామాల్లోని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర అర్హులైన లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ నగదును అందజేశారు. అందులో భాగంగా బంగారు పేట గ్రామంలో గూండ్ల నాగేంద్ర బాబు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు, కూటమి కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పెన్నా నదిలో అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

## - ఎస్సై హారిక హెచ్చరిక



ప్రజాభూమి, సిద్ధవటం: అక్టోబర్ నెల వరకు నదుల నుంచి ఇసుక తరలింపుపై ఉన్న నిషేధాన్ని తప్పనిసరిగా పాటించాలని ఎస్సై హారిక తెలిపారు. సిద్ధవటం పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు పెన్నా పరివాహక ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు, అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిద్ధవటం మండలంలోని జ్యోతి, ఆకుల వీధి, గాండ్లపాలెం, వంతాటిపల్లి, ఎస్. రాజంపేట, లింగంపల్లి, మాచుపల్లి, కడపాయపల్లి, మూలపల్లి, సిద్ధవటం బ్రిడ్జి, జంగాలపల్లె, వెలుగుపల్లి తదితర ప్రాంతాల్లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. అనుమతులు ఉన్న ఇసుక డంపింగ్ ప్రాంతాల నుంచే ఇసుక తరలించుకోవాలని సూచించారు. రాత్రివేళ పెన్నా పరివాహక ప్రాంతాల్లో పోలీస్ బృందాలతో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# గడువులోగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలి

## - బీఎల్ఓలకు తహసీల్దార్ విజయ్ కుమార్ ఆదేశాలు




ప్రజాభూమి, సిద్ధవటం: ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని మండల తహసీల్దార్ విజయ్ కుమార్ బీఎల్ఓలను ఆదేశించారు. మండలంలోని గొల్లపల్లి, మంగ్లవారిపల్లె, మాచుపల్లి గ్రామాల్లో బుధవారం ఎస్ఐఆర్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి ఓటర్లకు ఎన్యుమరేషన్ పత్రాలు అందజేసి, వాటిని ఈ నెల 14వ తేదీలోపు ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. గల్ఫ్ దేశాలకు వెళ్లిన ఓటర్ల బంధువుల వివరాలను కూడా సేకరించాలని తెలిపారు. కొన్ని గ్రామాల్లో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీలో వెనుకబాటు ఉందని, పనితీరు మెరుగుపరుచుకోవాలని బీఎల్ఓలకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో బీఎల్ఓలు పాల్గొన్నారు.

# జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ను కలసిన పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి

ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల ప్రజల ఆకాంక్షల సాధనే లక్ష్యంగా అమరావతి సచివాలయంలో బుధవారం జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ను పులివెందుల టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ బీటెక్ రవి,తుంగభద్ర ప్రాజెక్టు హై లెవల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి , వెంపల్లె టీడీపీ ఇంచార్జ్ అజ్జుగుట్టు రఘునాథరెడ్డి , లింగాల మండలం ఇన్చార్జి దేవి రెడ్డి సంజీవరెడ్డి లు మర్యాదపూర్వ కంగా కలిశారు.ఈ సందర్భంగా పులివెందుల నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా సాగునీరు, తాగునీరు, జల వనరుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చి పులివెందు లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయనను కోరారు.వినతులను సానుకూలంగా స్వీకరించిన మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం ప్రాంతీయ అభివృద్ధికి కట్టుబడి ఉందని, పులివెందుల నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి అవసరమై న చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, స్థానిక ఎమ్మెల్యే నిర్లక్ష్యం చేసినా కూటమి ప్రభుత్వం పులివెందుల ప్రజలకు అన్ని విధాలా అండగా నిలుస్తుందని, నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని ఆయనతెలిపారు.



ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

గురువారం 02 జూలై 2026

# ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ పంపిణీ 100% పూర్తి చేయాలి..

## అధికారులతో కలిసి కూటమి మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయాలి..

## గంగిరెడ్డిపల్లిలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేసిన ఎమ్మెల్యే పులివర్తి నాని, డీసీసీబీ ఛైర్మన్ రాజశేఖర్ రెడ్డి..

ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రాపురం
తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం, రామచంద్రాపురం మండలం, గంగిరెడ్డిపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని కి, డీసీసీబీ ఛైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి కి కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు ఘన స్వాగతం పలికారు. నాయకులు శాలువాలతో సత్కరించి, భారీ గజమాలతో ఆత్మీయ స్వాగతం పలకగా.. నియోజకవర్గ యువత బాణాసంచా కాలుస్తూ, నినాదాలతో హోరెత్తించారు. గ్రామంలోని మహిళలు సాంప్రదాయబద్ధంగా మంగళ హారతులు ఇచ్చి, దిష్టి తీసి ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఒక్కరినీ పేరుపేరునా ఆప్యాయంగా పలకరిస్తూ పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు.





ఇంటివద్దకే పింఛన్.. లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం..

ప్రతీ నెల 1వ తేదీన క్రమం తప్పకుండా ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ చేస్తున్న కూటమి ప్రభుత్వం, ఈ నెల కూడా లబ్ధిదారులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా నేరుగా ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ల పంపిణీ చేపట్టింది. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వృద్ధాప్య, వితంతు, చేనేత, కల్లుగీత కార్మికులు, ఒంటరి మహిళలకు, మత్స్యకారులకు, హెచ్ఐవి వ్యాధి గ్రస్తులకు, చర్మకారులకు, హిజ్రాలకు మరియు డప్పు కళాకారులకు అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ ను ఇళ్ల వద్దకే స్వయంగా వెళ్లిన ఎమ్మెల్యే పులివర్తి నాని, డీసీసీబీ ఛైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డిలు వారికి పింఛన్ డబ్బులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు కూటమి ప్రభుత్వానికి, ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

ప్రజా సమస్యల తెలుసుకుంటూ.. ప్రగతి దిశగా అడుగులు

పింఛన్ల పంపిణీతో పాటు ఎమ్మెల్యే గారు లబ్ధిదారులతో, స్థానిక ప్రజలతో మమేకమై గ్రామంలోని పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు సామాజిక భద్రతకు ఒక బలమైన భరోసా కల్పిస్తాయని తెలిపారు. మండలంలో ఎక్కడా ఒక్కరు కూడా మిగిలిపోకుండా 100 శాతం పింఛను పంపిణీ పూర్తి చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. కూటమి మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు బాధ్యతాయుతంగా సచివాలయ ప్రభుత్వ ఉద్యోగులతో కలిసి ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులందరికీ పింఛన్లు అందేలా చూడాలని పిలుపునిచ్చారు. ఈ పింఛను పంపిణీ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో మహిళలు, స్థానికులు మరియు పింఛన్దారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ హాస్పిటల్ బాలింతలకు రోగిలకు నిరుపేదలకు పంపిణీ...






ప్రజా భూమి ప్రతినిధి గూడూరు.
నెల్లూరు జిల్లా గూడూరు పట్టణంలో కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 1-07-2026 గూడూరు ప్రభుత్వ హాస్పిటల్ ఈరోజు బాలింతలకు రోగిలకు బ్రెడ్ పండ్లు వాటర్ బాటిల్ బిస్కెట్లు మా ట్రస్ట్ సభ్యులు సొంత నిధులతో పంపిణీ.. ఈరోజు ముఖ్య అతిథిగా విచ్చేసిన గూడూరు ప్రభుత్వ హాస్పిటల్ నందు కంటి డాక్టర్ గా పని చేస్తూ పేద ప్రజలు అంటే ఎంతో ప్రాణంగా ప్రేమిస్తు పేద ప్రజలకు ఏదో ఒక సేవ చేయాలని తపనతో ఉన్న హెలిన్ వారి చేతులమీదుగా పంపిణీ.... హెలిన్ మాట్లాడుతూ:- ఈరోజు ఈ కార్యక్రమానికి రావడం నాకు చాలా సంతోషంగా ఉందని అలాగే కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న పలు సేవా కార్యక్రమాలను చాలా అభినందనీయమని వారు కి పేద ప్రజల పట్ల ఉన్న ప్రేమ, ఆప్యాయత ఆ ట్రస్ట్ ఎదుగుదలకి దోహదపడుతుందని ఈ ట్రస్టు పది కాలాలు పాటు ఉండాలని అలాగే రాబోయే రోజుల్లో కూడా ఈ కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నా వంతుగా నేను సహాయం అందిస్తానని అన్నారు.. ట్రస్ట్ అధ్యక్షులు కటకం శ్రీనివాసులు మాట్లాడుతూ:- ఈరోజు ప్రభుత్వ హాస్పిటల్ నందు బాలింతలకు రోగిలకు నిరుపేదలకు బ్రెడ్ పండ్లు వాటర్ బాటిల్ బిస్కెట్స్ పంపిణీ చేయడం మా అందరికి కూడా చాలా సంతోషంగా ఉంది ఇంకా ఎవరైనా కూడా మాకు చేయూత అందిస్తే ఇంకా ఇలాంటి కార్యక్రమాలు చేస్తాము..ఈ కార్యక్రమంలో కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కటకం శ్రీనివాసులు,ఉపాధ్యక్షుడు అత్తి మంజరి గోపాల్, పర్వతాల రమేష్, పేయ్యల రమణయ్య, కోడి శివ, బాసిత్, హాస్పిటల్స్ సిబ్బంది సాయి పాల్గొన్నారు...

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్, అర్హులకు భద్రత.. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.
తిరుపతి జిల్లా రేణిగుంట మండలం ఎలమండ్యం పంచాయతీ పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో బుధవారం ఉదయం ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లను శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి , ఇంటింటికి వెళ్లి, వికలాంగులకు, వయోవృద్ధులకు, వితంతువులకు,లబ్ధిదారులకు, పెన్షన్అందజేశారు. ప్రతినెలా ఒకటో తేదీ పెన్షన్లు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు ఆయనతో మాట్లాడుతూ పెన్షన్లను కరెక్ట్ గా పంపిణీ చేస్తున్నారని, ఈ పెన్షన్లు మాకు ఆర్థికంగా భరోసా ఇస్తుందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పెంచిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లను అర్హులైన పేదలకు మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, సీనియర్ నాయకులు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, సింగల్ విండో భాస్కర్ రెడ్డి, ఈవో సుజాత, బాలరాజు, శేఖర్, సుబ్బు, సాంబయ్య, వీరేంద్ర, సచివాలయం సిబ్బంది, టిడిపి కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పంచాయితీల అభివృద్ధి ఒక్క కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం - ఎమ్మెల్యే పులివర్తి నాని

### గ్రామాల అభివృద్ధితోనే.. రాష్ట్ర అభివృద్ధి సుగమం





ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం
రామచంద్రాపురం మండలం మండల పరిషత్ కార్యాలయంలో స్వర్ణ ఆంధ్రా -- స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమం నిర్వహించిన ఎమ్మెల్యే పులివర్తి నాని డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాలకు 12 ట్రై సైకిళ్లను, తడి,పొడి చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే స్వయంగా ట్రై సైకిళ్లను తొక్కి.. పంచాయతీ ప్రతినిధులకు పంపిణీ చేశారు. పంచాయతీలలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు ట్రై సైకిళ్లు ఉపయోగపడతాయని తెలిపారు. స్వచ్ఛ ఆంధ్రా లక్ష్యాలను ప్రతి గ్రామంలో విజయవంతంగా అమలు చేయాలని అధికారులకు, కూటమి నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ నాయకులు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## చంద్రగిరి లో 'డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలు' ప్రారంభం..!




ప్రజా భూమిప్రతినిధి,చంద్రగిరి:
చంద్రగిరి మండల పరిధిలోని కొలొకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల జూలై 1 నుండి 31వ తేదీ వరకు ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజలకు అవగాహన నిర్వహణ భాగంగా బుధవారం చంద్రగిరిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం పి.హెచ్.సి వైద్యాధికారి డాక్టర్ శిరీష పర్యవేక్షణలో జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి డా. శిరీష మాట్లాడుతూ, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని జూలై నెల అంతా డెంగ్యూ నివారణపై గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డెంగ్యూ నివారణకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలలో చెక్, క్లీన్, కవర్,అనే మూడు సూత్రాలను పాటించాలని పిలుపునిచ్చారు.ఇళ్లలో మరియు చుట్టుపక్కల ఉన్న కూలర్లు, పూల కుండీలు, పాత టైర్లు, డ్రమ్ములు, కొబ్బరి బోండాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.నీటి నిల్వ పాత్రలను వారానికి ఒకసారి ఖాళీ చేసి, బాగా రుద్ది తోమి, ఎండబెట్టి మళ్లీ వాడుకోవాలి. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలి. దోమ లార్వాలు పెరగకుండా నీటి డ్రమ్ములు, ట్యాంకులపై గట్టిగా మూతలు ఉంచాలి. సమాజ భాగస్వామ్యంతోనే డెంగ్యూ రహిత గ్రామాలు మరియు పట్టణాల నిర్మాణం సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు. అధిక జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, వాంతులు, వంటిపై ఎర్రటి మచ్చలు వంటి డెంగ్యూ లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని కోరారు.ఈ అవగాహన ర్యాలీ మరియు లార్వా గుర్తింపు కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ శివయ్య , ఎం.పి.హెచ్.ఇ.ఓశివరాజు, హెల్త్ సూపర్వైజర్లు వాసుదేవ రెడ్డి, దాక్షాయణి, ఎం.ఎల్.హెచ్.పి సమంతి, మరియు ఆశా కార్యకర్తలు సావిత్రి, శశికళ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నదాతకు అండగా కూటమి ప్రభుత్వం

- రైతన్నల పక్షపాతి ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు
- ఉనికి కోసమే వైకాపా నిరసనల పేరుతో డ్రామాలాడుతోంది
- వైసిపి నేతల ఆరోపణలను ఖండించిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

ప్రజాభూమి ప్రతినిధి చిత్తూరు
మామిడి రైతుల కష్టాన్ని గుర్తించి, ముందు చూపుతో నాలుగు రూపాయల సబ్సిడీని ప్రకటించి, అన్నదాతకు అండగా నిలిచిన ఏకైక ప్రభుత్వం కూటమి సర్కార్ అని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు కొనియాడారు. రైతన్నల పక్షపాతిగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరోసారి నిరూపించారని, సీఎం చిత్తశుద్ధికి ఇది నిదర్శనమంటూ ప్రశంసించారాయన. ఉనికి కోసమే వైకాపా నిరసనల పేరుతో డ్రామాలాడుతోందని విమర్శించారు. మామిడి రైతులకు మద్దతుగా పూతలపట్టు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చేపట్టిన నిరసనలను మీడియా ద్వారా తెలుసుకున్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు..,బుధవారం ఢిల్లీ నుంచి ఓ ప్రకటనలో స్పందించారు. కూటమి ప్రభుత్వ పాలనను చూసి ఓర్వలేకనే.., వైసిపి నేతలు నిరసనల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఈరకమైన కార్యక్రమాలకు తెరలేపారని తప్పు బట్టారు.అలాగే వైకాపా నేతలు కూటమి ప్రభుత్వం పై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రైతన్నల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అన్నదాతలకు అన్ని విధాలా అండగా నిలుస్తోందన్నారు. 'అన్నదాత సుఖీభవ', పీఎం కిసాన్ పథకాల ద్వారా రైతులకు ఆర్థిక భరోసాతో పాటుగా, ధాన్యం కొనుగోలులోనూ పారదర్శక విధానాలను అమలు చేస్తోందని పేర్కొన్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు..,అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి ఏటా రైతులకు రూ. 20,000 ఆర్థిక సహాయం అందించే లక్ష్యంతో.. నగదును రైతుల ఖాతాల్లోకి జమ చేసి ఆర్థిక భరోసానిచ్చిందని చెప్పారు. ఆకస్మిక ప్రకృతి వైపరీత్యాలు లేదా పంట నష్టాలు ఎదురైనప్పుడు, మామిడి వంటి వాణిజ్య పంటలు సాగు చేసే రైతులకు సైతం కిలోకు నిర్దిష్ట నష్టపరిహారాన్ని అందించి ఆదుకుందని ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 17.97 లక్షల మందికి పైగా రైతుల నుండి దాదాపు 1.29 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించిందన్నారు. రైతులకు రూ.30,361 కోట్లకు పైగా చెల్లింపులు జరిగాయని చెప్పిన ఎంపీ దగ్గుమళ్ళ.., ఇందులో 94 శాతం చెల్లింపులు కేవలం 24 గంటల వ్యవధిలోనే నేరుగా రైతుల ఖాతాల్లోకి జమచేయడం ఏపీ సీఎం చంద్రబాబు పరిపాలన అధ్యక్షతకు నిదర్శనం అన్నారు. కొత్త సాగుకు శ్రీకారం చుట్టే పవిత్రమైన ఏరువాక పున్నమి సందర్భంగా, రైతులకు మెరుగైన ప్రణాళికలు, రాయితీలు అందిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించడం రైతన్నల సంక్షేమం పట్ల ఆయనకున్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగం, భూసార పరీక్షా పత్రాల జారీ , పొలం పిలుస్తోంది వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మారుస్తోందని తెలియజేశారు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు. అన్నదాతల అభ్యున్నతి కోసం ఇన్ని రకాల మంచి పనులు చేస్తున్న కూటమి ప్రభుత్వం పై వైసీపీ నాయకులు విమర్శలు చేయడం తగదని హితవు పలికారు. పనిచేసే ప్రభుత్వం పై ఆరోపణలు చేయడం మాని సహకరించాలని ఆయన కోరారు.



# అవిలాలలో భూ వివాదం.. బాధిత వృద్ధ దంపతులకు ప్రతిపక్షాల అండ

## తిరుపతి రూరల్ మండలం అవిలాల 476, 479 సర్వే నంబరులోని భూమి వివాదం ఉద్రిక్తత






ప్రజా భూమి ప్రతినిధి, తిరుపతి రూరల్
తిరుపతి రూరల్ మండలం అవిలాల 476 479 సర్వే నెంబర్లలోని భూ వివాదం రోజురోజుకీ ఉద్రిత్త కు దారితీస్తుంది. వృద్ధ దంపతులు వనజా, ద్వారకానాథ్రెడ్డి తమ భూమి ఆక్రమణకు గురైందని ఆరోపిస్తూ నిరసన చేపట్టారు. వారికి మద్దతుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ఇన్చార్జ్ భూమన కరుణాకర్రెడ్డి మాట్లాడుతూ, న్యాయం బాధితుల పక్షాన ఉంటే చివరి వరకు అండగా నిలుస్తామని చెప్పారు. వృద్ధ దంపతులు కష్టపడి కొనుగోలు చేసిన భూమి వారికి తిరిగి దక్కే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్రెడ్డి మాట్లాడుతూ, చంద్రగిరిలో భూ కబ్జాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కోర్టు పరిధిలో ఉన్న భూమిలో రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 22-ఏ జాబితా నుంచి తొలగించిన వెంటనే రిజిస్ట్రేషన్లు జరగడం, కాలువ పోరంబోకు భూములకు కూడా రిజిస్ట్రేషన్లు జరిగాయన్న అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. ఎమ్మెల్యే నాని వృద్ధ దంపతులను పోలీస్ స్టేషన్ లో పెట్టిస్తానని బెదిరించడం దుర్మార్గమన్నారు. తమ కుటుంబంపై ఆయన మాట్లాడిన నీచమైన భాషకు సమాధానం చెప్పే రోజుఒకటి వస్తుందని హెచ్చరించారు. "వృద్ధ దంపతులకు న్యాయం జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుంది" అని నేతలు స్పష్టం చేశారు.

# ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

## సచివాలయం సిబ్బంది పింఛన్లు క్రమం తప్పకుండా ప్రతి నెల లబ్ధిదారుల ఇంటి వద్దనే పంపిణీ చేయాలి-: జిల్లా కలెక్టర్





ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి,
రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం లక్ష్యంగా...ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లను అర్హులైన లబ్ధిదారులకు ఉదయాన్నే సచివాలయం సిబ్బంది ద్వారా వారి ఇంటి వద్దకు వెళ్ళి క్రమం తప్పకుండా పింఛన్లను పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం ఉదయం తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లి గ్రామ పంచాయతీ నందు ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని తనిఖీ చేసి పలువురు లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్ లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ జిల్లాలో సచివాలయ సిబ్బంది ఉదయాన్నే లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేయాలని తెలిపారు. జిల్లాలో మార్చి నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల ను 2,61,738 మంది ఫించన్ దారులకు సుమారు 113.35 కోట్ల రూపాయలు పంపిణీ చేస్తున్నామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఇంటింటికి వెళ్లి పెన్షన్ లను అందజేస్తూ పెన్షన్లు అందిస్తున్న తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతినెల ఒకటవ తేదీన మీ ఇంటి వద్ద కు వచ్చి పెన్షన్ల పంపిణీ చేస్తున్నారా అని లబ్ధిదారులను అడిగారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఉదయాన్నే తమ ఇంటి వద్దకు వచ్చి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లను పంపిణీ చేస్తున్నారని ఫించన్లు తమకు ఆర్థికంగా భరోసా ఉందని కలెక్టర్ కు తెలిపారు.

**తిరువతి రూరల్ మండలం చెర్లోపల్లి గ్రామ వంచాయితీ**

వృద్ధాప్య పెన్షన్ కింద రూ.4000, వితంతు పెన్షన్ కింద రూ.4000 ను లబ్ధిదారుల ఇంటికి వెళ్లి జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి అందచేశారు. దేశంలో ఎక్కడా లేనంతగా పెంచిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను పేదలకు మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి అందిస్తున్నారని కలెక్టర్ లబ్ధిదారులకు వివరించారు. అనంతరం పెన్షన్ దారులతో మాట్లాడతూ వారి ఆరోగ్య సమస్యలు, ఇతర సమస్య లపై అడిగి తెలుసుకున్నారు. మీ ప్రాంతంలో ఏమైనా సమస్యలు ఉంటే సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకెళ్తే సంబందిత సమస్యలను సచివాలయ సిబ్బంది పరిష్కరిస్తారన్నారు. అలాగే మెడికల్ క్యాంపులు నిర్వహించినపుడు వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మస్తాన్ వలి, పంచాయతీ సెక్రటరీ సచివాలయం సిబ్బంది తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న తుడా చైర్మన్ డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి, తిరుపతి
కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో తుడా చైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా॥ డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి , కూటమి నాయకులు తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా లబ్ధిదారులకు పెన్షన్ అందజేసి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు,వితంతువులు, దివ్యాంగులు,అర్హులైన వారికి ఆర్థిక భరోసా కల్పించడం కోసంఎన్టీఆర్ భరోసా పథకం అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రతి నెలా ఇంటి వద్దకే పెన్షన్ అందించే విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం మరియు అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా లక్షలాది మంది లబ్ధిదారులకు ఆర్థిక భద్రత కల్పించబడుతోందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, సచివాలయం సిబ్బంది,లబ్ధిదారులు పాల్గొన్నారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్-2026) కార్యక్రమంలో ప్రతి ఓటరు భాగస్వామ్యం కావాలి

- పారదర్శకంగా, కచ్చితత్వంతో ఓటర్ల జాబితాను రూపొందించాలి
- ఇంటింటి సర్వేలో ప్రజలకు అవగాహన కల్పించిన జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి,

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)–2026 కార్యక్రమం జూన్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైందని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పారదర్శకంగా, తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించడం లక్ష్యమని పేర్కొన్నారు. బుధవారం ఉదయం తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లి గ్రామంలో ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జూన్ 15 నుంచి జూలై 14 వరకు బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు) ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను అందజేస్తారని తెలిపారు. ఓటర్లు ఫారాలను పూర్తిగా నింపి బీఎల్ఓలకు నేరుగా గానీ, బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏలు) ద్వారా గానీ అందజేయవచ్చని, ఇంటర్నెట్‌పై అవగాహన ఉన్నవారు స్వయంగా ఆన్‌లైన్‌లో కూడా సమర్పించవచ్చని తెలిపారు. ఈ మూడు





విధానాల్లో ఏదో ఒక రూపంలో సమర్పించిన వారి పేర్లు నమూనా ఓటర్ల జాబితాలో చేర్చబడతాయన్నారు. ప్రభుత్వం సూచించిన 12 రకాల గుర్తింపు పత్రాలలో ఏదైనా ఒకటి సమర్పిస్తే వాటిని పరిశీలించి అర్హులైన వారి పేర్లను తుది ఓటర్ల జాబితాలో చేర్చడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా పేర్లు లేకపోవడం లేదా ఇతర అభ్యంతరాలు ఉన్నట్లయితే సంబంధిత వారికి నోటీసులు జారీ చేసి పూర్తి వివరాలు సేకరించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. చివరిసారిగా 2002లో రాష్ట్రంలో ప్రత్యేక విస్తృత పరిశీలన నిర్వహించబడిందని, అప్పటి ఓటర్ల వివరాలను ప్రస్తుత ఓటర్ల వివరాలతో అనుసంధానం చేయడం జరుగుతోందని తెలిపారు. అప్పటి పోలింగ్ కేంద్రం లేదా ఎపిక్ నంబర్ వివరాలు అందుబాటులో ఉంటే వాటి ఆధారంగా ప్రస్తుత ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిపోయిన వారు, ద్వంద్వ ఓటు నమోదులు కలిగిన వారు వంటి అనర్హుల పేర్లను తొలగించి ఓటర్ల జాబితాను శుద్ధి చేస్తున్నామని తెలిపారు. అలాగే 18 సంవత్సరాలు నిండిన కొత్త ఓటర్లను గుర్తించి నమోదు చేయడంతో పాటు, వివాహం లేదా ఇతర కారణాల వల్ల నివాసం మారిన వారికి ఓటును కొత్త ప్రాంతానికి బదిలీ చేసే అవకాశం కల్పిస్తున్నామని వివరించారు.ప్రతి వ్యక్తికి ఒకే చోట ఓటు ఉండాలని, ఉద్దేశపూర్వకంగా రెండు చోట్ల ఓటు నమోదు చేసుకోవడం చట్టరీత్యా నేరమని, అలాంటి సందర్భాల్లో క్రిమినల్ కేసులు నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల భాగస్వామ్యంతో ఇంటింటి సర్వే జరుగుతోందని తెలిపారు. ఓటర్లు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, సందేహాలుంటే సంబంధిత బీఎల్ఓ, ఏఈఆర్ఓ (తహసీల్దార్), ఈఆర్ఓ (ఆర్డీఓ), జిల్లా ఎన్నికల అధికారి అయిన జిల్లా కలెక్టర్‌ను సంప్రదించవచ్చని సూచించారు. అదేవిధంగా నేషనల్ ఓటర్స్ సర్వీస్ పోర్టల్ మరియు ఎన్నికల హెల్ప్‌లైన్ సేవలను కూడా వినియోగించుకోవచ్చని తెలిపారు. సెప్టెంబర్ నాటికి ఈ మొత్తం ప్రక్రియ పూర్తవుతుందని, జిల్లా యంత్రాంగం సమన్వయంతో కచ్చితమైన, నమ్మకమైన మరియు సమగ్ర ఓటర్ల జాబితాను రూపొందించేందుకు అన్ని చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు, బీఎల్ఏలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్స్ డే సందర్భంగా శ్రీ గోవిందరాజ స్వామి ఆర్ట్స్ కళాశాలలో రక్తదాన శిబిరం

# రక్తదానం మహాదానం.. యువత ముందుకు రావాలని పిలుపు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ గోవిందరాజ స్వామి ఆర్ట్స్ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు. సమాజంలో స్వచ్ఛంద రక్తదానంపై అవగాహన పెంపొందించడం, అవసరమైన సమయంలో రక్తం అందుబాటులో ఉండేలా చేయడం లక్ష్యంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వ్యాపారవేత్త డాక్టర్ పొన్న చంగల్ రాయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తిరుపతి శాఖ అధ్యక్షులు డాక్టర్ ఎ.ఆర్. రెడ్డి, ఐఎంఏ కోశాధికారి డాక్టర్ పి. రెడ్డప్ప, శ్రీ గోవిందరాజ స్వామి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్,






గోవిందరాజ స్వామి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు, వైద్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, "రక్తదానం మహాదానం" అని, ఒక వ్యక్తి చేసిన రక్తదానం పలువురికి ప్రాణదానంగా మారుతుందని పేర్కొన్నారు. ప్రతి ఆరోగ్యవంతుడూ క్రమం తప్పకుండా స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని, దీనివల్ల రక్తదాత ఆరోగ్యానికి ఎలాంటి హాని ఉండదని, అత్యవసర పరిస్థితుల్లో అనేక మంది ప్రాణాలను కాపాడేందుకు రక్త నిల్వలు ఎంతో అవసరమని వివరించారు. డాక్టర్స్ డే సందర్భంగా వైద్యుల సేవలను గుర్తుచేసుకుంటూనే, ప్రజల్లో సేవా భావాన్ని పెంపొందించేలా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని అతిథులు పేర్కొన్నారు. సమాజానికి సేవ చేయాలనే సంకల్పంతో యువత పెద్ద సంఖ్యలో ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. శిబిరంలో పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేయగా, నిర్వాహకులు రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన వైద్యులు, నిర్వాహకులు, వాలంటీర్లు, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎస్వీయూలో నకిలీ చలాన్ల వ్యవహారం.. నత్తనడకన సాగుతున్న విచారణపై విమర్శలు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

ప్రతిష్ఠాత్మకమైన శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో వెలుగులోకి వచ్చిన నకిలీ బ్యాంకు చలాన్ల వ్యవహారం నెలరోజులు గడిచినా విచారణ ముందుకు సాగకపోవడంపై విద్యార్థి సంఘాలు, ఉద్యోగులు, మేధావుల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. కోట్ల రూపాయల మేర అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ ఇప్పటివరకు సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం ప్రకారం, గత రెండేళ్లుగా విశ్వవిద్యాలయం పరీక్షల విభాగంలో నకిలీ బ్యాంకు చలాన్లను ఉపయోగించి డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ మార్కుల మెమోలు, డిగ్రీ సర్టిఫికెట్లు, కాన్వొకేషన్ దరఖాస్తులు తదితర సేవల కోసం విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసి, యూనివర్సిటీ ఖాతాలో జమ చేయకుండా నకిలీ చలాన్లను జతచేసి దరఖాస్తులు సమర్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారం వల్ల విశ్వవిద్యాలయానికి రెండు నుంచి మూడు కోట్ల రూపాయల వరకు నష్టం వాటిల్లి ఉండవచ్చని ఉద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకులు చర్చించుకుంటున్నారు. ఈ కేసులో శంకర్ అనే తాత్కాలిక ఉద్యోగి ప్రధాన పాత్ర పోషించినట్లు ఆరోపణలు ఉన్నాయి. పరీక్షల విభాగంలోని కొందరు అధికారులు, ఉద్యోగులతో కలిసి ఈ వ్యవహారాన్ని నిర్వహించినట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఇటీవల కాన్వొకేషన్ దరఖాస్తుల సమయంలో పెద్దఎత్తున నకిలీ చలాన్లు సమర్పించడంతో అనుమానాలు వ్యక్తమై, విశ్వవిద్యాలయ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు






తెలుస్తోంది. పోలీసుల ప్రాథమిక విచారణలో పలువురు శాశ్వత ఉద్యోగులు, టైమ్‌స్కేల్ ఉద్యోగులు, ఎన్ఎంఆర్ ఉద్యోగుల పేర్లు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. శంకర్ ఇచ్చిన లిఖితపూర్వక వాంగ్మూలంలో పలువురి పేర్లను పేర్కొన్నట్లు ప్రచారం జరుగుతున్నప్పటికీ, దీనిపై అధికారిక ధృవీకరణ మాత్రం వెలువడలేదు. అంతేకాకుండా, రీవాల్యుయేషన్ విభాగంలో కూడా అక్రమాలు జరిగాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది విద్యార్థుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు తీసుకుని రీవాల్యుయేషన్ ఫలితాలను ప్రభావితం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. నకిలీ చలాన్ల ద్వారా కూడా అక్రమంగా సొమ్ము చేసుకున్నారనే ప్రచారం విశ్వవిద్యాలయంలో జరుగుతోంది. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి నిర్ధారణ జరగలేదు. కోట్ల రూపాయల అక్రమాలపై కేసు నమోదైనప్పటికీ, విచారణ నత్తనడకన సాగుతోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు లేకపోవడం, పోలీసుల దర్యాప్తులో జాప్యం చోటుచేసుకోవడంపై విద్యార్థి సంఘాలు, మేధావులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో నిజానిజాలను త్వరితగతిన వెలికితీసి, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై సమగ్ర విచారణ నిర్వహించి, దోషులు ఎవరైనా తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు, ఉద్యోగులు, మేధావులు విశ్వవిద్యాలయ యాజమాన్యాన్ని, పోలీసు అధికారులను కోరుతున్నారు.

# గూడూరును తిరిగి నెల్లూరు జిల్లాలో కలిపిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

### గూడూరు నియోజకవర్గ అభివృద్ధికి సీఎం చంద్రబాబు హయాంలోనే బలమైన పునాది - శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

పున్నపువారిపాలెంలో నిర్వహించిన "పేదల సేవలో ప్రజా వేదిక" కార్యక్రమంలో గూడూరు ఎమ్మెల్యే శ్రీ పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ, గూడూరు నియోజకవర్గ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన గూడూరును తిరిగి నెల్లూరు జిల్లాలో విలీనం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం గూడూరును తిరుపతి జిల్లాలో చేర్చగా, ప్రజల మనోభావాలను గౌరవించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గూడూరును తిరిగి నెల్లూరు జిల్లాలో కలిపారని పేర్కొన్నారు. పున్నపువారిపాలెం రహదారిని ఉపాధి హామీ పథకం ద్వారా రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే రహదారి నిర్మాణానికి అవసరమైన అటవీ శాఖ అనుమతులు మంజూరు చేయడంలో ప్రత్యేక చొరవ చూపిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారికి కృతజ్ఞతలు తెలియజేశారు. పున్నపువారిపాలెం ప్రాంతంలో పరిశ్రమలు అధికంగా ఉన్నాయని, రహదారి నిర్మాణం అనంతరం



భూముల విలువలు గణనీయంగా పెరిగాయని పేర్కొన్నారు. గూడూరు నియోజకవర్గంలో జరిగిన ప్రధాన అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం చంద్రబాబునాయుడు హయాంలోనే బలమైన పునాది పడిందన్నారు. మిగిలిన రహదారుల నిర్మాణం, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో రోడ్లు, డ్రెయినేజీల అభివృద్ధి, గూడూరు ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి చేయడం, చిట్టమూరు ప్రాంత తాగునీటి సమస్య పరిష్కారం తదితర అంశాలపై ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తామని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తెలిపారు.

# గ్రామీణ ప్రాంత వాసులకు వైద్య సేవలు అందించడమే వైద్యుల లక్ష్యం

ప్రజాభూమి ప్రతినిధి వాకాడు.

జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ వైద్యులకు ఘన సన్మానం. తీర ప్రాంత గ్రామాలలో, గ్రామీణ ప్రాంత వాసులకు సకాలంలో మెరుగైన వైద్యం అందించడమే ధ్యేయంగా ప్రభుత్వ వైద్యులు పనిచేయాలని ఎం.వి.రావు. ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ అన్నారు. నేషనల్ డాక్టర్స్ డే సందర్భంగా తిరుపతి జిల్లా వాకాడు మండలం బాలిరెడ్డి పాలెం పిహెచ్సి పరిధిలోని ప్రభుత్వ వైద్యులకు నెల్లూరు జిల్లా కోట మండలం చెందోడు గ్రామానికి చెందిన ఎం.వి. రావు ఫౌండేషన్ సౌజన్యంతో ప్రభుత్వ వైద్యులను ఘనంగా సన్మానించింది. వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులను గుర్తించి వారిని ప్రోత్సహించే నిమిత్తం తమ ఫౌండేషన్ నిరంతరం సేవా తత్పరులను, వృత్తిని



అంకితభావంతో పనిచేస్తూ పేదలకు న్యాయం చేసే వారిని సన్మానించడమే తమ లక్ష్యమని లీలామోహన్ కృష్ణ అన్నారు. వాకాడు మండలం బాలిరెడ్డి పాలెం పి హెచ్ సి ప్రభుత్వ వైద్యశాలలో పని చేస్తున్న డాక్టర్ కమల, డెంటల్ సర్జన్ డాక్టర్ పుష్పలత లను ఎం వి రావు ఫౌండేషన్ నిర్వాహకులు సాలువ, మెడల్, షీల్డులతో, తలపాగా ధరింపజేసి వారి ఇరువురిని డాక్టర్స్ డే సందర్భంగా ఘనంగా సన్మానించారు. తీర ప్రాంత గ్రామాలలో వైద్య సేవలు అందించడం పరమావిధిగా భావించి ప్రతిరోజు వారి విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ పేదలకు సకాలంలో వైద్యం అందిస్తున్న వీరికి అభినందన సత్కారం చేశారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ కమల, డాక్టర్ పుష్పలత మాట్లాడుతూ తాము విధులలో చేరిన నాటి నుంచి వైద్య వృత్తిని గౌరవంగా స్వీకరించామని, ఈ ప్రాంతంలో ఎన్ వి రావు ఫౌండేషన్ చేస్తున్న సేవలను మా వైద్యశాలలో విధులు నిర్వర్తించే వారి వల్ల తెలుసుకొని వారి ద్వారా డాక్టర్స్ డే సందర్భంగా సన్మానించుకోవడం తమ అదృష్టమని వారు తెలిపారు. ఫౌండేషన్ వారికి తమ వంతు సేవలు కూడా వేము అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వారు



అన్నారు. ముందుగా డాక్టర్ కమల గారికి శాలువాతో సత్కరించి షీల్డ్, మెడల్ తలపాగాతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా డాక్టర్ పుష్పలత గారిని కూడా నిర్వాహకులు, వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నేత్ర వైద్య నిపుణులు జివివి రమణ, ఎం వి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం విజయలక్ష్మి, సీనియర్ ఫార్మసిస్ట్ టి కృష్ణ, వైద్య సిబ్బంది సలోమి, మస్తానయ్య సిబ్బంది రోగులు ఉన్నారు.

## సూర్యప్రభ వాహనంపై మత్స్యావతార వేదనారాయణ స్వామి అలంకారంలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఏడో రోజు బ్రహ్మోత్సవాల్లో ఆధ్యాత్మిక వైభవం

ప్రజా భూమి ప్రతినిధి, వడమాల పేట

తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధాలయమైన అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజైన బుధవారం ఉదయం సూర్యప్రభ వాహనంపై మత్స్యావతార వేదనారాయణ స్వామి అలంకారంలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారు దివ్యమంగళ స్వరూపంతో భక్తులకు కటాక్షించి అభయాన్ని ప్రసాదించారు. గోవింద నామస్మరణల మధ్య జరిగిన ఈ వాహనసేవ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.





సూర్యప్రభ వాహన సేవతో ఆయురారోగ్యాలు -- ఐశ్వర్య ప్రాప్తి

సకల జీవరాశికి చైతన్యాన్ని ప్రసాదించే సూర్యనారాయణుని మహిమను ప్రతిబింబించే సూర్యప్రభ వాహనంపై శ్రీహరి దర్శనం అత్యంత పుణ్యప్రదమైనదిగా భావిస్తారు. ఈ వాహనసేవను దర్శించిన భక్తులకు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సత్సంతాన భాగ్యం, సకల శుభాలు సిద్ధిస్తాయని ఆగమశాస్త్రాలు పేర్కొంటున్నాయి. ఈ వాహనసేవలో ఆలయ ఏఈఓ దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, కంకణ భట్టర్ సూర్యకుమార్ ఆచార్యులు, శ్రీవారి సేవకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న, ఆం.ప్ర రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కిఘన స్వాగతం లభించింది

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

తిరుపతి జిల్లా రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆం.ప్ర రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కి మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి మరియు రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్,కి ఘన స్వాగతం పలికిన, జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బారాయుడు, శ్రీకాళహస్తి (ఆర్ ,డి ,ఓ) బానుప్రకాష్ రెడ్డి, చంద్రగిరి, కాళహస్తి, నగరి పూతలపట్టు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి గాలి భానుప్రకాష్, మురళి మోహన్, శాప్ చైర్మన్ రవి నాయుడు, మాజీ మంత్రి శ్రీమతి పనబాక లక్ష్మి, క్లీన్ అండ్ గ్రీన్ బ్యూటిఫికేషన్స్ చైర్మన్ శ్రీమతి సుగుణమ్మ, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, జిల్లా మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ,కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు తదితరులు స్వాగతం పలికారు.





## వాకర్స్ అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఐఎంఏ కోశాధికారి డాక్టర్ పి. రెడ్డప్ప

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా తిరుపతి శ్రీ గోవిందరాజ స్వామి ఆర్ట్స్ కళాశాలలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తిరుపతి శాఖ అధ్యక్షులు డాక్టర్ ఎ.ఆర్. రెడ్డి, కోశాధికారి డాక్టర్ పి. రెడ్డప్పలను గోవిందరాజ స్వామి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్పందించిన డాక్టర్ పి. రెడ్డప్ప, వైద్యుల సేవలను గుర్తించి డాక్టర్స్ డే సందర్భంగా తమకు ఘన సన్మానం నిర్వహించిన గోవిందరాజ స్వామి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, పదాధికారులు, సభ్యులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సన్మానం తమకు మరింత బాధ్యతను గుర్తు చేస్తోందని, ప్రజలకు నాణ్యమైన, మానవీయ వైద్య సేవలను అందించేందుకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తరపున నిరంతరం కృషి కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు. సమాజంలో వైద్య వృత్తికి గౌరవం పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు వైద్యులకు మరింత ఉత్సాహాన్ని కలిగిస్తాయని అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులను సత్కరించి గౌరవించిన గోవిందరాజ స్వామి వాకర్స్ అసోసియేషన్ సేవాభావాన్ని డాక్టర్ పి. రెడ్డప్ప ప్రత్యేకంగా అభినందించారు.





# అంధకారంలో గోవర్ధనగిరి హరిజనవాడ

**మూడు నెలలుగా వెలగని వీధి దీపాలు.. రాత్రి వేళల్లో పాముల భయం దయచేసి వెలుగులు నింపండి' అంటూ అధికారులకు కాలనీవాసుల మొర**

ప్రజా భూమి ప్రతినిధి – పిచ్చాటూరు :

గత మూడు నెలలుగా మా కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి అయిందంటే చాలు కటిక చీకటి కమ్ముకుంటోంది. చీకటిని ఆసరాగా చేసుకుని వీధుల్లోకి పాములు, విషపురుగులు వస్తుండటంతో భయంతో వణికిపోతున్నాం. చిన్న పిల్లలు, వృద్ధులు రాత్రి పూట బయటకు రావాలంటేనే ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకోవాల్సి వస్తోంది అని పిచ్చాటూరు మండలం గోవర్ధనగిరి హరిజనవాడ కాలనీ ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక కాలనీవాసుల కథనం ప్రకారం.. గోవర్ధనగిరి హరిజనవాడలో ప్రధాన వీధుల్లో ఉన్న వీధి దీపాలు (స్ట్రీట్ లైట్స్) చెడిపోయి మూడు నెలలు గడుస్తున్నా పంచాయతీ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. కాలనీలో చీకటి ఎక్కువగా ఉండటం వల్ల రాత్రి వేళల్లో విషసర్పాలు, తేళ్లు ఇళ్ల పరిసరాల్లోకి వస్తున్నాయని, దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ వీధి దీపాల సమస్యపై ఇప్పటికే పలుమార్లు స్థానిక పంచాయతీ అధికారులకు, సిబ్బందికి మొరపెట్టుకున్నా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందని కాలనీ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి.. గోవర్ధనగిరి హరిజనవాడలో పాడైపోయిన వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టి, కొత్త బల్బులు వేసి తమ కాలనీలో వెలుగులు నింపాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.



## ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి ఘన స్వాగతం

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

"పేదల సేవలో ప్రభుత్వం" కార్యక్రమంలో పాల్గొనేందుకు శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం పున్నపువారిపాలెం గ్రామానికి విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. బుధవారం మధ్యాహ్నం 12.42 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్లో పున్నపువారిపాలెం సమీపంలోని హెలిప్యాడ్ కు చేరుకున్న ముఖ్యమంత్రి కి రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నస్యం మహమ్మద్ ఫరూక్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ అజిత వేజెండ్ల, జాయింట్ కలెక్టర్ ఎం. వెంకటేశ్వర్లు, ఏపీఎంబీ చైర్మన్ శ్రీ దామచర్ల సత్యనారాయణతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు ఘనస్వాగతం పలికారు.

## పెన్షన్ల పంపిణీలో మన రాష్ట్రం దేశానికే ఆదర్శం- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి





సామాజిక ఫించన్ల పంపిణీలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్రంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పది లక్షల కోట్ల రూపాయల అప్పు పెట్టి వెళ్ళినా ఇచ్చిన మాట ప్రకారం నాలుగువేల రూపాయలను టంచన్ గా ప్రతి నెలా ఒకటవ తేదీ అందిస్తున్న ఘనత ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని ఆయన చెప్పారు. 49వ డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్‌ను లబ్దిదారులకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పంపిణీ చేశారు. నెల, నెలా పెన్షన్ టైంకు అందుతున్నదా అని లబ్దిదారులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రశ్నించగా సక్రమంగా అందుతున్నదని సంతోషం వ్యక్తం చేశారు. నగరంలో 18 వేల 245 మందికి ప్రతి నెలా 8 కోట్ల 12 లక్షల 95 వేల రూపాయలను అందిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఎన్డీఏ కూటమి అధికారం చేపట్టిన రెండేళ్ళలో ఫించన్ల కోసం 68 వేల 597 కోట్లు వ్యయం చేసిందని ఆయన చెప్పారు. ప్రతి నెలా ఫించన్ల కోసం ప్రభుత్వం 2 వేల 700 కోట్లు ఖర్చు చేస్తోందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని ఆయన చెప్పారు. మొదటి తారీఖు సెలవు దినం అయితే ముందు రోజే పెన్షన్స్ అందిస్తున్న ఘనత ఎన్డీఏ కూటమి ప్రభుత్వానిదని రాష్ట్ర గ్రీన్, బ్యూటిఫికేషన్ కార్పోరేషన్ ఛైర్ పర్సన్ సుగుణమ్మ తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెంచిన పెన్షన్ ను తొలి నెల నుంచే ప్రభుత్వం ఇస్తోందని ఆమె చెప్పారు. నగరంలో 18వేలకు పైగా లబ్దిదారులకు ఉదయం 7 గంటల నుంచే పెన్షన్ సచివాలయ సిబ్బంది అందిస్తున్నారని కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి చెప్పారు. డ్రైనేజీ, రోడ్డు సమస్యను స్థానికులు తమ దృష్టికి తీసుకొచ్చారని వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పోరేషన్ డైరక్టర్ కుమారమ్మ, మాజీ కార్పోరేటర్ అన్నా అనిత, ఏపీయూఎఫ్ఐడిసి డైరెక్టర్ చందన, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రగిరి వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించిన ఎమ్మెల్యే పులివర్తి నాని..!

ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:





చంద్రగిరి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులోని మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులు, రైతులకు అందుతున్న సేవలపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్, స్థానిక నాయకులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. మార్కెట్ యార్డ్ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులు, రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. మార్కెట్ యార్డును రైతులకు మరింత ఉపయోగకరంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను దశలవారీగా అమలు చేస్తామని ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. రైతుల అవసరాలకు అనుగుణంగా మార్కెట్ యార్డులో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో ప్రముఖ క్రికెటర్ శ్రీకాంత్

ప్రజాభూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్లను ప్రముఖ క్రికెటర్ శ్రీకాంత్ కుటుంబ సభ్యులతో బుధవారం దర్శించుకున్నారు వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక దర్శనాన్ని ఏర్పాటు చేశారు అనంతరం మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేద పండితులతో ఆశీర్వచనం పలికి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందజేశారు ఆలయంలో భక్తులు క్రికెటర్ శ్రీకాంత్తో సెల్ఫీలు తీసుకున్నందుకు ఆసక్తి చూపారు అందరితో ఆయన సరదాగా నవ్వుతూ ఫోటోలు దిగారు ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ మాజీ బోర్డు సభ్యులు మున్నా రాయల్ జైశ్యామ్ మనోజ్ పట్టణ వైఎస్ఆర్సిపి యువజన అధ్యక్షులు మల్లెంబాకం ముని కృష్ణారెడ్డి దేవా సూర్య సతీష్ తదితరులు పాల్గొన్నారు



## గెంజి లక్ష్మమ్మ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ. 2,07,727 ఎల్ఓసి మంజూరు చేయించిన పులివర్తి నాని..!.

**- ఎమ్మెల్యే సహకారంతో నారాయణాద్రి హాస్పిటల్‌లో లక్ష్మమ్మ కి విజయవంతంగా ముగిసిన సర్జరీ..**




ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి: చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టం వచ్చినా తక్షణమే చలించిపోయి ఆదుకునే మనస్తత్వం కలిగిన చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. ఆరోగ్య అత్యవసర స్థితిలో ఉన్న ఒక కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా భారీ ఆర్థిక సాయం అందించి కొండంత అండగా నిలిచారు. చంద్రగిరి మండలం కొత్త శానంభట్ల గ్రామ పంచాయతీకి చెందిన గెంజి లక్ష్మమ్మ అనారోగ్యంతో తిరుపతిలోని నారాయణాద్రి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఆమెను పరీక్షించిన వైద్యులు అత్యవసరంగా సర్జరీ (ఆపరేషన్) చేయాల్సి ఉంటుందని, అందుకు 2 లక్షలకు పైగా ఖర్చవుతుందని కుటుంబ సభ్యులకు తెలిపారు. కుటుంబ సభ్యులు, స్థానిక గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు తులసేశ్వర రెడ్డిని సంప్రదించారు. ఆయన ఈ విషయాన్ని వెంటనే ఎమ్మెల్యే పులివర్తి నాని గారి దృష్టికి తీసుకెళ్లారు. బాధితుల పరిస్థితిని విని చలించిపోయిన ఎమ్మెల్యే తక్షణమే స్పందించారు. నారాయణాద్రి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న గెంజి లక్ష్మమ్మ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ. 2,07,727 ఎల్ఓసి మంజూరు చేయించారు. ఎమ్మెల్యే గారి ప్రత్యేక చొరవతో ఎల్ఓసి అందడంతో వైద్యులు ఆమెకు ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం లక్ష్మమ్మ గారు కోలుకుంటున్నారు. కష్టకాలంలో తాము అడిగిన వెంటనే స్పందించి బాధితులకు అండగా నిలిచిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కి, తమకు అండగా నిలిచిన టిడిపి నాయకుడు తులసేశ్వర రెడ్డికి లక్ష్మమ్మ కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి నాయకుడు తులసేశ్వర రెడ్డి మాట్లాడుతూ.. మా ప్రియతమ నాయకుడు పులివర్తి నాని ప్రజా సమస్యలపై ఎంత వేగంగా స్పందిస్తారో చెప్పడానికి ఈ ఘటనే నిదర్శనం. లక్ష్మమ్మ అనారోగ్య సమస్యను మేము అన్న దృష్టికి తీసుకెళ్లిన వెంటనే, ఆయన తన లెటర్ ప్యాడ్‌పై సంతకం చేయడమే కాకుండా.. స్వయంగా విజయవాడలోని సీఎంవో ఆఫీస్‌కు ఫోన్ చేశారు. 'వీరు నాకు చాలా కావాల్సిన వారు, అత్యవసర పరిస్థితి ఉంది, వెంటనే ఎల్ఓసి శాంక్షన్ చేయాలి' అని అధికారులను కోరారు. దాంతో కేవలం ఒకే ఒక్క రోజులోనే రూ. 2,07,727 లక్షల ఎల్ఓసి శాంక్షన్ అవ్వడం, సర్జరీ సజావుగా జరగడం సాధ్యమైంది. పేదల పాలిట సంజీవనిలా నిలుస్తున్న నాని అన్నకు మా గ్రామం తరఫున శతకోటి వందనాలు అని కొనియాడారు. ఎంతో మందికి సాయం అందిస్తూ ఆపద్బాంధవుడిగా నిలుస్తున్న మా నాని అన్నగారు ఎప్పుడూ ఇలాగే ప్రజలకు అండగా ఉండాలని, భగవంతుడు ఆయనకు మరిన్ని ఉన్నత పదవులను ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని తెలిపారు.

## చంద్రబాబు కృషితోనే ఏపీకి దేశంలో రెండో స్థానం

- రాష్ట్ర ప్రగతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న దూరదృష్టి నాయకుడు చంద్రబాబు
- నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి





ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,
: "పేదల సేవలో ప్రజా వేదిక" కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, దేశంలో అభివృద్ధి పరంగా ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలవడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి, దూరదృష్టి, పరిపాలనా సామర్థ్యమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పడుతున్న కష్టం అంతా ఇంతా కాదని, రాష్ట్ర ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, పరిశ్రమల స్థాపన, ఉపాధి అవకాశాల కల్పన కోసం ఆయన 24 గంటలూ నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి పడుతున్న కష్టంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు కనీసం 10 శాతం భాగస్వామ్యం అయినా రాష్ట్రం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. గూడూరు ప్రాంతంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, గూడూరు పరిసర ప్రాంతాల్లో రహదారులను బాగా అభివృద్ధి చేశారని తెలిపారు. గూడూరుకు ఇది ఒక అదృష్టమని పేర్కొన్నారు. క్రిస్‌సిటీలో మూడు విడతల్లో 10 వేల ఎకరాల భూసేకరణ చేపట్టి భారీ పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా పెద్దఎత్తున పరిశ్రమలు రానున్నాయని, తొలి దశలో గ్లాస్ పరిశ్రమ, ఈథనాల్ పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని వెల్లడించారు. రానున్న రోజుల్లో అభివృద్ధి ఫలితాలు గూడూరు ప్రాంతంలో స్పష్టంగా కనిపిస్తాయని తెలిపారు. నెల్లూరు జిల్లాలో అనేక పరిశ్రమలు ఏర్పాటు కానుండటంతో పాటు విమానాశ్రయం, బీపీసీఎల్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు కూడా జిల్లాకు కొత్త దిశానిర్దేశం చేయనున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా జిల్లాలో భారీ స్థాయిలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. గూడూరు పరిసర ప్రాంతాల్లో వస్తున్న పరిశ్రమల కారణంగా యువత ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గిపోతుందని, స్థానికంగానే పుష్కలమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. జిల్లాలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు కొరత లేకుండా ప్రభుత్వం కార్యాచరణ చేపడుతోందన్నారు. రాష్ట్ర అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో పనిచేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు.

## 3న అక్షర గోవిందానికి సర్వం సిద్ధం

**ఏర్పాట్లను పరిశీలించిన టిటిడి జేఈఓ డా. ఎ. శరత్**





ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్
టిటిడి ఆధ్వర్యంలో జూలై 3న శ్రీ వకుళామాత సన్నిధిలో నిర్వహించనున్న "అక్షర గోవిందం -- అన్నప్రాశన" కార్యక్రమానికి పటిష్ట ఏర్పాట్లు చేపడుతున్నట్లు టిటిడి జేఈవో డా. ఎ. శరత్ తెలిపారు. బుధవారం ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన వేదిక, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ, శ్రీవేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో, వకుళామాత కరుణాకటాక్షాల మధ్య వేదోక్తంగా చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాశన నిర్వహించనున్నట్లు తెలిపారు. వేద మంత్రోచ్ఛారణల నడుమ సంప్రదాయబద్ధంగా జరిగే ఈ పవిత్ర కార్యక్రమంలో తొలి రోజు నమోదు చేసుకున్న 25 మంది చిన్నారులు తమ తల్లిదండ్రులతో నిర్ణీత సమయానికి హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని, పాల్గొనదలచిన వారు ముందస్తుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అక్షర గోవిందంలో పాల్గొనే ప్రతి చిన్నారికి ఉచితంగా "అక్షర గోవిందం" కిట్ అందజేయనున్నట్లు తెలిపారు. జూలై 4 నుండి ఆలయ అర్చకుల పర్యవేక్షణలో ప్రతిరోజూ రెండు బ్యాచ్‌లలో, ఒక్కో బ్యాచ్‌కు 25 మంది చొప్పున అక్షరాభ్యాసం, అన్నప్రాశన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు వకుళామాత ఆలయ సమీపంలోని యాగశాలలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, అగ్ని ప్రతిష్ఠ, కుంభారాధన, శ్రీదేవి-భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, వకుళామాతకు చతుర్‌కలశ స్నపనం, పంచగవ్య, క్షీర, జలాభిషేకాలు, వివిధ హోమాలు వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మప్రచార పరిషత్ ఇన్‌చార్జి కార్యదర్శి డా. మేడసాని మోహన్, డిప్యూటీ ఈవోలు శ్రీమతి వరలక్ష్మి, శివప్రసాద్, ఎస్.ఈ. మనోహరం, వీజీవోలు శ్రీ గిరిధర్, వేంకటేశ్వర్లు, ఈఈ మల్లికార్జున ప్రసాద్, డీఈ సరస్వతి, అడిషనల్ హెల్త్ ఆఫీసర్ డా. సునీల్ అధికారులు పాల్గొన్నారు.

## మొండికాల్వ పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ..!

**- కేశవ సేవా సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం..**

**- వచ్చే ఏడాది నుంచి ఉన్నత పాఠశాల విద్యార్థులకు కూడా సాయం: నిర్వాహకుల హామీ..**



ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:
చంద్రగిరి రెవెన్యూ మండలం, మొండికాల్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశా లలో 'కేశవ సేవా సమితి' ఆధ్వ ర్యంలో విద్యార్థులకు విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానో పాధ్యాయులు తులసి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... కేశవ సేవా సమితి వారు గత ఏడాది కూడా తమ పాఠశాల విద్యార్థులకు విద్యా సామాగ్రిని (పలకలు, బలపాలు,నోటు పుస్తకాలు, పెన్సిల్లు, సార్పునర్లు,యరేజర్లు) అందించి ఆదుకున్నారని గుర్తుచేశారు. ఈ విధమైన ప్రోత్సాహకాల వల్ల గత ఏడాది కాలంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం గణనీయంగా మెరుగైందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి ఏడూ విద్యార్థులకు నిరంతరాయంగా విద్యా సామాగ్రిని అందిస్తామని కేశవ సేవా సమితి సభ్యులు హామీ ఇవ్వడం అభినందనీయమన్నారు.

ఉన్నత చదువులకూ భరోసా: ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేశవ సేవా సమితి ప్రతినిధులు విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రాథమిక విద్యతోనే పిల్లల చదువులను ఆపేయకుండా, వారిని ఉన్నత పాఠశాల (హైస్కూల్) విద్యకు కూడా పంపించాలని కోరారు. హైస్కూలుకు వెళ్లే పిల్లలకు కూడా రాబోయే విద్యా సంవత్సరం నుండి విద్యా సామగ్రిని అందిస్తామని ఈ సందర్భంగా వారు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేశవ సేవా సమితి సభ్యులు పోంతల రమేష్, హేమంత్ కుమార్ రెడ్డి తదితరులతో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుకై నిరంతరం శ్రమిస్తున్న కేశవ సేవా సమితికి పాఠశాల ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## నెల్లిపూడి లో విజయవంతంగా ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

**మొదటి రోజే 85 శాతం పంపిణీ పూర్తి -- స్పెషల్ ఆఫీసర్ సి. శ్రీనివాసులు**

ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు



ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం బుధవారం నెల్లిపూడి సచివాలయం పరిధిలో విజయవంతంగా కొనసాగింది. అర్హులైన లబ్ధిదారులకు ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని నెల్లిపూడి సచివాలయం స్పెషల్ ఆఫీసర్ సి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెల్లిపూడి సచివాలయ పరిధిలో మొత్తం 492 మంది పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. 410 మందికి పెన్షన్లు పంపిణీ చేయడం ద్వారా 85 శాతం పంపిణీ పూర్తి చేశామని ఆయన పేర్కొన్నారు. మిగిలిన లబ్ధిదారులకు కూడా ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లు అందజేసి 100 శాతం పంపిణీ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పెన్షన్ పంపిణీ చేపడుతున్నామని స్పష్టం చేశారు.

## విద్యార్థి మిత్ర విద్యా సామగ్రి పంపిణీపై సమీక్ష

ప్రజా భూమి ప్రతినిధి
బుచ్చినాయుడు కండ్రిగ



తిరుపతి జిల్లా బి.ఎన్. కండ్రిగ మండల విద్యాశాఖ కార్యాలయాన్ని ముఖ్య పర్యవేక్షణ అధికారి సురేష్, సహాయ ముఖ్య పర్యవేక్షణ అధికారి వెంకటరమణ, అదనపు సహాయ పర్యవేక్షణ అధికారి మనోహర్ బుధవారం సందర్శించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమం పర్యవేక్షణలో భాగంగా వారు కార్యాలయానికి విచ్చేసి పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నమోదు, పాఠశాలల విద్యా ప్రగతి, విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ, విద్యా ప్రమాణాల మెరుగుదలతో పాటు ఇతర విద్యా సంబంధిత అంశాలపై మండల విద్యాశాఖ అధికారులతో చర్చించారు. ప్రభుత్వ విద్యా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం మండలంలోని పాఠశాలల పరిస్థితులు, విద్యార్థుల హాజరు శాతం, నమోదు ప్రక్రియ, విద్యా ఫలితాల మెరుగుదలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. విద్యా రంగ అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్, ముని సుబ్రహ్మణ్యం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్డీయే కూటమి తోనే సంక్షేమం సాధ్యం -ఎన్డీయే కూటమి నాయకులు



ప్రజా భూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి

పేదలు ఆత్మ గౌరవంతో జీవించడానికి అవసరమైన అనేక సంక్షేమ పథకాలకు రూపకల్పన చేసి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంక్షేమ రాజ్యానికి పునాది వేసిన స్వర్గీయ నందమూరి తారక రామారావు చూపిన బాటలోనే ఎన్డీయే కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తూ పేద లలో సంక్షేమం సాధ్యం అవుతున్నదని ఎన్డీయే కూటమి, శ్రీకాళహస్తి నియోజకవర్గ నాయకులు తెలిపారు. శ్రీకాళహస్తి పురపాలక సంఘం, 18 వ వార్డు పరిధిలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు అందజేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. సంక్షేమమే ప్రభుత్వ బాధ్యత అనే నమ్మకంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రతీ నెలా 1వ తేదీన ఇంటి వద్దకే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు. ఈ జూలై నెలలో రాష్ట్రవ్యాప్తంగా 62,19,648 మంది లబ్ధిదారులకు రూ.2,711.79 కోట్ల విలువైన పెన్షన్లు పంపిణీ చేస్తున్నాం. అలాగే కొత్తగా మంజూరైన 7,792 మంది వితంతు లబ్ధిదారులకు కూడా ఈరోజు నుంచే పెన్షన్లు అందజేయడం సంతోషకరం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ డా.జి.దశరథాచారి, వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం. ఉమేష్ రావు, శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్, బిజెపి పట్టణ అధ్యక్షుడు హరీశ్ రెడ్డి, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, శ్రీకాళహస్తి పురపాలక సంఘం మాజీ కౌన్సిలర్ షేక్ మహబూబ్ బాషా, తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంటు నాయకులు డి.వి.నారాయణ,కోట చంద్రశేఖర్, సయ్యద్ చాంద్ బాషా,శంకర్, షేక్ నూర్ మొహమ్మద్, బిజెపి నాయకులు నరేష్, కృష్ణారెడ్డి, శేషు,రాజా,జనసేన నాయకులు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# వాహన డీలర్లతో సమన్వయ సమావేశం





ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

తిరుపతి జిల్లా రవాణా శాఖాధికారి ఆధ్వర్యంలో అన్ని రకాల మోటారు వాహనాల డీలర్లతో అవగాహన సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ మాట్లాడుతూ వాహన కొనుగోలు చేసే ప్రతి వినియోగదారునికి తొలి సేవా కేంద్రం డీలర్‌షిప్ కావడంతో, డీలర్లు కస్టమర్లతో మర్యాదపూర్వకంగా, పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. వాహన రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ప్రభుత్వ రుసుములు, పన్నులు, సేవా రుసుములు మరియు ఇతర చార్జీల వివరాలను షోరూమ్‌లలో అందరికీ కనిపించే విధంగా ప్రదర్శించాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన రుసుములకు మించి ఎటువంటి అదనపు రుసుము వసూలు చేయరాదని స్పష్టం చేశారు. అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే, ప్రతి వాహన కొనుగోలుదారునికి ఫ్యాన్సీ రిజిస్ట్రేషన్ నంబర్ అవసరమా కాదా అనే విషయాన్ని ముందుగానే తెలియజేయాలని, ఫ్యాన్సీ నంబర్ల కేటాయింపు ప్రభుత్వ నిబంధనల ప్రకారం మాత్రమే జరుగుతుందని వివరించాలని సూచించారు. కస్టమర్లకు వాహన రిజిస్ట్రేషన్ ప్రక్రియ, చెల్లించాల్సిన రుసుములు, అవసరమైన పత్రాలు మరియు ఇతర వివరాలపై పూర్తి అవగాహన కల్పించాలని, ప్రతి లావాదేవీలో పారదర్శకత పాటించాలని సూచించారు. డీలర్లు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో నిర్దిష్టమైన అనుమతి పత్రాలు మాత్రమే పొందుపరచాలని ,రవాణా శాఖ ప్రజలకు పారదర్శకమైన, అవినీతిరహిత, జవాబుదారీతనం కలిగిన సేవలను అందించడానికి కట్టుబడి ఉందని, ఈ లక్ష్య సాధనలో డీలర్ల సహకారం ఎంతో అవసరమని మోటార్ వాహన తనిఖీ అధికారి శ్రీనివాసరావు తెలిపారు సమావేశంలో పాల్గొన్న డీలర్లు సూచనలను పాటిస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మోటార్ వాహన తనిఖీ అధికారులు శ్రీనివాసరావు, అతికానాజ్ మరియు పరిపాలన అధికారులు విజయ్ కుమార్ విజయ ప్రశాంతి పాల్గొన్నారు.

## బద్వేల్ ఆర్డీవో కోర్టును బేఖాతరు చేసిన వీఆర్వో

## -: కోన 144-2 సర్వే నంబర్ భూమి తొలగింపు వెనుక భారీ స్కామ్



ప్రజాభూమి పోరుమామిళ్ల :

కాసినయన మండలం సావిశెట్టిపల్లె (అక్కంగుండ్ల) భూ వివాదంలో విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ వీఆర్వో కోన నర్సిములు తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దేశ సరిహద్దుల్లో ప్రాణాలు పణంగా పెట్టి సేవ చేసిన రిటైర్డ్ ఆర్మీ మాజీ సైనికుల సిబ్బందికి ప్రభుత్వ భూములు కేటాయించాలంటే జిల్లా కలెక్టర్ నుంచి స్పష్టమైన నిరాక్షేపణ పత్రం ఎన్‌ఓసి తప్పనిసరి అనే నిబంధన ఉంది. అయితే, ఎలాంటి ఎన్‌ఓసి లేకుండా, కనీస విచారణ కూడా జరపకుండా సర్వే నంబర్ 144-2లో ఉన్న వివాదాస్పద భూమిని 'డిస్ట్రబ్డ్' (వివాదాస్పద) జాబితా నుండి విఆర్‌ఓ తొలగించడం ఇప్పుడు రెవెన్యూ వర్గాల్లో పెద్ద సంచలనంగా మారింది. ఈ తీవ్రమైన అధికార దుర్వినియోగం, నిబంధనల ఉల్లంఘనపై రూపొందించిన ఈ కోన, కాసినయన మండలం సావిశెట్టిపల్లె రెవెన్యూలో బరితెగింపు: కోర్టులో భూమి ఉండగానే క్లియరెన్స్ ఇచ్చిన వీఆర్వో! ప్రభుత్వ భూములపై 'కోన నర్సిములు' లీలలు.. కలెక్టర్ ఎన్‌ఓసి లేకుండానే వివాదాస్పద జాబితా నుంచి తొలగింపు! ఎవరికోసం ఈ గుట్టుచప్పుడు కాని వ్యవహారం? దీని వెనుక ఉన్న అంతగతం ఏమిటి? చట్టాలు చుట్టాలవుతున్నాయి.. నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు.. బద్వేల్ ఆర్డీవో కోర్టు పరిధిలో ఉన్న భూములను సైతం తమ సొంత జాగీరులా మార్చేస్తున్నా వీఆర్వో కోన . సావిశెట్టి పల్లె అక్క్యగుశీడ్ల భూముల విషయంలో వైఎస్ఆర్ కడప జిల్లా కాసినయన మండలం, సేవిశెట్టిపల్లె (అక్కంగుండ్ల) రెవెన్యూ పరిధిలో ఒక దారుణమైన అక్రమ వ్యవహారం వెలుగుచూసింది. సర్వే నంబర్ 144-2లో ఉన్న సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమి చుట్టూ ఇప్పుడు పెద్ద దుమారమే రేగుతోంది. బద్వేల్ ఆర్‌డీఓ ఆర్డీవో కోర్టులో ఈ భూమిపై వివాదం నడుస్తుండగానే, స్థానిక వీఆర్వో వీఆర్వో కోన నర్సిములు ఎటువంటి ఉన్నతాధికారుల అనుమతులు లేకుండానే డిస్ట్రబ్డ్ (వివాదాస్పద) జాబితా నుంచి ఆ భూమిని తొలగించడం వెనుక ఉన్న 'అంతగతం' ఏమిటనే ప్రశ్నలు జిల్లావ్యాప్తంగా హడలెత్తిస్తున్నాయి. కలెక్టర్ ఎన్‌ఓసి ఎక్కడలి? చట్టం ఏం చెబుతోంది? నిబంధనల ప్రకారం, రిటైర్డ్ ఆర్మీ అధికారులకు లేదా మాజీ సైనికులకు ప్రభుత్వ భూమిని కేటాయించాలన్నా, బదిలీ చేయాలన్నా దానికి అత్యున్నత అధికార సంస్థ అయిన జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి అధికారికంగా నిరాక్షేపణ పత్రం ఎన్‌ఓసి రావలసి ఉంటుంది. కలెక్టర్ అనుమతి లేనిదే ఆ భూమిపై ఎటువంటి మార్పులు లేదా కేటాయింపులు చేయడానికి కింది స్థాయి సిబ్బందికి అస్సలు హక్కు లేదు. కానీ, ఇక్కడ విఆర్‌ఓ కోన నర్సిములు చట్టాన్ని తన జేబులో పెట్టుకున్నట్లు వ్యవహరించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఎలాంటి ఆదేశాలు లేదా ఎన్‌ఓసి రాకముందే, సర్వే నంబర్ 144-2లోని భూమికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేయడం వెనుక ఉన్న మతలబు ఏమిటి? ఆర్‌డీఓ కోర్టును సైతం బేఖాతరు చేస్తారా? మరోవైపు ఈ నిర్దిష్ట భూమికి సంబంధించిన వివాదం బద్వేల్ ఆర్‌డీఓ కోర్టులో నడుస్తోంది. ఒక భూమి న్యాయస్థాన పరిధిలో ఉన్నప్పుడు, దానిపై తుది తీర్పు వచ్చే వరకు లేదా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి విచారణ జరిపి నివేదిక ఇచ్చే వరకు ఆ రికార్డులను ముట్టుకునే సాహసం ఎవరూ చేయరు. కానీ ఇక్కడ విఆర్‌ఓ కనీస విచారణ కూడా జరపలేదు. అసలు వివాదం ఏంటి? కోర్టులో కేసు ఎందుకు నడుస్తోంది? అనే ప్రాథమిక విషయాలను పూర్తిగా తొక్కిపెట్టి, రహస్యంగా ఆ భూమిని వివాదాస్పద జాబితా నుండి తొలగించడం వెనుక పెద్ద ఎత్తున చేతులు మారాయనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. దీని వెనుక ఉన్న అంతగతం ఏమిటి? ఒక సాధారణ వీఆర్వో స్థాయి అధికారి జిల్లా కలెక్టర్‌ను, ఆర్‌డీఓ కోర్టును దాటి ఇంత పెద్ద నిర్ణయం తీసుకున్నారంటే దీని వెనుక రాజకీయ అండదండలు లేదా బడా భూబకాసురుల హస్తం ఖచ్చితంగా ఉండి తీరుతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నా లక్షల రూపాయల చేతులు మారాయా?: ఎటువంటి ఎంక్వైరీ లేకుండా రాత్రికి రాత్రే రికార్డులను మార్చడం వెనుక భారీ స్థాయిలో అవినీతి జరిగిందా?

ఒత్తిళ్లు ఎవరివి?: ప్రభుత్వ భూమిని ఏ ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడానికి ఈ క్లియరెన్స్ ఇచ్చారు? ఉన్నతాధికారుల కళ్లుగప్పారా?: ఆర్‌డీఓ కోర్టులో స్టేటస్ తెలిసి కూడా విఆర్‌ఓ ఇంత సాహసానికి ఒడిగట్టడం వెనుక రెవెన్యూ విభాగంలో ఎవరెవరి పాత్ర ఉందో తేలాల్సి ఉంది. ఒక వ్యక్తిని ఫోన్లో సంభాషించి అడగగా మాకు తెలియదు అధికారులే దీని తొలగించారు అని చెప్పడం జరింగింది.

## ప్రజా సేవలో వేగం.. రాయలవారి కోటలో తెల్లవారుజామునే పెన్షన్ల పంపిణీ..!



ప్రజాభూమి ప్రతినిధి,చంద్రగిరి:

చంద్రగిరి గ్రామపంచాయతీ పరిధిలోని రాయలవారి కోట ప్రాంతంలో వితంతువులు, వికలాంగులకు సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం ఉదయం 7 గంటలకే ప్రారంభమైంది. యూనిట్ ఇంచార్జ్ లోకేష్ రాయల్, బూత్ ఇంచార్జ్ కడియాల రవితేజ యాదవ్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇంటి వద్దకే చేరుకొని పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమంపై హర్షం వ్యక్తం చేశారు. ఉదయాన్నే పెన్షన్ అందుకోవడంతో తమ రోజువారీ అవసరాలు సకాలంలో తీర్చుకునే అవకాశం కలిగిందని వారు పేర్కొన్నారు. లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం కనిపించగా, ప్రభుత్వం పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని పెన్షన్ పంపిణీని సమర్థవంతంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆశయాలకు అనుగుణంగా ప్రతి అర్హుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి ఎంపీ అవినాష్ రెడ్డి కృషి

### - ఎంపీ, మండల గ్రాంట్ కింద నిధులు మంజూరు

### - కొత్త తాగునీటి బోరు ఏర్పాటు



ప్రజాభూమి, వేంపల్లె

మండలంలోని నేలవరం తాండా ప్రాంతంలో తీవ్ర తాగునీటి సమస్య పరిష్కారానికి కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి కృషి చేశారని జడ్పీటిసి సభ్యుడు మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి వెల్లడించారు. ఎంపీ నిధుల కింద రూ.4 లక్షలు, మండల గ్రాంట్ కింద రూ.4 లక్షలు నిధులు మంజూరు చేయించి, కొత్త తాగునీటి బోరును ఏర్పాటు చేశారు. వివరాల్లోకి వెళితే నేలవరం తాండా, బోలగొంది చెరువు గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి తలెత్తిందని, దీంతో గ్రామ ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆ గ్రామ ప్రజలు స్థానిక జడ్పీటిసి మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆ విషయాన్ని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి దృష్టికి రవికుమార్ రెడ్డి తీసుకెళ్లారు. ఎంపీ తక్షణమే స్పందించి పరిష్కారానికి కృషి చేశారు. తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో ఆ గ్రామ ప్రజలు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి, ఎంపీటీసీ శివశంకర్ రెడ్డి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## విద్యా వ్యవస్థలో మార్పులు వచ్చేంతవరకు పోరాటం -డా.వికాస్ పాండే




ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

విద్యా వ్యవస్థలో మార్పులు వచ్చేంతవరకు కన్స్యూమర్ కౌన్సిల్ పోరాటం చేస్తుందని, వినియోగదారుల హక్కుల పరిరక్షణకు ప్రతి పౌరుడు అప్రమత్తంగా ఉండాలని కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వికాస్ పాండే అన్నారు. తిరుపతిలో నిర్వహించిన జిల్లా సభ్యుల సమావేశం, నూతన కమిటీ నియామకం, సభ్యత్వ గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి నేషనల్ స్పోర్ట్స్ పర్సన్ అవినాష్, రాష్ట్ర కార్యదర్శి శరత్, విజయ్ ఇంపాక్ట్ ఫౌండేషన్ చైర్మన్ విజయ్ ఉత్తరాది విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ వికాస్ పాండే మాట్లాడుతూ వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని అవసరమైనప్పుడు చట్టపరంగా తమ హక్కులను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. విజయ్ ఉత్తరాది మాట్లాడుతూ విద్యార్థులపై అధిక విద్యా ఒత్తిడి తగ్గించి, వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా అధ్యక్షురాలిగా సంధ్యారాణి, వైస్ ప్రెసిడెంట్‌గా నవీన్, సెక్రటరీగా ప్రేమ్ సాగర్ తదితరులతో నూతన జిల్లా కమిటీని ప్రకటించారు. అనంతరం సభ్యులకు గుర్తింపు కార్డులు అందజేసి సత్కరించారు. జిల్లా నలుమూలల నుంచి సభ్యులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రేణిగుంట విమానాశ్రయంలో బిజెపి పార్టీ నాయకుడు శివ ప్రకాష్ కు స్వాగతం



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట

రేణిగుంట విమానాశ్రయంలో బిజెపి పార్టీ నాయకుడు శివ ప్రకాష్ రాక సందర్భంగా పార్టీ నాయకులు స్వాగతం పలికారు. తిరుపతి పర్యటనకు విచ్చేసిన భారతీయ జనతా పార్టీ జాతీయ సహ సంఘటన ప్రధాన కార్యదర్శి శివ ప్రకాష్ ని తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రాయం లో బిజెపి నాయకులతో కలిసి ఆత్మీయ స్వాగతం తెలియజేయడం జరిగింది. అనంతరం మర్రిగుంట సర్కిల్ వద్ద ఉన్న అటల్ బీహారి వాజ్ పేయి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నాగోత రమేష్ నాయుడు, జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి బిడి. బాలాజీ ,ఓబీసీ మోర్చా అధ్యక్షుడు పీకే గోపి ఆచారి, శ్యాంచంద్ గేలాట్,ఉపాధ్యక్షులు.వేణు ముదిరాజ్, రేణిగుంట మండల ఉపాధ్యక్షులు రాజారాయల్. ప్రధాన కార్యదర్శి పురుషోత్తం. పట్టణ అధ్యక్షుడు నరేష్ రాయల్. తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పక్కల శుభ్రత పనులను పరిశీలించిన ఎంపీడీవో వెంకట రత్నమ్మ



ప్రజాభూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా బి ఎన్ కండ్రిగ మండలంలోని పద్మావతిపురం గ్రామం వి.ఎస్.పురం సచివాలయ పరిధిలో చేపడుతున్న రోడ్డు పక్కల శుభ్రత పనులను ఎంపీడీవో వెంకట రత్నమ్మ బుధవారం పరిశీలించారు. గ్రామంలోని ప్రధాన రహదారుల వెంట సాగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రహదారుల పక్కన పెరిగిన పొదలు, ముళ్లచెట్లు, చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించి ప్రజలకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మురుగునీరు నిల్వ లేకుండా తగిన చర్యలు చేపట్టాలని, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం గ్రామాల పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆమె పేర్కొన్నారు. ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అరవ పెరమిడి గ్రామంలో పండుగలా 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీ.. లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేసిన కూటమి శ్రేణులు



ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట.

అరవ పెరమిడిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న 97వ బూత్ ఇంచార్జ్ కొల్లాపూర్ సుదీప్ వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకే పింఛన్ భరోసా.. నాయుడుపేట మండలంలో ముమ్మరంగా సాగుతున్న పంపిణీ కార్యక్రమం నాయుడుపేట మండలం అరవ పెరమిడి గ్రామంలో బుధవారం నాడు 'ఎన్టీఆర్ భరోసా' సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం అత్యంత ఘనంగా, పండుగ వాతావరణంలో జరిగింది. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పింఛన్ల పెంపు మరియు పంపిణీ కార్యక్రమంలో భాగంగా 97వ బూత్ ఇంచార్జ్ కొల్లాపూర్ సుదీప్ నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లారు. గ్రామంలోని వృద్ధులు, దివ్యాంగులు, లబ్ధిదారుల వద్దకు స్వయంగా వెళ్లి వారికి పెంచిన పింఛన్ సొమ్మును ఎంతో నమ్మకంగా అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తమ ఇళ్ల వద్దకే వచ్చి పింఛన్ అందజేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వానికి, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ ఎన్టీఆర్ భరోసా పెన్షన్.. లబ్ధిదారులకు అందజేసిన టీడీపీ నాయకులు



ప్రజా భూమి ప్రతినిధి
బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా బి.ఎన్. కండ్రిగ మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో ప్రతి నెల ఒకటో తారీఖున అందించే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లో భాగంగా జూలై ఒకటవ తారీఖున ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాలపురం పంచాయతీలో క్లస్టర్ ఇన్‌చార్జి ముని చంద్రనాయుడు, మాజీ గ్రంథాలయ శాఖ చైర్మన్ తుమ్మల కన్నయ్య నాయుడు, గ్రామ కమిటీ సభ్యుడు తుమ్మల రాజేందర్ నాయుడు, ఆధ్వర్యంలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రతి నెలా నిరంతరాయంగా పెన్షన్ అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. పెన్షన్‌ను నేరుగా ఇంటి వద్దకే అందజేయడం ద్వారా లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరిగే ఇబ్బందులు తొలగిపోయాయని తెలిపారు. పెన్షన్ అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వం పట్ల, పెన్షన్ పంపిణీలో పాల్గొన్న నాయకుల పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుని మృతి తీరని లోటు.



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి.

శ్రీకాళహస్తి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు కావలి మురళి తన విధులు ముగించుకుని ఇంటికి వస్తుండగా శ్రీకాళహస్తి నాయుడుపేట బైపాస్ ఎన్ వి ఎస్ కళ్యాణ మండపం నేషనల్ హైవే అండర్ పాస్ వద్ద ట్రాక్టర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మురళి గతంలో ఊరందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయునిగా పని చేస్తూ ఇటీవల చేమూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయులుగా బదిలీపై వెళ్లారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బోరున విలిపిస్తూ శోక సముద్రంలో మునిగిపోయారు. ఈ కేసును రెండవ పట్టణ పోలీసు వారు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఉత్తమ కార్యకర్త అవార్డు-నెల్లూరు సుబ్రహ్మణ్యం



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

రేణిగుంట మండలం కొత్తపాలెం సమీపంలో బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో పార్టీ కోసం కష్టపడిన వారికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా నెల్లూరు సుబ్రహ్మణ్యం కి , రెండు అవార్డును అందుకున్నారు, అందులో భాగంగా, 2023,,2024, బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ,అవార్డు , తెలుగుదేశం ఎక్కువ శాతం సభ్యత్వ నమోదు రెఫరల్, అవార్డు,ఉత్తమ కార్యకర్తగా రెండు అవార్డులు అందుకున్నారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను గుర్తుపెట్టుకొని ఇలాంటి అవార్డులు ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అవార్డులు తీసుకున్న సందర్భంగా ముని చంద్రారెడ్డి, చర్లపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, మా భాష, గజేంద్ర, దేవుళ్ళరమణ, కాలాస్తి నియోజకవర్గం ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ చుక్కల రమేష్, రేణిగుంట మండల ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ ఎక్స్ ఎంపీటీసీ శేషాద్రి, కొరియర్ రవి,రాజేంద్రప్రసాద్, గంగాధరం తదితరులు అభినందనలు తెలిపారు.

ప్రజాభూమి

జనరల్

గురువారం, జులై 02, 2026

12

# ఆన్‌లైన్ పర్మిట్ విధానం పరిశీలన మార్కెట్ కమిటీ బృందం పర్యవేక్షణ



మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

రైతులు, వ్యాపారుల సౌకర్యార్థం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ పర్మిట్ విధానం అమలు తీరును వ్యవసాయ మార్కెట్ కమిటీ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. యార్డ్ లో జరుగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియను, దానికి సంబంధించిన రికార్డులను అధికారులు, పాలకవర్గ ప్రతినిధులు నిశితంగా పర్యవేక్షించారు.ఈ పర్యవేక్షణలో పాల్గొన్న ముఖ్యులుకుంచే వెంకట గురునాథ్ దుర్గాప్రసాద్ (కుంచే నాని): వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ఈడే రాంబాబు: మార్కెట్ కమిటీ బోర్డు మెంబర్ మరియు పీఏసీఎస్ (PACS) చైర్మన్వి. భాస్కరరావు: వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శివీరితో పాటు మార్కెట్ కమిటీ సిబ్బంది కూడా ఈ తనిఖీల్లో పాల్గొని, ఆన్‌లైన్ పర్మిట్ విధానం వల్ల రైతులకు ఎదురవుతున్న సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు. నూతన విధానంతో మార్కెటింగ్ ప్రక్రియలో మరింత పారదర్శకత పెరుగుతుందని ఈ సందర్భంగా అధికారులు, ప్రతినిధులు పేర్కొన్నారు.

# రాజధాని పేరిట ప్రజాధనం లూటీ..

# కూటమి ప్రభుత్వంలో చట్టానికే అగ్రతాంబూలం



## వైసిపి కుట్రలపై నిప్పులు చెరిగిన మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

రాష్ట్రంలో గత వైసిపి ప్రభుత్వం సాగించిన తుగ్లక్ పాలన, రాజధాని మార్పు పేరుతో చేసిన ప్రజాధనం వృధాపై మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం చట్టాన్ని పక్కాగా అమలు చేస్తుంటే వైసిపి నేతలు తట్టుకోలేక గగ్గోలు పెడుతున్నారని ఆయన మండిపడ్డారు. ఈ మేరకు ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ముఖ్యాంశాలు ')1. రూ. 500 కోట్ల ప్రజాధనం బుడిదలో పోసిన పన్నీరు!"మూడు రాజధానులనే ఒక అర్థం లేని నినాదంతో విశాఖపట్నంలో దాదాపు రూ. 500 కోట్ల ప్రజాధనాన్ని గత ప్రభుత్వం పూర్తిగా వృధా చేసింది. అప్పట్లో అక్కడ అన్ని కోట్లు ఖర్చు పెట్టి ఆర్భాటాలు చేసిన వైసిపి నేతలే, ఈ రోజు అక్కడ రాజధాని వద్దని స్వయంగా ఒప్పుకుంటున్నారు. ప్రజల సొమ్మును ఇంతలా దుర్వినియోగం చేసినందుకు వారికి ప్రజలే బుద్ధి చెబుతారు."2. 'మావిగాన్' కాదు.. తిరగేసి చదువు కుంటే అసలు రంగు బయటపడుతుంది!వైసిపి నేతల మాటల తీరుపై ఎంపీ బాలశౌరి తనదైన శైలిలో సెటైర్లు వేశారు.ఈ రోజున వాళ్ళు 'మావిగాన్' అంటున్నారు.రేపు పొద్దున 'గన్ వి మా' అంటారు. అసలు 'గన్ వి మా' అంటే ఏంటి అని ఎవరైనా ప్రశ్నిస్తే... "దాన్ని తిరగేసి చదువుకో" అంటారు! ఇదీ ప్రస్తుతం వైసిపి ఉన్న దారుణమైన పరిస్థితి అని, వారి మాటల్లోని డొల్లతనాన్ని ప్రజలు స్పష్టంగా అర్థం చేసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు.3. 'మావిగాన్' ఉన్నది CRDA పరిధిలోనే! వైసిపి చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొడుతూ... 'మావిగాన్' ప్రాంతం దాదాపుగా CRDA (అమరావతి రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ) పరిధిలోనే ఉందనే నిజాన్ని వైసిపి నేతలు ఇప్పటికైనా గ్రహించాలని బాలశౌరి హితవు పలికారు. చట్టబద్ధమైన అమరావతిని కాదని లేనిపోని డ్రామాలు ఆడటం మానుకోవాలన్నారు.4. చట్టం తన పని తాను చేసుకుపోతుంది: పోలీసుల అరెస్ట్ దీనికి నిదర్శనంకూటమి ప్రభుత్వం ఎక్కడా కక్షసాధింపు చర్యలకు దిగడం లేదని, కేవలం చట్టం ప్రకారమే ముందుకు వెళుతోందని ఎంపీ స్పష్టం చేశారు.సాయికృష్ణ మృతి కేసు: ఈ కేసులో చట్ట నిబంధనల ప్రకారమే విచారణ జరిపి, తప్పు చేసిన సిఐ నాగరాజుతో పాటు ఇద్దరు పోలీసులను కూటమి ప్రభుత్వం అరెస్ట్ చేయించింది.తప్పు ఎవరు చేసినా శిక్ష తప్పదని ప్రభుత్వం నిరూపిస్తుంటే, చట్టాన్ని అమలు చేయగానే అకారణంగా గగ్గోలు పెట్టడం వైసిపి కి ఒక అలవాటుగా మారిందని ఆయన విమర్శించారు.5. పవన్ కళ్యాణ్‌ను చూసి వైసిపికి కడుపుమంట!రాష్ట్రంలో కులాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ పబ్బం గడుపుకోవాలని వైసిపి కుట్రలు చేస్తోందని బాలశౌరి ఆరోపించారు."వైసిపి పన్నుతున్న కులాల కుట్రలను ముందే పసిగట్టి... జనసేన అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజలందరికీ అర్థమయ్యే రీతిలో వివరిస్తున్నారు. సమాజాన్ని విడగొట్టాలనే మీ వ్యూహాలను ఆయన తిప్పికొడుతుండటం వల్లే వైసిపి నేతలకు అంత కడుపుమంట."చట్టాన్ని గౌరవించడం నేర్చుకోండి!చివరగా ఆయన మాట్లాడుతూ, అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా దేశ అత్యున్నత చట్టసభ అయిన పార్లమెంట్‌లో చట్టం చేశారని గుర్తుచేశారు. వైసిపి నేత లు ఇప్పటికైనా రాజ్యాంగాన్ని, పార్లమెంట్ చట్టాలను గౌరవించడం నేర్చుకోవాలని హితవు పలికారు.



## విద్యార్థుల ఏకాగ్రత, విద్యా ఫలితాల మెరుగుదలకు యోగా, ప్రాణాయామం ఎంతో దోహదం చేస్తాయి: కలెక్టర్ డీకే బాలాజి

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

విద్యార్థుల్లో ఏకాగ్రత, క్రమశిక్షణ, మానసిక ప్రశాంతత పెంపొందించడంలో యోగా, ప్రాణాయామం అత్యంత ప్రభావవంతమైన సాధనాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి పేర్కొన్నారు. పామర్రు మండలంలోని పామర్రు మహిళా ప్రగతి కోచింగ్ సెంటర్‌లో సమగ్ర శిక్ష విద్యా శాఖ ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న యోగా శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బుధవారం పాల్గొన్నారు. జూన్ 30 నుంచి జూలై 6 వరకు ఏడు రోజులపాటు నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులతో కలిసి కలెక్టర్ యోగాసనాలు వేశారు.శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుతం పిల్లలు చదువుపై పూర్తిస్థాయిలో ఏకాగ్రత సాధించలేకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయని తెలిపారు. సరైన నిద్ర లేకపోవడం, మానసిక ఒత్తిడి, అనవసర ఆలోచనలు వంటి కారణాల వల్ల మనస్సు ఒక విషయంపై కేంద్రీకరించలేకపోతుందని చెప్పారు. ఏ పని చేస్తున్నామో దానిపైనే పూర్తిగా దృష్టి పెట్టడం అలవాటు చేసుకుంటే తక్కువ సమయంలోనే ఎక్కువ ఫలితాలు సాధించవచ్చని వివరించారు. విద్యార్థులు ఇంట్లో గంటల తరబడి చదవడం కంటే తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వినడం అత్యంత ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. తాను విద్యార్థిగా ఉన్న సమయంలో ట్యూషన్‌లో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను పూర్తి ఏకాగ్రతతో వినడం వల్ల మంచి మార్కులు సాధించానని తన అనుభవాన్ని ఉపాధ్యాయులతో పంచుకున్నారు. విద్యార్థులు తరగతి గదిలో శ్రద్ధగా వినే అలవాటు పెంపొందిదితే వారి విద్యా ఫలితాలు సహజంగానే మెరుగుపడతాయని అన్నారు.ప్రతి పాఠశాలలో ప్రతిరోజూ ఉదయం కొద్దిసేపు యోగా, ప్రాణాయామం చేయించి అనంతరం విద్యార్థులను తరగతులకు పంపిస్తే వారి ఏకాగ్రత గణనీయంగా పెరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

## "సర్" ఓట్ల తొలగింపు కోసం కాదు అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించేందుకే కార్యక్రమం

జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



జగ్గయ్యపేట , ప్రజాభూమి

ఓటర్ల తొలగింపు కోసం సర్ కార్యక్రమం కాదని అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించేందుకు ఇదో బృహత్తర అవకాశమని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా అన్నారు. సర్ కార్యక్రమం లో భాగంగా జగ్గయ్య పేట పట్టణంలోని 13 వ వార్డు విలియంపేట మరియు పట్టణంలోని విద్యానగర్ ప్రాంతాల్లో ఆయన సర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. పలు ఇళ్లకు వెళ్లి ఓటర్ల నమోదు తదితర అంశాలను అధికారులతో కలిసి పరిశీలించిన అనంతరం పలు సూచనలను చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ లక్ష్మిశ మాట్లాడుతూ జూన్ 15వ తేదీ నుంచి జూలై 14వ తేదీ వరకు సర్ కార్యక్రమం జిల్లాలో నిర్వహిస్తున్నామని ఓటర్ల తొలగింపు కోసం ఈ కార్యక్రమం కాదని అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించడ మే ఈ కార్యక్రమ యొక్క ప్రధాన ఉద్దేశం అనే స్పష్టం చేశారు. జిల్లాలో 17 లక్షల 30 వేల 445 మంది ఓటర్లకు గాను ఇప్పటివరకు 97% మందికి ఓటర్ల నమోదు పారాలు పంపిణీ పూర్తయిందని మూడు లక్షల 80 వేల మందికి అంటే 27% ఓటర్ల డిజిటలైజేషన్ కూడా పూర్తయినట్లు వివరించారు. బి ఎల్ వో లు ,బి ఎల్ ఏ లు ఓటర్ ఫారాలను ఓట ర్లకు అందించి దానిని ఎలా పూర్తి చేయాలి అనేది వివరించేందుకు అన్ని ఏర్పాట్లను చేసినట్లు వివరిం చారు. 2002 కి పూర్వమే ఓటర్లుగా నమో దైన వారు ఫారం పూర్తి చేసి ఫోటో అంటించి బిఎ ల్‌ఓ లకి అందించాలని, 2002 తరువాత ఓటర్లుగా నమోదు అయిన వారు తల్లిదండ్రులకు, లేదా బం ధు త్వానికి, లేదా ఇతర అంశాలకు సంబం ధిం చిన సమాచారంతో ఫారం పూర్తి చేయాలని, ఫారం పూర్తి చేసేటప్పుడు ఏమైనా సమస్యలు వస్తే బి ఎల్ వో లకు బిఎల్ఎ లకు అలానే సంబంధిత అధికారులకు ఎవరికైనా సరే ఫోన్ చేసి సమా చారం, సహకారం పొందవచ్చని తెలిపారు . ఆన్లై న్లో కూడా ఫారాన్ని పూర్తిచేసే అంశాన్ని వివరిం చా రు. జిల్లాలో నాలుగు లక్షల మంది మ్యాపింగ్ పూర్తి కాలేదని వీరిలో చనిపోయిన వారు వేరే ప్రాంతా నికి వెళ్ళిన వారు 10 శాతం మంది ఉంటార ని మిగితాల వారిని గుర్తించి ఓటర్ల నమోదు చేయిం చడం కోసం బిఎల్వోలు, బిఎల్ఏలు సంబంధిత అధికారులు సమన్వ యంతో కృషి చేయాలని అన్నారు. వేరే ప్రాం తంలో ఉన్న వారు ,విదేశాల్లో ఉన్నవారు ఓటర్ల నమోదు బంధువుల ద్వారా ఫారాన్ని తీసుకొని పూర్తి చేయించి సంబంధిత బిఎల్ఓ లకు అందజేయాలని విషయాన్ని బి ఎల్ ఓ లకు తెలియజేయాలని వివరించారు. ఓటును భద్రపరిచేందుకు జరిగే ఈ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల ని జిల్లా కలెక్టర్ లక్ష్మీశా పిలుపునిచ్చారు. ఓటు హక్కు కాపాడు కోవడం మన బాధ్యత అని దానికో సంప్రభుత్వం చేపట్టిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును భద్ర పరచు కోవాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశా కోరారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాద రావు, తాసిల్దార్ ఎస్ శిరీష, యార్డ్ చైర్మన్ మల్లెల కొండయ్య సీతమ్మ, 14 అవార్డు బి ఎల్ వో కౌన్సిల్ సభ్యులు నకరికంటి వెంకట్, మున్సిపల్ రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కూటమి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యం

**టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ**

**అవనిగడ్డ నియోజక వర్గ టీడీపీ విస్తృత స్థాయి సమావేశం**

**పాల్గొన్న రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా అధ్యక్షుడు వీరంకి గురుమూర్తి**



**ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు — పలువురు వైద్యులకు సన్మానం**

అవనిగడ్డ/ప్రజాభూమి ప్రతినిధి

కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి, కృష్ణా జిల్లా ఇంచార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షులు వీరంకి గురుమూర్తిలతో కలిసి కృష్ణా జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా గోపు సత్యనారాయణ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, రాబోయే ఎన్నికల్లో విజయానికి దిశా నిర్దేశం చేశారు. ఆయన ప్రసంగంలోని ముఖ్యమైన అంశాలు క్రింది విధంగా ఉన్నాయి:కీలక పిలుపు మరియు కార్యాచరణ:కార్యక్రమాల్లో భాగస్వా మ్యం: ప్రస్తుతం నియోజకవర్గంలో జరుగుతున్న SIR (సభ్యత్వ నమోదు) కార్యక్రమం లోను, అలాగే ఈ నెల 10వ తేదీ నుండి ప్రారంభం కాబోతున్న "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమంలోనూ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ చురుగ్గా పాల్గొని విజయవంతం చేయాలి.కూటమి ప్రభుత్వ విజ యా లు: గడిచిన రెండు సంవత్సరాలుగా కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ, ప్రతి గుండెకూ చేరేలా విస్తృతంగా ప్రచారం చేయాలి.స్థానిక ఎన్నికలే లక్ష్యం: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా, కార్యకర్తలంతా సమన్వయంతో, పట్టుదలతో పని చేయాలి.వైద్యులకు ఘన సన్మానంఈ రోజు "డాక్టర్స్ డే" (వైద్యుల దినోత్సవం) పురస్కరించుకుని, సమాజానికి వైద్యులు అందిస్తున్న సేవలను కొనియాడుతూ నియోజకవర్గ పరిధిలోని పలువురు ప్రముఖ వైద్యులను మంత్రి వాసంశెట్టి సుభాష్, గోపు సత్యనారాయణ మరియు వీరంకి గురుమూర్తిలు శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.హాజరైన ప్రముఖులు: ఈ విస్తృత స్థాయి సమావేశంలో అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, నియోజకవర్గంలోని అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో తెలుగు తమ్ముళ్లు (కార్యకర్తలు) పాల్గొన్నారు.



# దేవస్థానం రిటైర్డ్ ఉద్యోగులకు ఘన సత్కారం

## 30 ఏళ్ల సేవలను కొనియాడిన ఆలయ అధికారులు



ప్రజా భూమి ప్రతినిధి విజయవాడ

ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో సుదీర్ఘకాలం సేవలందించి, నిన్న (మంగళవారం) పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ఆలయ మహా మండపం 6వ అంతస్తులో ఘనంగా సత్కార కార్యక్రమం జరిగింది.దేవస్థానంలో 30 సంవత్సరాలకు పైగా నిరుపమానమైన సేవలు అందించిన బి. త్రినాథ్ (సీనియర్ అసిస్టెంట్), కె. పద్మజ (జూనియర్ అసిస్టెంట్) ల సేవలను ఆలయ అధికారులు ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రశం సించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్. రంగారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్. రమ, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ ( ఏ ఈ ఓ ఎస్ ) పి. చంద్రశేఖర్, డాక్టర్ కె. గంగాధర్ మరియు ఎం. తిరుమలేశ్వరరావు పదవీ విరమణ చేసిన సిబ్బంది యొక్క కర్తవ్య దీక్షను, ఆలయ అభివృద్ధికి వారు అందించిన సేవలను కొనియాడారు. వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో, ప్రశాంతంగా గడవాలని ఆకాంక్షించారు.పదవీ విరమణ చేసిన బి. త్రినాథ్, కె. పద్మజ దంపతులను ఆలయ అధికారులు శాలువాల తో ఘనంగా సత్కరించి, అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు మరియు నూతన వస్త్రాలను అందజేసి గౌరవించారు. దేవస్థాన అధికారులు, సూపరింటెండెంట్లు, తోటి సిబ్బంది మరియు పదవీ విరమణ చేసిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# ఘనంగా ఎఐఐఇఎ ప్లాటినం జూబ్లీ వేడుకలు

## ఎల్ఐసి ప్రగతికి పాటుపడతామని ఉద్యోగుల ప్రతిజ్ఞ



మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

దేశానికి ఆర్థిక కామధేనువైన ప్రభుత్వ రంగ బీమా సంస్థ ఎల్ఐసిని కంటికి రెప్పలా కాపాడుకుంటామని బీమా ఉద్యోగులు, అధికారులు, ఏజెంట్లు, పెన్షనర్లు స్పష్టం చేశారు. ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక ఎల్ఐసి డివిజనల్ కార్యాలయం వద్ద ప్లాటినం జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సంఘ పతాకావిష్కరణ, ఉద్యోగుల ప్రతిజ్ఞ, కొవ్వొత్తుల ప్రదర్శన కార్యక్రమాలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి.ఎల్ఐసి రక్షణలో 'ఎఐఐఇఎ' కీలక పాత్ర:ఈ వేడుకల్లో పాల్గొన్న ముఖ్య నాయకులు మాట్లాడుతూ 75 సంవత్సరాల క్రితం స్థాపించబడిన ఎఐఐఇఎ, బీమా రంగ జాతీయకరణ కోసం చేసిన నిరంతర కృషిని గుర్తు చేశారు. యాంత్రీకరణ, లాకౌట్లు, ఎల్ఐసి విభజన ప్రతిపాదనలు, ప్రైవేటీకరణ వంటి సవాళ్లపై రాజీలేని పోరాటాలు చేసి, ఎల్ఐసిని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలప డంలో ఉద్యోగులు కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఇటీవల జీవిత బీమా ప్రీమియంపై జీఎస్టీ రద్దు చేయించడంలో కూడా సిబ్బంది పోరాట పటిమ ఉందని గుర్తుచేశారు."ప్రజల సొమ్ము–ప్రజల కొరకే" అన్న నినాదంతో దేశాభివృద్ధికి, సామాజిక సంక్షేమ పథకాలకు, మౌలిక వసతులకు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడి సమకూర్చిన ఘనత ఒక్క ఎల్ఐసికే దక్కుతుంది. ప్రధాన డిమాండ్లు - అభిప్రాయాలు:విదేశీ పెట్టుబడులు వద్దు: పట్టాదారుల క్షేమం, దేశ హితం కోరి బీమారంగంలో విదేశీ పెట్టుబడులను అనుమతించకూడదు.వాటాల అమ్మకం చేటు: ఎల్ఐసిలో ప్రభుత్వ వాటాలను విక్రయించే ఆలోచన సంస్థ పురోభివృద్ధికి తీవ్ర నష్టం కలిగిస్తుంది.ప్రభుత్వ రంగంలోనే బలంగా: దేశ స్వావలంబనలో కీలక పాత్ర పోషిస్తున్న ఎల్ఐసి, ప్రభుత్వ రంగంలోనే మరింత బలంగా కొనసాగాల్సిన అవసరం ఉంది.విస్తృతంగా పాల్గొన్న సిబ్బంది:యూనియన్ లక్ష్యాలను మరింత ముందుకు తీసుకువెళ్లడం కోసం కట్టుబడి ఉంటామని ఈ సందర్భంగా ఉద్యోగులంతా ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో ఐసిఈయు (ICEU) మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి. కిషోర్ కుమార్ తో పాటు యూనియన్ నాయకులు వై. స్వామినాథ్, ఏ. మల్లికార్జున ప్రసాద్, ఏ. శ్రీనివాస రావు, ఎస్.వి. రత్నా రావు, బి.హెచ్. మాధుర్ పాల్గొన్నారు. అలాగే వివిధ సోదర సంఘాల నాయకులు కె. బుల్లయ్య, బి.హెచ్. వి.ఎల్. రాధా కృష్ణ మూర్తి, గణేష్ శర్మ, ఎస్. రాంబాబు పాల్గొని సంఘీభావ సందేశాలు ఇచ్చారు. ఈ వేడుకల్లో అన్ని తరగతుల ఉద్యోగులు, అధికారులు, ఏజెంట్లు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కృష్ణా జిల్లా వ్యాప్తంగా ఘనంగా 'స్వచ్ఛ పథం' కార్యక్రమం

## గూడూరు, మల్లవోలు పంచాయతీలలో జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి ఆకస్మిక తనిఖీలు

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం కృష్ణా జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో 'స్వచ్ఛ పథం' కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిం చారు. ప్రతి బుధవారం గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే లక్ష్యంతో చేపడుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించారు.ముఖ్య విశేషాలు: గూడూరులో చెత్తకుప్పల తొలగింపు: గూడూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రధాన సెంటర్‌లో ఉన్న చెత్తకుప్పను పారిశుధ్య సిబ్బందితో కలిసి అధికారులు స్వయంగా తొలగించారు. మల్లవోలు SWPC షెడ్ ఆకస్మిక తనిఖీ: గూడూరు మండలంలోని మల్లవోలు గ్రామ పంచాయతీ ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం (SWPC Shed) ను జిల్లా పంచాయతీ అధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు.అధికారుల కీలక ఆదేశాలు: "వర్మీ కంపోస్ట్ ఎరువును జల్లెడ పట్టి విక్రయించండి, ఆ నిధులను పంచాయతీ ఖాతాలో జమ చేయండి."— జిల్లా పంచాయతీ అధికారి, కృష్ణానిధుల సేకరణ: వర్మీ కంపోస్ట్ పిట్స్‌లో తయారైన వానపాముల ఎరువును వెంటనే జల్లెడ పట్టి, విక్రయించి, ఆ సొమ్మును గ్రామ పంచాయతీ నిధులకు జమ చేయాలని ఆదేశించారు.

హరిత వాతావరణం: SWPC షెడ్ ఆవరణలో ఉన్న చెత్తను తొలగించడంతో పాటు, షెడ్‌పై ప్రాకే నీడను ఇచ్చే మొక్కలను పెంచాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు.నిరంతర పర్యవేక్షణ: ప్రతి బుధవారం జరిగే 'స్వచ్ఛ పథం' కార్యక్ర మంపై మండలంలోని అన్ని గ్రామ పంచా యతీల కార్యదర్శులకు స్పష్టమైన సూచనలు ఇవ్వాలని, దీనిపై నిరంతరం పర్యవేక్షించాలని ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారిని ఆదేశించారు.'స్వచ్ఛ పథం' ముఖ్య ఉద్దేశాలు:గ్రామాల్లోని ప్రధాన, అంతర్గత రహదారులు, బహిరంగ ప్రదేశాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచడం.ప్రతి ఇల్లాలు/ఇంటి నుండి తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించి శాస్త్రీయ పద్ధతిలో వానపాముల ఎరువు (Vermi Compost) తయారు చేయడం.మురుగునీరు



నిల్వ ఉండకుండా డ్రెయినేజీలను క్రమం తప్పకుండా శుభ్రపరచడం.ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడం.హాజరైన అధికారులు:ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో కృష్ణా జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి (మచిలీపట్నం), డివిజనల్ పంచాయతీ అధికారి, ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి, బంటుమిల్లి మండల ప్రజా పరిషత్ అధికారులు మరియు సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



Printed by MOHANEESWARPUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at East Godavari and published at d.no.70-7-28/1A, KRISHNA NAGAR, SBI COLONY PARK RAMANAYYA PETA KAKINADA editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1470.cell:9502116677.

## కమీషనర్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ ని మర్యాదపూర్వకంగా కలిసిన మోడరన్ అధినేత జి.వి.రావు



ప్రజాభూమి ప్రతినిధి – రామచంద్రపురం

మోడరన్ విద్యాసంస్థల అధినేత లయన్ డాక్టర్ జి. వి. రావు బుధవారం మంగళగిరిలో కమిషనర్ ఆఫ్ కాలేజీయట్ ఎడ్యుకేషన్ డాక్టర్ నారాయణ భరత్ గుప్తాని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గత 48 సంవత్సరాలుగా మోడరన్ విద్యాసంస్థల ప్రస్థానాన్ని జి.వి.రావు ఆయనకు వివరించారు. సుమారు లక్ష మంది విద్యార్థులను మోడరన్ విద్యాసంస్థలు తీర్చిదిద్దిన వైనాన్ని డాక్టర్ భరత్ గుప్త ప్రత్యేకం గా అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులలో దాగివున్న ప్రతిభను వెలికి తీయటంలో జి. వి రావు చేస్తున్న కృషి అభినందనీయమని ఆయన కొనియాడారు. సమయానుకూలాన్ని అనుసరించి తాను మోడరన్ విద్యాసంస్థలకు వస్తానని డాక్టర్ భరత్ గుప్తా పేర్కొన్నట్లు రావు ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం మోడరన్ విద్యాసంస్థలకు సంబంధించిన మ్యాగజైన్ ని రావు ఆయనకు అందజేసారు.

# అత్యధికంగా పెన్షన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం మన ఆంధ్రప్రదేశ్

## రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి



ప్రజాభూమి ప్రతినిధి – నూజివీడు

జిల్లాలో 2,55,107 మంది ఫించన్లు దారులకు రూ 112.49 కోట్లు అందిస్తున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. నూజివీడు మండలం పడమర దిగవల్లి గ్రామంలో బుధవారం పేదలు సేవలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను ఇంటింటికి వెళ్ళి కుటుంబ సభ్యులను ఆప్యాయతగా పలకరిస్తూ, గ్రామ, వ్యక్తిగత సమస్యలను అడిగి తెలుసుకుని కొన్ని సమస్యలను అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కారం చేసారు. కొంత మంది ప్రజలు ఇచ్చిన అర్జీలను స్వీకరించి, రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారధి పింఛన్ల సొమ్మును లబ్ధిదారులకు అందజేశారు. ముందుగా మహిళలు, గ్రామప్రజలు మంత్రి కొలుసు పార్థసారధి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ భారత దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా ఎన్టీఆర్ బరోసా సామాజిక పెన్షన్లు అత్యధికంగా అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు అపార అనుభవం, పరిపాలనా ధక్షతతో రాష్ట్రాని గాడిలో పెడుతూ పేదలు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. ఎన్నికలు సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుని పెన్షన్లు పెంచి అందచేస్తున్నామని అన్నారు. కేంద్రప్రభుత్వం నుండి మొదటి విడతగా రాష్ట్రానికి 80 వేలు ఇండ్లు త్వరలో మంజూరు కానున్నాయని, గ్రామీణ ప్రాంతాలకు మొదటి ప్రాధాన్యతను ఇస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో అర్హులకు పింఛన్లు మంజూరుకు ముఖ్యమంత్రి ఆలోచన చేస్తున్నారని, త్వరలో నిర్ణయం తీసుకోబోతున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో వెయ్యి రూపాయలు పెంచడానికి ఐదు సంవత్సరాలు సమయం పడితే, తొలి సంతకంతో పెన్షన్లు మొత్తాన్ని పెంచామన్నారు. ప్రతీ నెల మొదటి తేదీనపెన్షన్లుదారులు ఇంటింటికి వెళ్ళి ఉదయాన్నే పెన్షన్లు సొమ్మును అందించడం జరుగుతుందని తెలిపారు. 1వ తేదీ ఆదివారం సెలవు వస్తే ఒకరోజు ముందుగానే పింఛన్లు సొమ్ము అందిస్తున్నామని అన్నారు. పేదలుపట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో కేవలం రూ 600 నుండి రూ 2 వేలు పింఛన్లు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. మన రాష్ట్రంలో వృద్ధులకు రూ 4 వేలు, దివ్యాంగులకు రూ 6 వేలు, కిడ్నీ ఇతర వ్యాధి గ్రస్తులకు రూ 10 వేలు, మంచానికే పరిమితమైన వారికి రూ 15 వేలు అత్యధిక మొత్తంలో ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు అందించి ఆ కుటుంబాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అండగా నిలుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు షేక్ సంసిద్దీన్, వివిధ శాఖలు అధికారులు, స్వర్ణగ్రామ సచివాలయ, వివిధ శాఖలు సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, మండల ప్రముఖులు, గ్రామ నాయకులు, కూటమి నాయకులు, వివిధ సామాజిక పింఛన్లు లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## పడమర ధిగవల్లి గ్రామానికి వరాల జల్లు



ప్రజాభూమి ప్రతినిధి – నూజివీడు

నూజివీడు మండలం పడమర ధిగవల్లి పర్యటన లో భాగంగా ప్రతి ఒక్కరిని పేరు పేరునా పలకరిస్తూ గ్రామ, కాలనీ సమస్యలు తెలుసుకుంటూ వెంటనే సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశించిన రాష్ట్ర మంత్రివర్యులు కొలుసు పార్థసారథి. గ్రామంలోని ప్రతి ఒక్కకార్యకర్తను,నాయకులను ప్రజలను, అవ్వా తాతలను ఆప్యాతగా పలకరిస్తూ వారి సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించిన మంత్రివర్యులకు వచ్చిన సమస్యల్లో ముఖ్యంగా ఎన్, ఆర్, జి, ఎస్, జాబ్ కార్డులు, ఇళ్ల నిర్మాణం, పింఛన్లు, రోడ్లు,డ్రైనేజి, త్రాగునీరు, వీధి దీపాలు,సమస్యలను మంత్రి వర్యులకుతెలియజేసారు. గ్రామానికి చెందిన కొమ్ము రత్నకుమారి, సంజీవరావులు మేము గతంలో ఎన్, ఆర్, జి, ఎస్, జాబ్ కార్డులకు అర్జీ పెట్టుకోగా ఇవ్వకుండా అధికారులు జాప్యం చేస్తున్నారని పిర్యాదు చేయగా వెంటనే కార్డులను అందించాలని అధికారులకు ఆదేశించిన మంత్రి.కె, శారమ్మ ఇళ్ళు, నిర్మించమని కోరగా వెంటనే ఇళ్ళు మంజూరు చేయమని అదేదించారు. ఎస్, సి, కాలనీ వాసులు, త్రాగునీరు, లైట్లు, రోడ్లు డ్రైనేజీ సమస్యలను మంత్రివర్యులకు తెలియజేయవగా వారంలో సమస్యలను పరిష్కరించి త్రాగునీరు శాశ్వత పరిష్కారానికి 5హెచ్ పి మోటారు నిర్మించాలని అధికారులకు ఆదేశించిన మంత్రి.భూలక్ష్మికి ఇళ్ళు మంజూరు చేయాలని అధికారులకు అదేదించిన మంత్రివర్యులు. తమ గోడు విన్నపించుకున్న వెంటనే స్పందించి తక్షణమే పరిష్కార మార్గం చూపుతున్న మంత్రివర్యులకు గ్రామస్తులు కార్యకర్తలు నాయకులు తమ కృతజ్ఞతలు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## తగ్గిపోతున్న జననాల రేటు

- పెరిగిపోతున్న వృద్ధుల శాతం
- పెళ్లిళ్లు పట్ల యువత నిరాశక్తత
- భారతదేశ భవిష్యత్తు ప్రశ్నార్థకం
- 20, 25 ఏళ్లకే నిర్భంధ పెళ్లిళ్లు నిబంధన పెట్టాలి



ప్రజాభూమి ప్రతినిధి – పాలకొల్లు

భారతదేశం ప్రస్తుతం జనాభా 148 కోట్లుతో అత్యధిక జనాభా గల దేశంగా పేరున్నప్పటికీ రాబోయే కాలంలో జననాల రేటు దారుణంగా పడిపోతుందనే ఆందోళన చెందుతున్నారు. దీనివల్ల యువ జనాభా రేటు దారుణంగా పడిపోతుందని మేధావులు ఆందోళన చెందుతున్నారు. వృద్ధుల శాతం పెరిగిపోయే అవకాశం ఉందని అంటున్నారు.

**పెళ్లిళ్ల పట్ల యువత నిరాశక్తతవల్లే:** ఇటీవల కాలంలో యువతీ యువకులు పెళ్లిళ్లు తర్వాత కొందరు ముందుగా కూడా ఒకరిని ఒకరు హత్య చేసుకోవడంతో పెళ్లి చేసుకున్న తర్వాత అభద్రత భావం పెరిగిపోయింది. దీంతో పెళ్లిళ్లపట్ల నిరాశక్తతో యువతీ యువకులు ఉండడంతో శిషు జనాల రేటు తీవ్రంగా పడిపోయే అవకాశం ఉందని విశ్లేషకులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని గ్రామాలలో అయితే 20,30 మంది యువకులు పెళ్లి చేసుకుందాం అనుకున్న యువతులు దొరక్క పెళ్లి కాకుండానే బ్రహ్మచర్యులుగా ఉండి పోవాల్సిన దుస్థితి నెలకొంది. ఫలితంగా అక్కడ జనాభా తగ్గుదలకు కారణంగా కనిపిస్తోంది.

**యువ జనాభా లేకపోతే దేశ భవిష్యత్తు ప్రశ్నార్థకమే! :** దేశంలో యువ జనాభా తగ్గిపోతే ఆ దేశ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని మేధావులు భావిస్తున్నారు. జపాన్ మాదిరిగా ఇతర దేశాల నుంచి యువకులను ఉద్యోగ వాళ్ల కోసం తెచ్చుకుందాం అంటే దేశ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. అలాంటి సమయంలో దేశ భద్రత కాపాడేది ఎవరని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 20, 25 ఏళ్లకే నిర్భంద పెళ్లిళ్ల నిబంధన అమలు చేయాలి. భారతదేశంలో ఆడవాళ్లకు 20 సంవత్సరాలు, మగ పిల్లలకు 25 ఏళ్లలోపు నిర్బంధ వివాహాలు నిబంధన పెట్టాలని మేధావులు సూచిస్తున్నారు. దీనికోసం కొన్ని రాయితీలు కూడా ఇవ్వాల్సిన అవసరం ఉందని అంటున్నారు. రాబోయే కాలంలో దేశ భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని ప్రధానమంత్రి మోడీ, రాష్ట్రాల సీఎంలు యుద్ధ ప్రాతిపదికన నిర్ణయం తీసుకోవాలని మేధావి వర్గం సూచిస్తోంది.

## నేడు ఆర్జీయూకేటీ నూజివీడు క్యాంపస్‌లో పీయూసీ-1 విద్యార్థులకు ఓరియంటేషన్



ప్రజాభూమి ప్రతినిధి – నూజివీడు

ఆర్జీయూకేటీ నూజివీడు క్యాంపస్‌లో 2026 బ్యాచ్‌కు చెందిన పీయూసీ–1 నూతన విద్యార్థులకు బుధవారం (జూలై 2) ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. శాక్ ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు విశ్వవిద్యాలయ విద్యా విధానం, క్యాంపస్‌లోని సౌకర్యాలు, క్రమశిక్షణ, విద్యార్థి సంక్షేమ కార్యక్రమాలు, భవిష్యత్ విద్యా ప్రణాళికలపై సమగ్ర అవగాహనకల్పించనున్నారు. ఈ ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని రెండు బ్యాచ్‌లుగా విభజించి మొదటి ఐదువందల మందికి ఉద్యం పూట, మరో ఐదువందల మందికి మధ్యాహ్న నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు గౌరవ ఉపకులపతి ఆచార్య మద్దాలి లక్ష్మీ నారాయణరావు, క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య గోపాలరాజులు నూతన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించి విశ్వవిద్యాలయం ఆశయాలు, విద్యార్థులు పాటించాల్సిన విలువలు, విద్యలో రాణించేందుకు అనుసరించాల్సిన మార్గాలపై దిశానిర్దేశం చేయనున్నారు. అనంతరం డీన్ (అకాడెమిక్స్) కోర్సు నిర్మాణం, అకడమిక్ క్యాలెండర్, బోధనా విధానం, పరీక్షల నిర్వహణ, క్రెడిట్ వ్యవస్థ, విద్యార్థుల పనితీరు అంచనా తదితర అంశాలను వివరించనున్నారు. తదుపరి డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ (డ్స్వ), అసిస్టెంట్ రిజిస్ట్రార్ (ఆబు), బాలుర, బాలికల హాస్టళ్ల చీఫ్ వార్డెన్లు, చీఫ్ కోఆర్డినేటర్ విద్యార్థులకు హాస్టల్ సౌకర్యాలు, భోజన ఏర్పాట్లు, క్రమశిక్షణా నిబంధనలు, విద్యార్థి సంక్షేమ సేవలు, అత్యవసర సహాయ వ్యవస్థ, క్యాంపస్‌లో అందుబాటులో ఉన్న ఇతర సదుపాయాలపై అవగాహనకల్పించనున్నారు.అదేవిధంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (శ్బి) అధికారులు బ్యాంకింగ్ సేవలు, ఖాతాల నిర్వహణ, డిజిటల్ లావాదేవీలపై వివరించనుండగా, పోస్టాఫీస్ అధికారులు పోస్టల్ సేవల గురించి తెలియజేస్తారు. పోలీసు శాఖ ప్రతినిధులు విద్యార్థుల భద్రత, సైబర్ నేరాల నివారణ, చట్టపరమైన అవగాహన, ట్రాఫిక్ నిబంధనలు వంటి అంశాలపై సూచనలు అందించనున్నారు. అనంతరం వివిధ విభాగాల అధిపతులు (హెడ్స్) తమ శాఖల ప్రత్యేకతలు, విద్యా అవకాశాలు, పరిశోధన, ప్రయోగశాలల వినియోగం తదితర అంశాలను విద్యార్థులకు వివరిస్తారు. మధ్యాహ్న భోజన విరామం అనంతరం నూతన విద్యార్థులకు ప్రత్యేకంగా క్యాంపస్ టూర్ నిర్వహించనున్నారు. ఇందులో అకడమిక్ భవనాలు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, హాస్టళ్లు, క్రీడా మైదానాలు, ఆరోగ్య కేంద్రం, ఇతర మౌలిక సదుపాయాలను సందర్శించే అవకాశం కల్పించనున్నారు. ఈ ఓరియంటేషన్ కార్యక్రమం ద్వారా నూతన విద్యార్థులు విశ్వవిద్యాలయ వాతావరణానికి త్వరగా అలవాటు పడడంతో పాటు విద్యా, వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ,బాధ్యతాయుతమైన విద్యార్థి జీవితంపై సమగ్ర అవగాహన పొందుతారని విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పరిపాలనా అధికారులు, సిబ్బంది పాల్గొని విద్యార్థులకు అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు అందించనున్నారు. ఉప కులపతి, డైరెక్టర్ల ఆధ్వర్యంలో జరిగే ఈకార్యక్రమంలో అకడమిక్ డీన్ డా. చిరంజీవి, పరిపాలనాధికారి డా. లక్ష్మణరావు, డీఎస్డ్బ్ల్యు బోయ్స్ డా. రాజేష్, డీఎస్డ్బ్ల్యు గాల్స్ డా దుర్గాభవాని, చీఫ్ వార్డెన్ సురేష్, ఇంకా ఇవిధ శాఖాధిపతులు, అధ్యాపకులు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొంటారు.

## క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తిస్తే ప్రాణాలను కాపాడుకోవచ్చు



ప్రజాభూమి ప్రతినిధి – ఆగిరిపల్లి

ఆగిరిపల్లిలోని ఎంవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం నూజివీడు మామిడి పట్టణ రోటరీ సంఘం ఆధ్వర్యంలో, హైదరాబాద్ బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి, పరిశోధన సంస్థ వైద్య బృందం సహకారంతో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని రోటరీ జిల్లా మాజీ గవర్నర్ కామినేని పట్టాభిరామయ్య ప్రారంభించారు. మొత్తం 130 మంది రోగులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి తదుపరి పరీక్షలు, చికిత్స కోసం వైద్యులు సూచనలు చేశారు. అనంతరం బసవతారకం ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కే. రవిశంకర్, డాక్టర్ శ్రీవల్లి విద్యార్థులకు క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలు, ముందస్తు నిర్ధారణ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జూలై 2న చట్రాయి, 3న ముసునూరు, 4న నూజివీడు రోటరీ సభామందిరంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ రవికుమార్, డాక్టర్ శ్రీవల్లి, డాక్టర్ సురేఖ, డాక్టర్ గిరీష్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నక్కనబోయిన వేణు, రోటరీ సంఘం అధ్యక్షుడు బోయపాటి ముఖర్జీ, కార్యదర్శి మల్లిశెట్టి శ్రీనివాస్, యార్లగడ్డ రాజగోపాల్, సజ్జా శశికాంత్, మండా శ్రీనివాస్, మూల్పూరి లక్ష్మణస్వామి, పి.డి. వెంకటరత్నం, పొట్లూరి ప్రసాద్, పైడి అనిల్, శోభనాద్రి తదితరులు పాల్గొన్నారు.

## దేవోక్తి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముగ్గురు దివ్యాంగులకు ఉచిత రోబోటిక్ కాళ్ల పంపిణీ



ప్రజాభూమి ప్రతినిధి – తాళ్లపూడి

దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపే లక్ష్యంతో దేవోక్తి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముగ్గురు దివ్యాంగులకు ఉచితంగా రోబోటిక్ కృత్రిమ కాళ్లు అందజేశారు. గన్నవరంలోని ఓ ప్రైవేట్ సంస్థ సహకారంతో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా గండేపల్లికి చెందిన గడప దుర్గాప్రసాద్, రాజమహేంద్రవరానికి చెందిన షేక్ జాహిద్, రావులపాలెంకు చెందిన తోట వేణు ఐశ్వర్య ప్రియాలకు ఉచితంగా రోబోటిక్ కాళ్లు అమర్చించారు. లబ్ధిదారుల ప్రయాణ ఖర్చుల కోసం పసలపూడి రాఘవ రూ.700, ఎల్ఐసీ ప్రతినిధి చిట్యాల రాధాకృష్ణ రూ.500, ఉపాధ్యాయుడు రాజశేఖర్ రూ.500, బజాజ్ ఏరియా మేనేజర్ వేములూరి రమేష్ రూ.500, పోలీస్ శాఖకు చెందిన కొడమంచిలి విష్ణు రూ.500 చొప్పున ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో దేవోక్తి ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు ప్రత్తిపాటి నాగరాజు పాల్గొన్నారు. దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అవసరమైన వారు 9391089381 నంబర్‌ను సంప్రదిస్తే ఉచితంగా అందజేస్తామని ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.

## నూతన ఫింక్షన్ అందించిన ఎంపీడీవో, టీడీపీ నాయకులు



ప్రజాభూమి ప్రతినిధి – వి.ఆర్.పురం.

మండలంలోనీ వడ్డెగూడెం పంచాయతీ విఆర్ పురం గ్రామానికి చెందిన రాయల కాంతమ్మకు ఎన్‌టీఆర్ భరోసా ఫౌజ్ పెన్షన్ మంజూరు కావడం జరిగింది. ఎంపీడీవో, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బొర్ర నరేష్ కుమార్ చేతుల మీదుగా ఈ నూతన పెన్షన్ ను బుధవారం లబ్ధిదారు గాలికి అందించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వమంటే బడుగు బలహీన వర్గాలకు పేద కుటుంబాలకు అండగా ఉంటుందని అన్నారు. యూనిట్ ఇన్చార్జ్ బొర్రా నరసింహారావు, సూరిబాబు, గ్రామ పంచాయతీ సెక్రటరీ ప్రసాద్, శివాలయం చైర్మన్ బొర్రా ఆదినారాయణ, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి గ్రామసభలు దోహదం -తాసిల్దార్ ముక్తేశ్వరరావు



ప్రజాభూమి ప్రతినిధి – కొత్తపేట

సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు ఎంతో దోహదపడతాయని రావుపాలెం తాసిల్దార్ బి.ఎమ్.ముక్తేశ్వరరావు తెలిపారు. వార్షిక గ్రామసభలలో భాగంగా రావులపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద ఆ గ్రామ ప్రత్యేక అధికారిగా ఉన్న తాసిల్దార్ ముక్తేశ్వరరావు అధ్యక్షతన బుధవారం గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభల్లో ఆమోదించే అనేక పనుల పరిష్కారానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. ప్రస్తుతం స్వర్ణ పంచాయతీ ద్వారా ఎంతో పారదర్శకంగా గ్రామపంచాయతీలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా సర్ కార్యక్రమంలో ఓట్ల పరిశీలనకు అందరూ సహకరించాలని సూచించారు. గృహ నిర్మాణాల విషయంలో అధికారులు, ఉద్యోగులు లబ్ధిదారులకు తగిన సహాయ సహకారాలు అందించాలని, నిబంధనలు పేరుతో వేధించడం సరికాదని జిల్లా తెలుగు యువత అధ్యక్షులు చిలువూరి సతీష్ రాజు, సీనియర్ టిడిపి నేత గుత్తుల పట్టాభి రామయ్యలు సూచించారు. అలాగే ప్రమాదాల నివారణకు హైవేపై ఆర్టీసీ బస్టాండ్ వద్ద డివైడర్ మూసివేత వల్ల గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని, బస్సులు వంటి పెద్ద వాహనాలు మాట ఎలా వున్నా ప్రజలు, ద్విచక్ర వాహన దారులకు వీలుగా అక్కడ వెసులుబాటు కలిపించే విధంగా గ్రామ సభలో తీర్మానం చేయాలని తోట చంద్రశేఖర్ కోరారు. గ్రామ పంచాయతీ ద్వారా చేపట్టే కార్యక్రమాలను పంచాయతీ అభివృద్ధి అధికారి ఎల్.దుర్గా ప్రసాద్ గ్రామ సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కుడిపూడి శ్రీనివాసరావు, కూటమి నాయకులు కొవ్వూరి వెంకట కృష్ణారెడ్డి, కొవ్వూరి వెంకట సత్యనారాయణ రెడ్డి, కోట వెంకటేశ్వరరావు, పులగం శ్యామసుందర్ రెడ్డి, సూరంపూడి బాలరాజు, కోట శ్రీహరి, పడాల కృష్ణారెడ్డి గ్రామపంచాయతీ, స్వర్ణ గ్రామం ఉద్యోగులు, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

ప్రజాభూమి



# ప్రకాశం బ్యారేజ్ నుండి కృష్ణా జలాలకు నీటి విడుదల

- కృష్ణా డెల్టా రైతాంగానికి మేలు చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యం
- 13.08 లక్షల ఎకరాల ఆయుకట్టు ద్వారా 30 లక్షల మంది రైతులకు ప్రయోజనం
- జిల్లా కలెక్టర్ డా. జి లక్ష్మీశ



**ప్రజాభూమి ప్రతినిధి - విజయవాడ**

రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఇందులో భాగంగా డెల్టా కాలువలపై ఆధారపడిన రైతులకు సకాలంలో సాగు నీరు అందించేందుకు సకాలంలో నీటిని విడుదల చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. కృష్ణా డెల్టా రైతాంగానికి సకాలంలో సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రకాశం బ్యారేజ్‌లోని కృష్ణా ఈస్ట్రన్ మెయిన్ హెడ్ రెగ్యులేటర్ నుంచి బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి తూర్పు, పశ్చిమ కాలువలకు 3,200 క్యూసెక్కుల సాగునీటిని అధికారికంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణమ్మ తల్లికి పసుపు, కుంకుమ, చీర, సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ.. ఇటీవల నిర్వహించిన 'ఏరువాక పౌర్ణమి' కార్యక్రమానికి కొనసాగింపుగా కృష్ణా డెల్టా రైతులకు సాగునీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. కృష్ణా డెల్టా పరిధిలోని సుమారు 13.08 లక్షల ఎకరాల ఆయకట్టు భూములకు దాదాపు 30 లక్షల మంది రైతులకు ఈ నీటి విడుదల ద్వారా సకాలంలో పంటలు వేసుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జలాధార--జలహారతి' కార్యక్రమంలో భాగంగా కాలువల మరమ్మతులు, పూడికతీత పనులు పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. భూగర్భ జలాల రీఛార్జ్ కు కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. రైతులకు ఎలాంటి నీటి కొరత లేకుండా సకాలంలో సాగునీరు అందించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ సంకల్పమని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. రాష్ట్ర సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షులు ఆళ్ల గోపాలకృష్ణారావు మాట్లాడుతూ.. నీటి క్యాలెండర్ ప్రకారం జూలై 1న కృష్ణా డెల్టాకు సాగునీటిని విడుదల చేయడం రైతులకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. జూలై చివరి నాటికి వరి నాట్లు పూర్తి చేయడం ద్వారా నవంబర్‌లో వచ్చే తుఫానుల ప్రభావం నుంచి పంటలను రక్షించుకోవచ్చన్నారు. కృష్ణా డెల్టా కాలువల పూడికతీత, కట్టల బలపరిచేందుకు ఓ అండ్ ఎం నిధుల కింద రూ. 64 కోట్లు ఖర్చు చేశామని, రాష్ట్రవ్యాప్తంగా రూ. 425 కోట్లు కేటాయించామని తెలిపారు. ప్రస్తుతం పులిచింతలలో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగిస్తూ, జూలై లో పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను తరలించి కృష్ణా డెల్టాకు నీటి కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ మాట్లాడుతూ.. రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఇప్పటికే రైతుల ఖాతాల్లో 'అన్నదాత సుఖీభవ' పథకం కింద పెట్టుబడి సాయం జమ చేశామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి, నీటి సంరక్షణ, కాలువల అభివృద్ధి వంటి కార్యక్రమాల ద్వారా రైతులకు శాశ్వత ప్రయోజనం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 'ఎల్‌నినో' ప్రభావం వల్ల వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు నీటిని పొదుపుగా వినియోగించాలని, నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని నాయకులు, అధికారులు రైతులకు విజ్ఞప్తి చేయాలన్నారు. అందుబాటులో ఉన్న నీటిని మొదట తాగునీటి అవసరాలు, అనంతరం సాగు అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రానున్న ఖరీఫ్‌లో సమృద్ధిగా పంటలు పండాలని, రైతులందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, జలవనరుల శాఖ ఎస్ఈ జే. గుణకరరావు, సీఈ బి. రాంబాబు, కేసీ డివిజన్ ఈఈ ఆర్. రవికిరణ్, కేఈ డివిజన్ ఈఈ ఆంజనేయ ప్రసాద్, ఇరిగేషన్ అధికారులు ఎల్. కృష్ణ ప్రసాద్, కే. బాబు, పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యద ర్శి పి. శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## ఈ ఆత్మీయత మరువలేనిది..

- విజయవంతంగా క్షేత్ర పర్యటన ముగించుకున్న మాల్దీవుల బృందం
- ఘనంగా వీడ్కోలు పలికిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**ప్రజాభూమి ప్రతినిధి - విజయవాడ**

మాల్దీవుల ఐలాండ్ కౌన్సిళ్లకు ఎన్నికైన 26 మంది ప్రతినిధుల బృందానికి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎన్ఐఆర్‌డీ–హైదరాబాద్) ప్రస్తుతం శిక్షణ అందిస్తోంది. ఇందుకు సంబంధించి క్షేత్ర సందర్శనల్లో భాగంగా ఈ బృందం ఈ నెల 28వ తేదీ నుంచి ఎన్‌టీఆర్ జిల్లాలో పర్యటించింది. ఈ పర్యటన విజయవంతంగా ముగించుకొన్న బృందానికి కలెక్టర్ లక్ష్మీశ బుధవారం ఉదయం భవానీపురంలోని ఆలివ్ ట్రీ హోటల్ వద్ద జ్ఞాపికలు అందించి వీడ్కోలు పలికారు. పర్యటన సందర్భంగా జిల్లా యంత్రాంగం అందించిన ఆతిథ్యం, అధికారులు కల్పించిన సహకారం, గ్రామీణ ప్రజలు చూపిన ఆప్యాయత పట్ల మాల్దీవుల బృందం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో అమలవుతున్న ప్రజాకేంద్రిత కార్యక్రమాలు, గ్రామస్థాయి పాలన, ప్రజల భాగస్వామ్యం తమను విశేషంగా ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. ఈ పర్యటనలో పొందిన అనుభవాలు తమ దేశంలో కూడా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఐఆర్‌డీ – హైదరాబాద్ సమన్వయకర్తలు అరుణ్‌రాజ్, శిరీష, జిల్లా పంచాయతీ అధికారి సీతామహాలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు పాల్గొన్నారు.

## ఈ నెల 3 తారీఖు లోగా గురుకుల పాఠశాలల్లో చేరాలి

- గడువులోగా చేరని విద్యార్థుల సీట్లు రద్దు
- కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల సమన్వయ అధికారి ఎ. మురళీకృష్ణ



**ప్రజాభూమి ప్రతినిధి - విజయవాడ**

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల పరిధిలోని డాక్టర్ బి.ఆర్.అం బేద్కర్ గురుకుల విద్యాలయాలలో ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థులు, విద్యార్థినులు తమకు కేటాయించబడిన పాఠశాలల్లో ఈ నెల 3వ తేదీ (శుక్రవారం) లోగా తప్పనిసరిగా చేరాలని కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల సమన్వయ అధికారి ఎ.మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. నిర్దేశిత గడువులోగా సంబంధిత పాఠశాలల్లో చేరని పక్షంలో, వారికి కేటాయించిన సీట్లు రద్దు చేయబడతాయని ఆయన స్పష్టం చేశారు. ఖాళీ అయిన సీట్లను తదుపరి మెరిట్ జాబితాలో ఉన్న అర్హులైన అభ్యర్థులకు కేటాయించడం జరుగుతుందని పేర్కొన్నారు. అందువల్ల ఎంపికైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి, గడువులోగా సంబంధిత గురుకుల పాఠశాలల్లో చేరి ప్రవేశ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సమన్వయ అధికారి ఎ. మురళీకృష్ణ సూచించారు.

## అనుమానాస్పద స్థితిలో వివాహిక ఆత్మహత్య



**ప్రజాభూమి - బుట్టాయగూడెం**

స్థానిక కుమ్మరి గట్టు నివాసిత ప్రాంతంలో ఒక వివాహిత అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బుట్టాయగూడెం శివారు కుమ్మరి గట్టుకు చెందిన చెగ్గం జ్యోతి(24) తల్లిదండ్రులు ఇంటి వద్ద బుధవారం మధ్యాహ్నం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. జ్యోతికి సుమారు ఐదేళ్ల క్రితం టి. నరసాపురం మండలం గంగినీదుపాలెంకు చెందిన చెగ్గం మహేష్ మహేష్ తో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తలెత్తిన మనస్పర్ధల కారణంగా రెండు రోజుల క్రితం గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకోవడానికి జ్యోతి ప్రయత్నించింది. ఈ ప్రయత్నాన్ని రాజమండ్రి పోలీసులు తమకందిన సమాచారం మేరకు సకాలంలో స్పందించి, జ్యోతిని ఆత్మహత్య ప్రయత్నం నుండి రక్షించి, కౌన్సిలింగ్ ఇచ్చి భర్త మహేష్ కు అప్పగించారు. మహేష్ తన భార్యను కుమ్మరిగట్టు వద్ద తల్లిదండ్రుల ఇంటికి చేర్చి, తన స్వగ్రామం గంగినేని పాలెం వెళ్లినట్లు సమాచారం. తల్లిదండ్రుల ఇంటి వద్ద ఉన్న జ్యోతి అనుమానాస్పద స్థితిలో బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరి వేసుకుని, ఆత్మహత్యకు పాల్పడి, మృతి చెందింది. తమకు అందిన సమాచారంతో స్థానిక ఎస్సై చెన్నారావు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని, సంఘటనపై కేసు నమోదు చేసి, మృతదేహాన్ని జంగారెడ్డిగూడెం పోస్టుమార్టంకు తరలించారు.

## మన ఓటు భద్రత కోసమే సర్.. జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా ప్రక్రియ

- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**ప్రజాభూమి ప్రతినిధి - విజయవాడ**

ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) అనేది మన ఓటు భద్రత కోసమేనని.. జిల్లా వ్యాప్తంగా ఈ ప్రక్రియ పకడ్బందీగా జరుగుతోందని, అపోహలు, అనవసర ఆందోళన వీడి ఇందులో కీలక భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ లక్ష్మీశ బుధవారం జగ్గయ్యపేట నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో పర్యటించి సర్ ప్రక్రియలో భాగంగా ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ, డిజిటైజేషన్ దశలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతిఒక్కరూ ఓటర్ల జాబితాలో ఉండటంతో పాటు దోషరహిత ఓటర్ల జాబితా రూపకల్పనకు సర్ ప్రక్రియ ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా జరుగుతోందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 16,59,166 (96.83 శాతం) ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ జరిగిందని, ఇదేవిధంగా 4,58,675 (26.77 శాతం) ఫారాల డిజిటైజేషన్ పూర్తయిందని తెలిపారు. ఫారాలు నింపడంలోగానీ ఏవైనా సందేహాల నివృత్తికిగానీ క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలు అందుబాటులో ఉన్నారని, అదేవిధంగా బీఎల్ఏల సహాయం కూడా తీసుకోవచ్చన్నారు. ప్రక్రియకు సంబంధించి నియోజకవర్గాల్లో నిరంతరం పర్యవేక్షించడం జరుగుతోందని ఎక్కడా ఎలాంటి ఇబ్బందిగానీ పొరపాట్లకు తావులేకుండా చూస్తున్నట్లు పేర్కొన్నారు. చివరిసారిగా 2002లో సర్ జరిగిందని.. నాటి ఓటర్ల జాబితా ప్రాతిపదికన ప్రస్తుత జాబితా పరిశీలన జరుగుతోందన్నారు. ఈసీఐ వెబ్‌సైట్లో నూ సెర్చ్ యువర్ నేమ్ ఇన్ లాస్ట్ ఎస్ఐఆర్ ఆప్షన్ ఉందని.. సమాచారం కోసం దీన్ని కూడా ఉపయోగించుకోవచ్చని సూచించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో ఓటర్లకు మెరుగైన సేవలు అందించేందుకు భారత ఎన్నికల సంఘం హెల్ప్‌డెస్క్ (1950 హెల్ప్ లైన్) అందుబాటులో ఉందని.. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. అదేవిధంగా నియోజకవర్గ స్థాయిలోనూ హెల్ప్‌డెస్క్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఓటర్లకు అవసరమైన సమాచారం, మార్గదర్శకత్వం, సమస్యల పరిష్కారం కోసం ఈ టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ హెల్ప్‌లైన్ ద్వారా ఓటరు నమోదు, ఓటరు జాబితాకు సంబంధించిన సందేహాలు, ఫిర్యాదులను పరిష్కరించుకోవచ్చని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు.

## ఆగిరిపల్లిలో 90 శాతం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ పూర్తి



**ప్రజా భూమి ప్రతినిధి - ఆగిరిపల్లి**

ఆగిరిపల్లి మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ 90 శాతం పూర్తయ్యిందని, గ్రామాంతరాలకు వెళ్లిన లబ్ధిదారులకు గురువారం పెన్షన్లు అందజేస్తామని మండల అభివృద్ధి అధికారి అబ్దుల్ సలాం తెలిపారు. అలాగే మండలంలో 14 మంది కొత్త లబ్ధిదారులకు జీవిత భాగస్వామి (స్పౌస్) కోటాలో పెన్షన్లు మంజూరయ్యాయని చెప్పారు. స్థానిక రజక వీధికి చెందిన బత్తుల విజయ లక్ష్మి (48) పక్షవాతంతో ఐదేళ్లుగా మంచానికే పరిమితమై ఉండటంతో వికలాంగుల కోటాలో నెలకు రూ.6,000 పెన్షన్ ను అందజేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించినట్లు తెలిపారు. గురువారం నుంచి మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వికసిత్ భారత్ రామ్ జి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. అలాగే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిదినాలను 100 నుంచి 125 రోజులకు పెంచే నిర్ణయంపై గ్రామ సచివాలయాల వద్ద అవగాహన బ్యానర్లు ఏర్పాటు చేసి ప్రజలకు వివరాలు తెలియజేస్తామని ఎంపీడీవో అబ్దుల్ సలాం తెలిపారు.

## వైద్యుల సేవలు సమాజానికి అమూల్యం

- డాక్టర్స్ డే సందర్భంగా ఘన సన్మానం





**ప్రజాభూమి ప్రతినిధి - ఆగిరిపల్లి**

డాక్టర్స్ డే సందర్భంగా బుధవారం ఆగిరిపల్లి, ఈదర, సద్గురు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు చంద్రమౌళీశ్వరరావు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్యులు రాత్రింబవళ్లు నిస్వార్థంగా సేవలందిస్తున్నారని, వారి సేవలు సమాజానికి అమూల్యమైనవని, ప్రతి ఒక్కరూ వైద్య వృత్తిని గౌరవించాలని అన్నారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులు రాజు, చంద్రమౌళీశ్వరరావు, శ్యామ్, రవికుమార్, బాబురావు ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్ టీనా, డాక్టర్ మహతిలను దుశ్శాలువాలతో సత్కరిం చి ఘనంగా సన్మానించారు. ఇదే విధంగా ఈదర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ నరేంద్ర కృష్ణ, డాక్టర్ జ్ఞాన సందీప్‌లకు, సగ్గూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ మంజులదేవి, డాక్ట ర్ సంధ్యాప్రియలకు మధ్యస్థాయి ఆరోగ్య సేవల అధికారిణిలు, ఆసుపత్రి సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి కేక్ కట్ చేసి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.

# రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుందున్న దుగ్గుదుర్రు డయేరియా బాదితులు

- కడుపు నొప్పితో బాధపడుతున్న చిన్నారులు
- సంచలనం రేపిన ఘటనకు స్పష్టతలేని వైనం
- ఘటనపై అదికారులు స్పష్టమైన కారణాలు తెలపాలి బాధిత కుటుంబాలు



**ప్రజాభూమి ప్రతినిధి - రామచంద్రపురం**

కాజులూరు మండలం దుగ్గుదర్రు గ్రామంలో ఫుడ్ పాయిజన్ ఘటన కలకలం రేపిన సంఘన తెలిసిందే. అయితే స్థానిక దుగ్గుదుర్రు పిహెచ్‌సిలో పలువురు బాధితులు వైద్య సేవలు పొందినప్పటికీ ఇదే ఘటనలో సుమారు 8 మంది బదితులు రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో ఐదు రోజులుగా వైద్య సేవలు పొందుతున్నారు. ఇందులో గ్రామంలో రాహదారి పక్కన స్థానికంగా బండిపై విక్రయించే బజ్జీల దుకాణం యజమాని కారంపూడి శ్రీనుకు చెందిన నందిన, శరత్ కుమార్ లుతోపాటు ఇదే గ్రామానికి చెందిన దుర్గా ప్రసాద్ భార్య గాయత్రి దేవి, ఆమె పిల్లలు అమృత, సంజీవ్,మందపల్లి నాగమణి,దీపికా, గీతిక తదితరులు ఇంకా వైద్యసేవలు పొందుతున్నారు. ముఖ్యంగా ఐదురోజులు నుండి ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ వీరిని ఇంకా కడుపునొప్పి బాద వెంటాడుతోందని బాదితులు ఆంధ్రప్రభకు తెలియజేశారు. కేవలం 20 రూపాయలు చల్లపునులు తిన్న దుర్గా ప్రసాద్ కుటుంబ సభ్యులు ముగ్గురూ ఈఘటనలో డయేరియా బారినపడి ఇంకా కోలుకోలేని పరిస్థితి నెలకొంది. సుమారు 32 మంది పైగా అస్వస్థతకు గురై జ్వరం, వాంతులు, విరేచనాలతో దుగ్గుదూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ)లో చికిత్స పొంది డిశ్చార్జి అయ్యారని దుగ్గుదుర్రు పిహెచ్సి డాక్టర్ సుప్రియ తెలియజేసి నప్పటికీ ఈ ఘటనలో ఇంకా పలువురు బాధ్యతలు కాకినాడ, ద్రాక్షారామం, రామచంద్రపురం తదితర చోట్ల వైద్య సేవలు పొందినప్పటికీ ఇంకా రామచంద్రపురం ఏరియా హాస్పిటల్లో బుధవారం నాటికి ఎనిమిది మంది బాధితులు ఇంకా వైద్య సేవలు పొందుతున్నారు. వీరికి ప్రత్యేకంగా కడుపు నొప్పి బాధ ఎక్కువగా ఉందని బాధితులు తెలపగా ఇంకా రెండు మూడు రోజులు వైద్య సేవలు అందాల్సిన అవసరం ఉందని స్థానికంగా డ్యూటీలో ఉన్న డాక్టర్ తెలియజేశారు.

డయేరియాకి కారణాలు ఇప్పటికీ తెలియలేదు. డయేరియాతో ఒక్కసారిగా పెద్ద సంఖ్యలో రోగులు దుగ్గుదుర్రు ఆసుపత్రికి రావడంతో బాదితులు తిన్న సల్లపునుకులే కారణమని భావించి వైద్యసేవలు అందించిన బాధితులు ఇప్పటికీ కడుపు నొప్పి బాధతో ఐదురోజులగా ఉండడంతో అసలు బాదితులు తిన్న ఆబజ్జీల్లో ఏవిధమైన పుడ్ పాయిజన్ కలిగి ఉందో తెలుసుకునే ప్రయత్నం చేసారా లేదా అని స్థానికులు మండిపడుతున్నారు. కేవలం ఆరోజు మాత్రమే హడావుడిగా బాదితులకు వైద్యం చేసి ప్రాణాలబారినుండి బయటపడినా బాదితులు మాత్రం ఏకారణంతో డయేరియా బారిన పడ్డారో ఇప్పటికీ స్పష్టమైన కారణాలు వైద్య శాఖ తెలపక పోవడం పట్ల బాదిత కుటుంబానికి చెందిన పలువురు మండిపడుతున్నారు. జరిగ ఈ సంఘటనపై వైద్యశాఖ ఏ రీతిలో స్పందించి న్యాయం చేస్తుందని పలువురు ప్రశ్నిస్తున్నారు.

**ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ రాలేదు బడ్డీ యజమాని శ్రీను**

గత కొద్ది సంవత్సరాలుగా తాను బండిపై బజ్జీలు అమ్ముకుంటూ జీవనోపాధి సాగిస్తున్నానని ఇలాంటి పరిస్థితి ఎప్పుడు రాలేదని తన కుమారుడు, కుమార్తె కూడా అదే రోజు చల్లపునుగులు తిని డయేరియా బారినపడి రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్నారని శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. అయితే తాను ఎప్పట్లాగే అదే రోజు కూడా బజ్జీలు వేసి విక్రయించానని అంతకు మించి తనకు ఏం తెలియదని శ్రీను తెలియజేశారు. అయితే శుక్రవారం బజ్జీలు తిన్న తిన్నవారు మాత్రం కొద్ది గంటల వ్యవధిలోనే వాంతులు, విరోచనాలు, జ్వరం కడుపు నొప్పితో బాధపడుతూ రాత్రి సమయం కావడంతో నిర్లక్ష్యం చేయడంతో శనివారం ఉదయానికి మరింతగా ప్రభావం చూపుడంతో స్థానిక ఆసుపత్రిలో చేరడంతో వైద్య సేవలు అందించి నప్పటికీ పూర్తి స్థాయిలో కోలుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో గ్రామంలో పలువురు గ్రామ విడిచి వెళ్లి వివిధ చోట్ల ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరి వైద్యసేవలు పొందారు. కానీ రామచంద్రపురం ఏరియా హాస్పిటల్ లో చేరిన సుమారు 8 బాదితులు మాత్రం ఇంకా ఆస్పత్రిలోనే ఉంటూ వైద్య సేవలు పొందుతున్నారు.

**డయేరియాకు కారణాలు అధికారులు వెల్లడించాలి**

దుగ్గుదర్రు గ్రామంలో ఒక్కసారిగా సంచలన సృష్టించిన డయేరియా రావడానికి గల కారణాలు వైద్యాధికారులు వెల్లడించాలని బాధిత కుటుంబాలతో పాటు గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఎప్పటికైనా సంబంధిత జిల్లా వైద్యశాఖ అధికారులు ఈ ఘటనపై ప్రత్యేకించి విచారణ చేసి బాధితులకు స్పష్టమైన కారణాలు తెలియజేయాల్సిన అవసరం అంతేనా ఉంది.

